ESTD: 1999 25-10-2026 ఆదివారం www.voodayam.com

వుదయం

వరంగల్ | 01-11-2026 ఆదివారం | సంపుటి : 11 | సంచిక : 317 SINCE 27 YEARS CIRCULATED TELUGU DAILY రూ. 3.00 | పేజీలు : 12 VOODAYAM Telugu DAily

Simultaneously Published from Warangal , Hyderabad, Adilabad, Karimnagar, Khammam & Guntur Follow us on

రైతులకు నష్టం కలగకుండా ప్రభుత్వ ప్రణాళికలు

హైదరాబాద్, అక్టోబర్ 31 (వుదయం)

తెలంగాణలో ప్రభుత్వం పంటల సాగుకు విరామం ప్రకటించిందంటూ జరుగుతున్న ప్రచారంపై వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పష్టతనిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం ఎక్కడా పంటల విరామంపై ప్రకటన చేయలేదని వెల్లడించారు. ప్రతిపక్షాలు చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని రైతులు నమ్మి ఆందోళన చెందవద్దని సూచించారు. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా ఎల్‌నినో ప్రభావం వ్యవసాయ రంగంపై ప్రతికూల ప్రభావం చూపుతోందని మంత్రి పేర్కొన్నారు. ఈ పరిస్థితులను ముందుగానే అంచనా వేసి రాష్ట్రంలో ఆరుతడి పంటల సాగును ప్రోత్సహించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని తెలిపారు. రైతులకు ప్రత్యామ్నాయ పంటల సాగుపై అవగాహన కల్పించడంతోపాటు, అవసరమైన విత్తనాలను రాయితీ ధరలకు అందుబాటులో ఉంచుతున్నట్లు వివరించారు. గత ఆరు నెలలుగా ఎల్‌నినో ప్రభావం, దాని వల్ల ఎదురయ్యే పరిణామాలపై రైతులకు నిరంతరం

అవగాహన కల్పిస్తున్నామని తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. వాతావరణ పరిస్థితుల కారణంగా రైతులు ఆర్థికంగా నష్టపోకుండా ప్రభుత్వం ముందస్తు ప్రణాళికతో అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటోందని స్పష్టం చేశారు. రైతుల ప్రయోజనాలను పరిరక్షించడమే ప్రభుత్వ ధ్యేయమని పేర్కొన్నారు.

ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ రాజీనామా చేయాలి: ఖర్గే

న్యూఢిల్లీ, అక్టోబర్ 31 (ఏఎంఎస్) :

ఓట్ల చోరీ, కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్‌కుమార్ వ్యవహారశైలిని నిరసిస్తూ ఇండియా కూటమి నేతలు తమ ఆందోళనను మరింత ఉధృతం చేశారు. గత కొంతకాలంగా కొనసాగుతున్న నిరసనల్లో భాగంగా దిల్లీలోని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నివాసంలో ప్రజా అభిశంసన కార్యక్రమాన్ని నిర్వహించారు. మాజీ లోక్‌సభ స్పీకర్ మీరా కుమార్ అధ్యక్షతన కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ నమూనా పార్లమెంటు సమావేశానికి దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన కాంగ్రెస్ నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా జ్ఞానేశ్‌కుమార్‌కు వ్యతిరేకంగా ఖర్గే అభిశంసన తీర్మానాన్ని ప్రవేశపెట్టారు.ఈ సందర్భంగా మల్లికార్జున ఖర్గే మాట్లాడుతూ.. అధికారాన్ని కాపాడుకునేందుకు భాజపా 2014 నుంచి అనేక కుట్రలకు పాల్పడుతోందని ఆరోపించారు.

చమురు సరఫరాకు అడ్డంకులు సృష్టించడం తగదు: జైశంకర్

న్యూఢిల్లీ, అక్టోబర్ 31 (ఏఎంఎస్) :

అంతర్జాతీయంగా చమురు సరఫరాకు ఆటంకాలు కలిగించే చర్యలను భారత విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ తీవ్రంగా తప్పుబట్టారు. ఆంక్షలు విధించడం, కీలకమైన చమురు రవాణా మార్గాలను అడ్డుకోవడం ద్వారా ప్రపంచ ఇంధన వాణిజ్యాన్ని దెబ్బతీయడం సరికాదని హితవు పలికారు. ఇంధన ధరలపై నియంత్రణ సాధించాలనే ఉద్దేశంతో కొన్ని దేశాలు వాణిజ్య మార్గాలపై కావాలనే దాడులకు పాల్పడుతున్నాయని విమర్శించారు. ప్రస్తుతం ప్రపంచం ఎదుర్కొంటున్న చమురు సంక్షోభానికి ఉత్పత్తి తగ్గుదల ప్రధాన కారణం కాదని, అనిశ్చితి, సరఫరాలో ఆటంకాలు, అధిక ధరలు, ఇంధనం అందుబాటులో లేకపోవడం వంటి అంశాలే అసలు సమస్యలని వివరించారు.

జీ20 దేశాల విదేశాంగ మంత్రుల సమావేశంలో ప్రసంగించిన జైశంకర్ ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ సమావేశానికి అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో కూడా హాజరయ్యారు. ఇరాన్ చమురు విక్రయాలపై అమెరికా విధించిన ఆంక్షలు, పశ్చిమాసియా నుంచి ఇంధన సరఫరాలో ఎదురవుతున్న ఇబ్బందులు, రష్యా డీజిల్ విక్రయాలకు కలుగుతున్న అడ్డంకుల నేపథ్యంలో జైశంకర్ వ్యాఖ్యలు అంతర్జాతీయంగా ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

ప్రపంచ మార్కెట్లలో దేశాల మధ్య ఉన్న పరస్పర ఆధారిత సంబంధాలను విస్మరించరాదని ఆయన సూచించారు. భారతదేశానికి గృహ అవసరాల కోసం నిరంతరాయంగా, నమ్మకమైన వంటగ్యాస్ సరఫరా ఎంతో అవసరమని స్పష్టం చేశారు. ఇంధన అవసరాలను తీర్చుకునేందుకు ఆర్థిక వనరుల పరిధిని విస్తరించాలని జీ20 దేశాలకు పిలుపునిచ్చారు. చిన్న పరిమాణంలో నిర్మించే అణు విద్యుత్ రియాక్టర్లు, హరిత హైడ్రోజన్, జీవ ఇంధనాల వినియోగం, అభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు.

అంతర్జాతీయ సమస్యలకు సైనిక చర్యలు శాశ్వత పరిష్కారాన్ని చూపలేవని జైశంకర్ అభిప్రాయపడ్డారు.

బాలల భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత

న్యాయమూర్తి ఎం.కె. పద్మావతి

హయత్‌నగర్, రంగారెడ్డి జిల్లా అక్టోబర్ 31 (వుదయం) :

బాలల హక్కుల పరిరక్షణ, వారి భద్రతపై విద్యార్థులకు అవగాహన కల్పించే లక్ష్యంతో జాతీయ న్యాయ సేవాధికార సంస్థ మార్గదర్శకత్వంలో, తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు రంగారెడ్డి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో హయత్‌నగర్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 'సురక్షిత బాల్యం అభియాన్' కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అత్యాచార, పోక్సో కేసుల విచారణకు సంబంధించిన ప్రత్యేక న్యాయస్థాన న్యాయమూర్తి ఎం.కె. పద్మావతి విద్యార్థులకు బాలల రక్షణ, హక్కులు, బాలలపై లైంగిక నేరాల నుంచి రక్షణ చట్టం2012పై అవగాహన కల్పించారు. బాలలపై జరిగే లైంగిక వేధింపులను అరికట్టేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వారికి కల్పించాల్సిన రక్షణ గురించి వివరించారు. బాలల భద్రత విషయంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సమాజంలోని ప్రతి ఒక్కరూ బాధ్యతతో వ్యవహరించాలని సూచించారు.

ఈ సందర్భంగా హయత్‌నగర్ కోర్టు న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు లింగం గౌడ్, ప్రధాన కార్యదర్శి రామ్ మోహన్ విద్యార్థులకు మంచి స్పర్శ, చెడు స్పర్శ మధ్య తేడాలను వివరించారు. బాలలపై జరిగే లైంగిక వేధింపులను ఎలా గుర్తించాలి, అలాంటి పరిస్థితులు ఎదురైనప్పుడు ఎవరికి ఫిర్యాదు చేయాలి, తమను తాము ఎలా రక్షించుకోవాలి అనే అంశాలపై అవగాహన కల్పించారు. హయత్‌నగర్ వలయ పోలీసు అధికారి శంకరయ్య, ఉప పరిశీలకుడు కూడా కార్యక్రమంలో పాల్గొని బాలలపై లైంగిక నేరాల నిరోధక చట్టంలోని నిబంధనలు, వాటి ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. జిల్లా బాలల పరిరక్షణ అధికారి ప్రవీణ్ బాలలపై లైంగిక వేధింపుల నివారణ, పోక్సో చట్టం, బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలు, వాటిని అరికట్టేందుకు తీసుకోవాల్సిన చర్యల గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రమాదేవి, ఉపాధ్యాయులు, న్యాయ సేవా సహాయక స్వచ్ఛంద కార్యకర్తలు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు. బాలల భద్రత, హక్కుల పరిరక్షణపై ప్రతి విద్యార్థికి అవగాహన ఉండటం ఎంతో అవసరమని కార్యక్రమంలో వక్తలు పేర్కొన్నారు.

ఓటర్ల తొలగింపుపై కాంగ్రెస్ తప్పుడు ప్రచారం: కిషన్‌రెడ్డి

హైదరాబాద్, అక్టోబర్ 31 (వుదయం)

> **అక్రమ వలసదారుల ఓట్లను తొలగించకూడదా?**
> **ఓటమి ఎదురైతే ఈవీఎంలపై విషప్రచారం కాంగ్రెస్‌కు అలవాటు**
> **చనిపోయిన వారి ఓట్లను కొనసాగించాలా?**

దేశవ్యాప్తంగా 13 కోట్ల మంది ఓటర్ల పేర్లను తొలగించారంటూ కాంగ్రెస్ చేస్తున్న ఆరోపణలపై కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి తీవ్రంగా స్పందించారు. ఓటర్ల తొలగింపునకు సంబంధించిన వాస్తవాలను వెల్లడించకుండా కాంగ్రెస్ రాజకీయ ఆరోపణలకు దిగుతోందని విమర్శించారు. తొలగించిన వారిలో 2.8 కోట్ల మంది ఇప్పటికే మరణించిన వారని, మరణించిన వారి పేర్లను ఓటరు జాబితా నుంచి తొలగించకూడదా? అని ప్రశ్నించారు.

దేశవ్యాప్తంగా సుమారు 6.30 కోట్ల మంది ఓటర్లు శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిపోయారని, ప్రస్తుతం వారి ఆచూకీ తెలియడం లేదని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ విషయమై ఎన్నికల సంఘం నోటీసులు జారీ చేసినప్పటికీ వారి నుంచి ఎలాంటి స్పందన రావడం లేదని తెలిపారు. కాంగ్రెస్‌కు నిజంగా చిత్తశుద్ధి ఉంటే ఆ 6.30 కోట్ల మంది ఓటర్ల ఆచూకీని గుర్తించి, అందుకు సంబంధించిన ఆధారాలను ఎన్నికల సంఘానికి సమర్పించాలని సవాల్ విసిరారు.

మరణించిన వ్యక్తులు, నకిలీ ఓటర్లు, ఆచూకీ తెలియని వలసదారుల పేర్లను కూడా ఓటరు జాబితాలో కొనసాగించాలన్నదే కాంగ్రెస్ డిమాండా? అని ఆయన నిలదీశారు. హైదరాబాద్ పాతబస్తీతో పాటు మహేశ్వరం నియోజకవర్గాల్లో 2014కు ముందే పాకిస్థాన్, బంగ్లాదేశ్, అఫ్గానిస్థాన్ తదితర దేశాల నుంచి అక్రమంగా వలస వచ్చిన వేలాది మందికి ఓటు హక్కు కల్పించారని ఆరోపించారు. ఇలాంటి అక్రమ ఓట్లను తొలగించాలా? వద్దా? అనే విషయాన్ని ప్రజలే నిర్ణయించాలని కోరారు.

ఇదే అంశంపై మరో కేంద్రమంత్రి బండి సంజయ్ స్పందిస్తూ మాజీ ప్రధాని పీవీ నరసింహారావు 2004లోనే మరణించినప్పటికీ, ఆయన పేరు ఇప్పటికీ ఓటరు జాబితాలో కొనసాగుతోందని పేర్కొన్నారు. మరణించిన వ్యక్తి ఓటును జాబితా నుంచి తొలగించాలా? వద్దా? అని ప్రశ్నించారు. ఎన్నికల్లో ఓటమి పాలైన ప్రతిసారీ ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలపై ఆరోపణలు చేస్తూ విషప్రచారానికి దిగడం కాంగ్రెస్ పార్టీకే చెల్లిందని బండి సంజయ్ విమర్శించారు.

2047 నాటికి వికసిత్ భారత్ లక్ష్యాన్ని చేరుకోవాలి: మోదీ

> **దేశ ఐక్యతే మన బలం.. పటేల్ ఆశయాలే మనకు మార్గదర్శకం**
> **విభజన రాజకీయాలకు తావివ్వొద్దు.. ఐక్యంగా అభివృద్ధి సాధిద్దాం**

ఏక్తానగర్, అక్టోబర్ 31 (ఏఎంఎస్) :

దేశ ఐక్యత, సమగ్రతలే భారతదేశాన్ని అభివృద్ధి పథంలో ముందుకు నడిపిస్తున్నాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. దేశాన్ని ఏకతాటిపైకి తీసుకొచ్చి, సురక్షితమైన దేశంగా తీర్చిదిద్దడంలో సర్దార్ వల్లభభాయ్ పటేల్ కీలక పాత్ర పోషించారని కొనియాడారు. ఆయన ఆశయాలు, చూపిన బాటలోనే దేశం ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. సర్దార్ వల్లభభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకుని గుజరాత్‌లోని ఏక్తానగర్‌లో శుక్రవారం నిర్వహించిన జాతీయ ఐక్యతా దినోత్సవంలో ప్రధాని నరేంద్ర మోదీ పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ప్రతిపక్షాలపై విమర్శలు గుప్పించారు. విభజన రాజకీయాలకు పాల్పడటం విచారకరమని పేర్కొంటూ, దేశంలో అస్థిరత సృష్టించేందుకు ప్రయత్నించే శక్తుల కుట్రలను ప్రజలంతా ఐక్యంగా తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు.

గత ప్రభుత్వాలు పేదరిక నిర్మూలన పేరుతో కేవలం నినాదాలకే పరిమితమయ్యాయని మోదీ విమర్శించారు. తమ ప్రభుత్వం గత పన్నెండేళ్లుగా అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల ఫలితంగా దేశంలో పేదరికం గణనీయంగా తగ్గి మూడు శాతానికి దిగువకు చేరిందని వివరించారు. భారత్‌లో పేదరికం భారీగా తగ్గినట్లు ప్రపంచ బ్యాంకు తాజా నివేదిక కూడా వెల్లడించిందని గుర్తుచేశారు. నక్సలైట్ల హింస నుంచి దేశానికి విముక్తి కల్పించామని, అయితే మేధో నక్సల్స్ రూపంలో కొందరు సమాజంలో అశాంతిని రేకెత్తించేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు.

ప్రజల మధ్య ఐక్యత ఉన్నంతకాలం దేశ వ్యతిరేక శక్తుల ఆటలు సాగవని ప్రధాని స్పష్టం చేశారు. భారతదేశ ప్రగతిని అడ్డుకోవడం ఎవరికీ సాధ్యం కాదన్నారు. ప్రతి ఒక్కరూ 'ఏక్ భారత్.. శ్రేష్ఠ భారత్' స్ఫూర్తిని అలవర్చుకోవాలని సూచించారు. దేశ ప్రజలంతా సమష్టిగా కృషి చేస్తే 2047 నాటికి వికసిత్ భారత్ లక్ష్యాన్ని తప్పకుండా సాధించగలమని నరేంద్ర మోదీ ధీమా వ్యక్తం చేశారు.

భూముల పరిరక్షణలో బీఆర్‌ఎస్‌దే కీలక పాత్ర

హైదరాబాద్, అక్టోబర్ 31 (వుదయం)

మియాపూర్ భూముల వ్యవహారంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బీఆర్‌ఎస్ నాయకులపై నిరాధార ఆరోపణలు చేస్తున్నారని మాజీ మంత్రి హరీశ్‌రావు మండిపడ్డారు. అబద్ధాలు చెప్పడంలో రేవంత్‌రెడ్డి ఆరితేరారని, ఆయన అబద్ధాలకు ఆస్కార్ అవార్డు ఇవ్వొచ్చని ఎద్దేవా చేశారు. భవిష్యత్తులో అబద్ధాలకు బ్రాండ్ అంబాసిడర్‌గా ముఖ్యమంత్రి నిలిచిపోతారని విమర్శించారు. మియాపూర్ భూములు తెలంగాణ ప్రభుత్వానికే చెందుతాయని సుప్రీంకోర్టు స్పష్టం చేసిన నేపథ్యంలో రేవంత్‌రెడ్డి బీఆర్‌ఎస్ నేతలపై చేసిన వ్యాఖ్యలను హరీశ్‌రావు తీవ్రంగా తప్పుబట్టారు. వాస్తవాలను వక్రీకరిస్తూ అబద్ధాల ద్వారా రాజకీయ లబ్ధి పొందాలని చూస్తున్నారని ఆరోపించారు. సుప్రీంకోర్టు తీర్పు పూర్తి ప్రతే అందకముందే ఆ భూములను విక్రయించాలనే తొందర ముఖ్యమంత్రిలో కనిపించిందని విమర్శించారు.

గతంలో కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో సీనియర్ న్యాయవాది వైద్యనాథన్‌ను నియమించి, ప్రభుత్వ భూములను కాపాడేందుకు న్యాయపోరాటం చేశారని హరీశ్‌రావు గుర్తుచేశారు. మంచిరేవులలోని 142 ఎకరాల భూమిని పరిరక్షించినట్లు చెప్పుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం.. అదే భూములను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించేందుకు ప్రయత్నించిందని ఆరోపించారు. ఇందులో భాగంగా మంచిరేవులలోని పది ఎకరాల భూమిని ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టిందని విమర్శించారు. భూపాలపల్లి, హయత్‌నగర్ ప్రాంతాల్లోని ప్రభుత్వ భూములను కాపాడేందుకు బీఆర్‌ఎస్ ప్రభుత్వం అన్ని విధాలా చర్యలు తీసుకుందని పేర్కొన్నారు. మరోవైపు సెంట్రల్ యూనివర్సిటీకి చెందిన భూములను తాకట్టు పెట్టి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రూ.10 వేల కోట్ల రుణం తీసుకున్నారని హరీశ్‌రావు ఆరోపించారు. ప్రభుత్వ భూముల పరిరక్షణ విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరిని ప్రజలు గమనిస్తున్నారని వ్యాఖ్యానించారు.

ఇరాన్‌తో యుద్ధం ముగింపుపై తొందరేమీ లేదు

వాషింగ్టన్: ఇరాన్‌తో కొనసాగుతున్న యుద్ధం అమెరికాపై పెద్దగా ఆర్థిక భారం మోపలేదని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యానించారు. వెనెజువెలా నుంచి భారీ మొత్తంలో ముడిచమురును తరలించడం ద్వారా వచ్చిన ఆదాయంతో యుద్ధ వ్యయాన్ని పూర్తిగా భర్తీ చేసినట్లు వెల్లడించారు. అయితే చమురు విక్రయాల ద్వారా ఎంత ఆదాయం సమకూరిందనే వివరాలను మాత్రం ఆయన వెల్లడించలేదు. ఇరాన్‌తో యుద్ధాన్ని ముగించేందుకు తాము తొందరపడటం లేదని స్పష్టం చేశారు.

ఇంతే కదా...!

ఓటు చోరీపై పోరాటం ప్రజాస్వామ్య పరిరక్షణకు మూలం

ప్రజల ఓటుతో అధికారంలోకి రావడం ఒక ఎత్తు.. ఆ ప్రజల ఓటు హక్కునే కాపాడటం మరో ఎత్తు! ఎన్నికల్లో గెలుపోటములు సహజం. కానీ ప్రజల తీర్పు స్వేచ్ఛగా, నిష్పాక్షికంగా ప్రతిబింబిస్తుందా లేదా అన్న సందేహాలు తలెత్తినప్పుడు మౌనంగా ఉండటం ప్రజాస్వామ్యవాదుల లక్షణం కాదు. ఓటర్ల జాబితాల్లో అక్రమాలపై ఆరోపణలు, అర్హులైన ఓటర్ల పేర్ల తొలగింపుపై ఆందోళనలు, ఎన్నికల ప్రక్రియ పారదర్శకతపై ప్రశ్నలు దేశ రాజకీయాల్లో ప్రాధాన్యం సంతరించుకున్న ప్రస్తుత తరుణంలో ప్రజాస్వామ్య పరిరక్షణ పరమావధిగా భావించే పార్టీల బాధ్యత మరింత పెరిగింది. ఇది కేవలం రాజకీయ ప్రత్యర్థితో తలపడే సమయం కాదు.. ప్రజాస్వామ్య విలువల పరిరక్షణకు ప్రజలను సమీకరించాల్సిన సమయం. అందుకే ఓటు చోరీపై ఉద్యమించి ప్రజాస్వామ్యాన్ని కాపాడే పోరులో భాగస్వాములవడం తక్షణావసరం . ఓటు అనేది కేవలం ఎన్నికల రోజున వేలికి వేసే సిరా గుర్తు కాదు. అది సామాన్యుడికి రాజ్యాంగం కల్పించిన అధికార చిహ్నం. ధనబలం, అధికారబలం, సామాజిక హోదాలతో సంబంధం లేకుండా దేశ భవిష్యత్తును నిర్ణయించే అవకాశం ప్రతి పౌరుడికీ కల్పించేదే ఓటు హక్కు. అలాంటి హక్కుకు భంగం కలిగిందన్న అనుమానాలు తలెత్తితే వాటిని నివృత్తి చేయాల్సిన బాధ్యత ఎన్నికల వ్యవస్థపై ఉంటుంది. ఆరోపణలు ఏవైనా సరే, వాటిపై ఆధారాలతో విచారణ జరగాలి. అర్హులైన ఓటర్ల పేర్లు తొలగిపోకుండా చూడాలి. ఎన్నికల ప్రక్రియపై ప్రజల్లో విశ్వాసం నిలిచేలా పారదర్శకమైన చర్యలు తీసుకోవాలి. ఈ డిమాండ్ల సాధన కోసం గొంతెత్తడం ఏ రాజకీయ పార్టీకి వ్యతిరేకమైన చర్య కాదు.. ప్రజాస్వామ్యానికి అనుకూలమైన బాధ్యత. ప్రతిపక్ష కూటమి ఈ పోరాటంలో అగ్రభాగాన ఉన్నది .. ఈ పోరాటాన్ని సభలు, సమావేశాలు, నినాదాలకే పరిమితం చేయకుండా ప్రజల మధ్యకు తీసుకెళ్తున్నది! గ్రామగ్రామాన, వార్డువార్డున ఓటర్ల జాబితాలను పరిశీలించే ప్రక్రియ చేపట్టింది . అర్హులైన వారి పేర్లు ఉన్నాయో లేదో తెలుసుకునే దిశగా పనిచేస్తున్నది . పేర్లు గల్లంతైనవారికి, వివరాల్లో తప్పులున్న వారికి నిబంధనల ప్రకారం సవరణలు చేయించుకునేందుకు సహకరిస్తున్నది. ఓటు హక్కుపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నది. సమస్యలను గుర్తించి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్తున్నది. ప్రజల ఓటు హక్కుకు రక్షణ కల్పించే బాధ్యతను క్షేత్రస్థాయిలో నిర్వర్తిస్తున్నది. ప్రజల సమస్యలతో మమేకమైనప్పుడే ఈ ఉద్యమానికి విశ్వసనీయత పెరుగుతుంది. ఓటు చోరీపై వస్తున్న ఆరోపణలను ప్రజల్లోకి తీసుకెళ్లడమే కాదు.. వాటికి సంబంధించిన ఆధారాలను సేకరించి వాస్తవాలను ప్రజల ముందుంచుతున్నది. ఆరోపణలను నిర్ధారిత సత్యాలుగా ముందుగానే ప్రచారం చేయకుండా, నిష్పాక్షిక విచారణ జరగాలని పట్టుబడుతున్నది . ఓటర్ల జాబితాల్లో మార్పులు, చేర్పులు, తొలగింపులకు స్పష్టమైన విధానం ఉండాలని కోరుతున్నది . అర్హులైన ఓటర్లకు అభ్యంతరాలు తెలిపే అవకాశం కల్పించాలని డిమాండ్ చేస్తున్నది. ఎన్నికల సంఘం ప్రజల సందేహాలకు సమాధానమిచ్చేలా ఒత్తిడి తీసుకువస్తున్నది . ఆధారాలతో ప్రశ్నిస్తున్నది.. రాజ్యాంగబద్ధంగా పోరాడుతున్నది. పారదర్శకత సాధించే వరకు పట్టు విడవకుండా ముందుకు సాగుతున్నది. ఈ పోరాటం ఇండియా కూటమి కార్యకర్తలతోనే ముగిసిపోకూడదు. ఓటు హక్కు ఏ ఒక్క పార్టీ సొంతం కాదు. అది ప్రతి భారతీయుడి రాజ్యాంగ హక్కు. అందుకే విద్యార్థులు, యువత, ఉద్యోగులు, కార్మికులు, రైతులు, న్యాయవాదులు, పాత్రికేయులు, ప్రజాస్వామ్యవాదులను ఈ ఉద్యమంలో భాగస్వాములను చేద్దాం. రాజకీయ అనుబంధాలకు అతీతంగా ప్రజల ఓటు హక్కు పరిరక్షణ కోసం అందరినీ కలుపుకుపోదాం. పార్టీ జెండా మనకు గుర్తింపు కావచ్చు.. కానీ ప్రజాస్వామ్య పరిరక్షణే మన ఉద్యమానికి ప్రాణం కావాలి. ప్రతిపక్ష శ్రేణుల కదలిక ప్రజల్లో నమ్మకాన్ని కలిగించాలి. మన పోరాటం ఒక పార్టీ రాజకీయ ప్రయోజనం కోసమే కాదని, ప్రజలందరి హక్కుల కోసం సాగుతున్నదని మన కార్యాచరణ నిరూపించాలి. నిరసనల్లో పాల్గొనడం ఎంత ముఖ్యమో, వాటిని బాధ్యతాయుతంగా నిర్వహించడం కూడా అంతే ముఖ్యం. శాంతియుత ఆందోళనలు, చట్టబద్ధమైన నిరసనలు, ప్రజా చైతన్య కార్యక్రమాల ద్వారా ఉద్యమానికి నైతిక బలాన్ని చేకూర్చుదాం. హింసకు, విద్వేషానికి, తప్పుడు సమాచారానికి దూరంగా ఉందాం. ప్రజాస్వామ్యాన్ని కాపాడే పోరాటం ప్రజాస్వామిక విలువలతోనే సాగాలి. పార్టీ నాయకత్వం కూడా కార్యకర్తలకు స్పష్టమైన కార్యాచరణ అందించాలి. ఫిర్యాదుల పరిష్కారాన్ని పర్యవేక్షించాలి. ఓటర్ల జాబితాలపై వచ్చిన సమస్యలను క్రమబద్ధంగా నమోదు చేసి, వాటిపై నిరంతరంగా పోరాడే వ్యవస్థను నిర్మించాలి. ఒక్కరోజు నిరసనతో సరిపెట్టుకోకుండా ప్రజలకు ఉపయోగపడే నిరంతర ఉద్యమాన్ని సాగిద్దాం. స్వతంత్ర ఉద్యమ కాలం నుంచీ కాంగ్రెస్ పార్టీకి ప్రజాస్వామ్య పరిరక్షణ పోరాటాల చారిత్రక నేపథ్యం ఉంది. అయితే గతాన్ని ప్రస్తావించుకోవడం మాత్రమే సరిపోదు. వర్తమానంలో ప్రజల హక్కుల కోసం ఎంత నిబద్ధతతో పనిచేస్తున్నామన్నదే అసలైన కొలమానం. ప్రజల మధ్యకు వెళ్లడం, వారి సమస్యలను గుర్తించడం, బాధితులకు సహకరించడం, ఆధారాలతో అధికారులను ప్రశ్నించడం ద్వారా ఆ వారసత్వాన్ని ఆచరణలో నిలబెట్టుదాం. ఎన్నికల్లో విజయం రాజకీయ లక్ష్యం కావచ్చు. కానీ ఎన్నికల వ్యవస్థపై ప్రజల విశ్వాసాన్ని కాపాడటం దేశ ప్రయోజనానికి సంబంధించిన బాధ్యత. ఈ రెండింటి మధ్య తేడాను గుర్తించినప్పుడే మన పోరాటానికి నైతిక బలం చేకూరుతుంది. ప్రజాస్వామ్యం ఎన్నికల రోజున ఓటు వేయడంతో ముగిసిపోదు. ఆ ఓటు విలువను కాపాడే నిరంతర అప్రమత్తతతోనే అది సజీవంగా ఉంటుంది. ఓటు హక్కుకు రక్షణ కల్పించాలంటే ప్రజలు చైతన్యవంతులు కావాలి. ప్రజలను చైతన్యవంతులను చేయాలంటే పార్టీల శ్రేణులు క్షేత్రస్థాయిలో క్రియాశీలంగా ఉండాలి. ప్రజల తీర్పు స్వేచ్ఛగా ప్రతిబింబించే ఎన్నికల వ్యవస్థ కోసం నిరంతరం కృషి చేయాలి. ఇది వెనుకడుగు వేసే సమయం కాదు.. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ముందడుగు వేసే సమయం. ఇది ప్రేక్షకులుగా మిగిలిపోయే సమయం కాదు.. ప్రజల పక్షాన నిలిచే సమయం. ఇది రాజకీయ లెక్కల్లో మునిగిపోయే సమయం కాదు..రాజ్యాంగ హక్కుల కోసం ఐక్యంగా కదిలే సమయం. ఈ క్రమంలో .. ఓటు హక్కు పరిరక్షణ కోసం కదలాల్సిన గురుతర బాధ్యత పౌరులపై ఉన్నది ! ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు ప్రజలను సమీకరిస్తూ ఆధారాలతో ప్రశ్నించాల్సిన అవసరమున్నది. శాంతియుతంగా పోరాడుతూ న్యాయం జరిగే వరకు నిలబడాల్సిన కర్తవ్యం మనం స్వీకరించాలి. ఓటు ప్రజల హక్కు.. దాని పరిరక్షణ మన బాధ్యత. ప్రజల తీర్పుకు గౌరవం దక్కేలా చేయడమే మన సంకల్పం కావాలి. ప్రజాస్వామ్యాన్ని కాపాడే ఈ పోరాటంలో ప్రతి కార్యకర్త తన వంతు పాత్ర పోషించాలి. ప్రజల గొంతుకగా నిలవాలి .. ప్రజల హక్కుల కోసం కదలాలి. ప్రజాస్వామ్య పరిరక్షణలో మన బాధ్యతను ఎలుగెత్తి చాటాలి.

పెండ్యాల కొండల్

కేటీఆర్ ను కలసిన వాళ కుటుంబం ...

కోటపల్లి వుదయం
కోటపల్లి మండలం చెన్నూరు నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ ఆదేశాల మేరకు బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ గారి నివాసం లో మంచిర్యాల జిల్లా బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు వల శ్రీనివాసరావు దంపతులు వల శ్రీదేవి కుమారుడు సూరజ్ రావు కుటుంబ సభ్యులు శనివారం రోజున కేటీఆర్ నివాసం లో కేటీఆర్ ను మర్యాదపూర్వంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు ....

పల్లె వెలుగుకు ఎక్స్‌ప్రెస్ బోర్డు..
ప్రయాణికులపై ఛార్జీల బాదుడు

- **కల్వకుర్తి–హైదరాబాద్ మార్గంలో ప్రయాణికుల అవస్థలు**
- **ఎక్స్‌ప్రెస్ పేరుతో చార్జీలు.. ప్రతి స్టేజీలో బస్సు నిలుపుతున్నారు**

ఆమనగల్లు, అక్టోబర్ 31 (వుదయం):
కల్వకుర్తి డిపో నుంచి హైదరాబాద్‌కు నడిచే ఆర్టీసీ బస్సు ప్రయాణికులకు అసౌకర్యాల కష్టాలు తప్పడం లేదు. పల్లె వెలుగు బస్సుకు ఎక్స్‌ప్రెస్ బోర్డు ఏర్పాటు చేసి అధిక చార్జీలు వసూలు చేస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఎక్స్‌ప్రెస్ బోర్డుతో బస్సును నడుపుతున్నప్పటికీ మార్గమధ్యంలోని ప్రతి స్టేజీ వద్ద నిలుపుతుండటంతో ప్రయాణికులకు సమయం వృధా అవుతుంది. పేరుకు ఎక్స్‌ప్రెస్.. కానీ ఆర్డినరీ బస్ లాగా ప్రతి స్టాప్ ఆపుతున్నారు అని ప్రయాణికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

మరోవైపు బస్సుల్లో సీట్లు కూడా సౌకర్యవంతంగా లేకపోవడంతో దూర ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్నప్పటికీ పురుషులు మాత్రం టికెట్ చార్జీలు చెల్లించి సీటు దొరక్క నిలబడే ప్రయాణించాల్సి వస్తోందని వాపోతున్నారు. అధిక చార్జీలు చెల్లిస్తున్నా కనీస సౌకర్యాలు కల్పించకపోవడంపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ప్రయాణికులు డిపో మేనేజర్ గారిని సంప్రదించిన సంతృప్తికరంగా లేదని, ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. ఈ సమస్యలపై కల్వకుర్తి డిపో మేనేజర్‌ను ఫోన్ ద్వారా వివరణ కోరగా బస్సులు తక్కువగా ఉండటం వలన ఇలా చేయక తప్పడం లేదు అన్నారు డిపోకి బస్సులు రావాల్సి ఉంది ఎప్పుడు వస్తాయో తెలియదు అని వివరించారు కొత్త బస్సులు వచ్చే వరకు ఇలానే కొనసాగిస్తాం అని చెప్పుకొచ్చారు, కానీ ప్రయాణికుల సమస్యలను ఆలకించి పరిష్కరించాల్సిన అధికారులే ఇలా వ్యవహరించడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా ఆర్టీసీ ఉన్నతాధికారులు స్పందించి కల్వకుర్తి–హైదరాబాద్ మార్గంలో బస్సు సర్వీసులపై పరిశీలన జరిపి, చార్జీలకు తగ్గ ప్రయాణ సౌకర్యాలు కల్పించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

దేశ సమైక్యత, సమగ్రతకు
ప్రతి ఒక్కరూ కృషి చేయాలి: కలెక్టర్ ఖుష్బూ గుప్తా

మహబూబ్ నగర్ వుదయం
జాతీయ ఐక్యత దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం జిల్లా కలెక్టర్ కార్యాలయం సమావేశ మందిరంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి జిల్లా కలెక్టర్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. దేశాన్ని ఐకమత్యంగా ఉంచడంలో కృషిచేసిన ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని జాతీయ ఐక్యత దినోత్సవం గా నిర్వహించుకుంటున్నామని , దేశానికి దిశ,నిర్దేశం చేసిన ఆయన చిరస్మరణీయుడని అన్నారు. అనంతరం దేశ ఐకమత్యం,సమగ్రత, భద్రతను కాపాడటానికి స్వయంగా అంకిత మవుతానని,దేశ అంతర్గత భద్రతను పటిష్ట పరచడానికి స్వీయ తోడ్పాటు నందిస్తానని జిల్లా కలెక్టర్ ఏక్తా దినోత్సవ ప్రతిజ్ఞ చేయించారు. రెవెన్యూ అదనపు కలెక్టర్ జి ఎల్ ఠ హరిప్రియ,డి.ఆర్.ఓ ఏ.నిర్మల, జిల్లా అధికారులు,కలెక్టరేట్ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ వృత్తి ఎంతో ఉన్నతమైనది

- **మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్**

కేశంపేట , అక్టోబర్ 31, (వుదయం):
విద్యార్థులకు విద్యా బోధనలు నేర్పే ఉపాధ్యాయ వృత్తి ఎంత ఉత్తమమైనదని మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ అన్నారు. శనివారం మండల పరిధిలోని కొండారెడ్డిపల్లి గ్రామానికి చెందిన ఉపాధ్యాయులు బాలకృష్ణ రావు మారేపల్లి గ్రామం
తిమ్మాజిపేట మండలం నాగర్ కర్నూల్ జిల్లాలో విధులు నిర్వహిస్తున్న ఆయన పదవీ విరమణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆయనను ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యారంగానికి మీరు చేసిన సేవలు ఎంత ఉత్తమమైనవని శేష జీవితం ఆనందంగా గడపాలని ఆకాంక్షించారూ.ఈ కార్యక్రమంలో మాజీ జడ్పిటిసి నర్సింగ్ రావు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ లక్ష్మీ నారాయణ గౌడ్ , బిఆర్ఎస్ యువ నాయకుడు ప్రేమ్ కుమార్ గౌడ్, జగన్మోహన్ రెడ్డి,నటరాజ్ , సుధాకర్,మహిపాల్ రెడ్డి ,కర్ణాకర్,దశరత్ గ్రామస్తులు పాల్గొన్నారు...

చించోడు పీహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ : జిల్లా వైద్యాధికారి

- **వైద్య సేవలు, సిబ్బంది హాజరు, ల్యాబ్, వ్యాక్సినేషన్ నిర్వహణపై ఆరా**
- **ఆసుపత్రి ప్రసవాల సంఖ్య పెంచాలని సిబ్బందికి సూచన**

షాద్‌నగర్, అక్టోబర్ 31, (వుదయం):
రంగారెడ్డి జిల్లా వైద్యాధికారి డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి శనివారం మధ్యాహ్నం షాద్‌నగర్ డివిజన్ పరిధిలోని ఫరూఖ్‌నగర్ మండలం చించోడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలు, సిబ్బంది పనితీరు, రోగులకు నిర్వహిస్తున్న పరీక్షలు, వ్యాక్సినేషన్ ప్రక్రియలను క్షుణ్ణంగా పరిశీలించారు. ముందుగా ఆసుపత్రిలో పనిచేస్తున్న రెగ్యులర్, కాంట్రాక్ట్ సిబ్బంది వివరాలను హెల్త్ ఎడ్యుకేటర్ జె. శ్రీనివాసులును అడిగి తెలుసుకున్నారు. స్టాఫ్ నర్స్ వినీతను కలిసి ఆరోజు నిర్వహించిన ఓపీ వివరాలు, రక్త పరీక్షల కోసం ఎంతమంది రోగులను ల్యాబ్‌కు పంపించారనే విషయాలపై ఆరా తీశారు. అనంతరం ఆసుపత్రిలోని ల్యాబ్‌ను పరిశీలించి ల్యాబ్ టెక్నీషియన్ అశోక్‌తో మాట్లాడారు. అక్కడ నిర్వహిస్తున్న వైద్య పరీక్షల వివరాలను తెలుసుకోవడంతో పాటు ల్యాబ్ రిజిస్టర్లను తనిఖీ చేశారు. టీబీ నిర్ధారణకు సంబంధించిన కఫ పరీక్షలు నిర్వహిస్తున్నారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. అలాగే ఫార్మసిస్ట్ పర్వతాలుతో కలిసి గర్భిణులు, చిన్నారులకు అందించే టీకాల నిల్వ విధానాన్ని పరిశీలించారు. వ్యాక్సిన్లను ఐఎల్ఆర్‌లో భద్రపరుస్తున్న తీరుతో పాటు కోల్డ్ చైన్ నిర్వహణ, ఉష్ణోగ్రతల నమోదు రిజిస్టర్లను తనిఖీ చేశారు. తదుపరి కార్యాలయంలో సిబ్బంది హాజరు రిజిస్టర్, మూమెంట్ రిజిస్టర్లను పరిశీలించారు. వారంలో చేపట్టే పర్యటనల వివరాలను మూమెంట్ రిజిస్టర్‌లో ఎప్పటికప్పుడు నమోదు చేయాలని సూచించారు. విధులకు హాజరుకాని కాంట్రాక్ట్ డీఈఓకు గైర్హాజరుపై

వివరణ ఇవ్వాలని ఆదేశించారు. ఆసుపత్రిలో ప్రసవాల సంఖ్యను మరింత పెంచేందుకు కృషి చేయాలని స్టాఫ్ నర్స్ వినీతకు సూచించారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడంతో పాటు ఆసుపత్రి పనితీరును నిరంతరం పర్యవేక్షించాలని సిబ్బందికి సూచించారు. ఈ తనిఖీలో రంగారెడ్డి జిల్లా డీపీఓ అక్రమ్, డీఎంఎంహెచ్ఓ సీసీ సురేష్, చించోడు పీహెచ్‌సీ హెల్త్ ఎడ్యుకేటర్ జె. శ్రీనివాసులు, హెల్త్ సూపర్‌వైజర్ శ్రీరామ, ఫార్మసిస్ట్ పర్వతాలు, స్టాఫ్ నర్స్ వినీత, ల్యాబ్ టెక్నీషియన్ అశోక్, కాంటింజెంట్ వర్కర్ మణెమ్మ పాల్గొన్నారు.

బియ్యం ధరలపై కీలక నిర్ణయం
నిర్ణయించిన గరిష్ట ధరలకే బియ్యం విక్రయించాలి

రంగారెడ్డి జిల్లా వుదయం
అధిక ధరలు వసూలు చేస్తే కఠిన చర్యలు - అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కె. చంద్రా రెడ్డితెలంగాణ రాష్ట్రంలో వివిధ రకాల బియ్యం విక్రయ ధరలపై కమిషనర్ గారితో జిల్లా మరియు రాష్ట్ర రైస్ మిల్లర్ల అసోసియేషన్ ప్రతినిధులు నిర్వహించిన సమావేశంలో కీలక నిర్ణయాలు తీసుకోవడం జరిగిందని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కె. చంద్రా రెడ్డి తెలిపారు.

నిర్ణయించిన గరిష్ట విక్రయ ధరలు:
తెలంగాణ BPT బియ్యం - కిలో రూ. 66
తెలంగాణ సోనా బియ్యం - కిలో రూ. 74
తెలంగాణ శ్రీరామగోల్డ్ బియ్యం - కిలో రూ. 79

రైస్ మిల్లర్లు, రైస్ ట్రేడర్లు, హోల్‌సేల్ డిపో నిర్వాహకులు, రిటైలర్లు నిర్ణయించిన గరిష్ట విక్రయ ధరలకు మించకుండా బియ్యం విక్రయించాలని అదనపు కలెక్టర్ సూచించారు. వినియోగదారుల నుంచి నిర్ణయించిన ధరల కంటే అధిక మొత్తాన్ని వసూలు చేయరాదని స్పష్టం చేశారు.నిర్ణయించిన ధరలకు విరుద్ధంగా అధిక ధరలకు బియ్యం విక్రయించినట్లు గుర్తించిన పక్షంలో సంబంధిత వ్యాపారులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. ప్రజలకు న్యాయమైన ధరలకు బియ్యం అందుబాటులో ఉండేలా సంబంధిత వ్యాపారులు నిర్ణయాలను తప్పనిసరిగా పాటించాలని అదనపు కలెక్టర్ కె. చంద్రా రెడ్డి కోరారు.

జాతీయ సమైక్యతే లక్ష్యంగా ముందుకు సాగాలి

- **డిజిపి కార్యాలయంలో రాష్ట్రీయ ఏక్తా దివాస్**

హైదరాబాద్, అక్టోబర్ 31:
సర్దార్ వల్లభభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకుని జాతీయ ఐక్యత దినోత్సవం (రాష్ట్రీయ ఏక్తా దివస్) కార్యక్రమాన్ని శనివారం డీజీపీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐజీ (పి&ఎల్) గజరావు భూపాల్ పోలీసు అధికారులు, సిబ్బందితో జాతీయ ఐక్యత ప్రతిజ్ఞ చేయించారు. మల్టీ జోన్I ఐజీ చంద్రశేఖర్ రెడ్డి దేశ సమైక్యత, సమగ్రత కోసం సర్దార్ వల్లభభాయ్ పటేల్ చేసిన కృషి చిరస్మరణీయమని పేర్కొన్నారు. స్వాతంత్ర్యానంతరం సంస్థానాల విలీనంలో కీలక పాత్ర పోషించి దేశ ఐక్యతకు బలమైన పునాది వేశారని గుర్తుచేశారు. ఆయన ఆశయాలకు అనుగుణంగా ప్రతి ఒక్కరూ జాతీయ సమైకృత, సమగ్రతను కాపాడేందుకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐజీ (పి&ఎల్) గజరావు భూపాల్, మల్టీ జోన్I ఐజీ చంద్రశేఖర్ రెడ్డి తో పాటుగా ఏఐజీ (అడ్మిన్) అన్వేన్య, పలువురు పోలీసు అధికారులు, సీఏవోలు, ఏవోలు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆరుద్ర నక్షత్రం సందర్భంగా కీసరగుట్టలో వైభవంగా స్వామి కల్యాణోత్సవం

వుదయం ప్రతినిధి కీసర, అక్టోబర్ 31:
కీసరగుట్ట శ్రీ రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో ఆరుద్ర నక్షత్రాన్ని పురస్కరించుకొని స్వామివారి కల్యాణోత్సవాన్ని శనివారం భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఆలయ అర్చకులు వేదమంత్రోచ్చారణల నడుమ స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి కల్యాణ మహోత్సవాన్ని శాస్త్రోక్తంగా జరిపించారు.భక్తుల శివనామస్మరణతో కీసరగుట్ట ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది.స్వామివారి కృపాకటాక్షాలు అందరి పై ఉండాలని అర్చకులు ఆకాంక్షించారు.

నర్సంపేట మున్సిపాలిటీ కమిషనర్ ఉన్నట్టా లేనట్టా?

హైదరాబాద్
అందుబాటులేని డిజిటల్ సంతకం జనన మరణ ఇంటి నెంబర్స్ ధ్రువీకరణ పత్రాలు పనిచేయక 3 నుంచి 4 నాలుగు నెలలు అవుతుంది గతంలో కలెక్టర్ గారికి ఫిర్యాదు పట్టించుకోని అధికారులు ప్రజల సమస్యల పక్కనపెట్టి ఢిల్లీకి బయలుదేరిన కాంగ్రెస్ నాయకులు స్థానిక ఎమ్మెల్యే సంబంధం లేకుండా సమాధానం చెబుతున్న కమీషనర్ కాట భాస్కర్

ఎన్నో రోజుల నుంచి చెప్పులు అరిగేలా తిరుగుతున్న ప్రజలకు పరిష్కారం దొరకడం లేదు వెంటనే అధికారులు స్పందించి సమస్య పరిష్కారం చేయాలని నర్సంపేట ప్రజలు

పారిశుధ్ధ్య కార్మికుడు ఊపిరితిత్తుల సమస్యతో అస్వస్థత.. వైద్య ఖర్చులకు ఆర్థిక సాయం

- **మున్సిపల్ చైర్‌పర్సన్ నీరజబాల్ రెడ్డి***

తాండూరు అక్టోబర్ 31 వుదయం ప్రతినిధి: -
పాత తాండూరు 15వ వార్డుకు చెందిన మున్సిపల్ కార్మికుడు జె.నవీన్ కుమార్ ఊపిరితిత్తుల సమస్యతో అస్వస్థతకు గురయ్యారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన అత్యవసర వైద్యం కోసం కుటుంబ సభ్యులు ఆయనను హైదరాబాద్‌లోని ఆసుపత్రికి తరలించారు. కర్మికుడి అనారోగ్య పరిస్థితి, కుటుంబ ఆర్థిక ఇబ్బందులను గుర్తించిన 15వ వార్డు కౌన్సిలర్ దివిటి ఎల్లప్ప ఈ విషయాన్ని వెంటనే మున్సిపల్ చైర్‌పర్సన్ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన చైర్‌పర్సన్ వైద్య ఖర్చుల నిమిత్తం బాధితుడి కుటుంబానికి ఆర్థిక సాయం అందజేశారు.ఆపద సమయంలో స్పందించి తమకు అండగా నిలిచిన మున్సిపల్ చైర్‌పర్సన్‌కు, కౌన్సిలర్ దివిటి ఎల్లప్పకు బాధితుడి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

నేడు అయ్యప్ప గురు స్వాములకు సన్మానోత్సవం

- **అధ్యక్షుడు డాక్టర్ కాకర్ల భీమయ్య**

నారాయణపేట టౌన్ అక్టోబర్31(వుదయం ప్రతినిధి)
మక్తల్ పట్టణంలోని అయ్యప్ప స్వామి దేవాల యం లో నారాయ ణపేట జిల్లాలో ఎవరైతే 25 సంవత్సరాలు మాలధారణ పూర్తి చేసుకున్న అయ్యప్ప గురు స్వాములకు సన్మా నోత్సవం నిర్వహిస్తున్నట్లు అఖిల భారత అయ్యప్ప దీక్ష ప్రచార సమితి వ్యవస్థా పక అధ్యక్షుడు డాక్టర్ కాకర్ల భీమ య్య తెలిపారు. అఖిల భారత అయ్యప్ప దీక్ష ప్రచార సమితి వ్యవ స్థాపక అధ్యక్షులు శ్రీ రాజు దేశ్పాండే గురుస్వామి సన్మానోత్సవం నిర్వహిం చాలని సంకల్పించారనీ తెలిపారు.ఆదివారం ఉదయం నారాయణపేట జిల్లాలో అయ్యప్ప స్వామి భక్తులు 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న గురుస్వాములు మక్తల్ అయ్యప్ప స్వామి ఆలయంలో జరిగే సమ్మానోత్సవ కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు.



ప్లాస్టిక్ రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

- **విద్యార్థులకు ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన**

దుబ్బాక ప్రతినిధి, అక్టోబర్ 31, వుదయం:
ప్లాస్టిక్ వినియోగం పర్యావరణానికి, ప్రజల ఆరోగ్యానికి తీవ్ర హాని కలిగిస్తుందని, ప్లాస్టిక్ రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ బాధ్యతగా కృషి చేయాలని మాస్టర్ మైండ్స్ పాఠశాల ప్రతినిధులు సూచించారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి పర్యావరణహిత వస్తువులను అలవాటు చేసుకోవాలని విద్యార్థులకు శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ ఎర్రోళ్ల హరిబాబు మాట్లాడుతూ.. ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించడం ఎంతో అవసరమన్నారు. పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని సూచించారు. ప్లాస్టిక్ వస్తువులకు బదులుగా గాజు గ్లాసులు, స్టీల్ ప్లేట్లు, మట్టి కుండలను వినియోగించాలని తెలిపారు. కార్యక్రమంలో భాగంగా తొమ్మిదో తరగతి విద్యార్థులు ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే అనర్థాలు, పర్యావరణ పరిరక్షణ ఆవశ్యకతపై ఉపన్యాసాలు, నాటకం ప్రదర్శించి ఆకట్టుకున్నారు. అనంతరం విద్యార్థులందరూ ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి పర్యావరణాన్ని పరిరక్షిస్తామని ప్రతిజ్ఞ చేశారు.

రూ. 3.50 లక్షల గంజాయి పట్టివేత..

- **7 కేజీల గంజాయి స్వాధీనం.**
- **కారు ముగ్గురు వ్యక్తుల అరెస్ట్..**

హైదరాబాద్
కడప, నెల్లూరు ప్రాంతాలకు చెందిన ముగ్గురు స్నేహితులు అరకు ప్రాంతాల నుంచి కారులో గంజాయిని తీసుకు వచ్చి హైదరాబాదులో అమ్మకాలు జరుపుతుండగా ఎక్సైజ్ స్టేట్ టాస్క్ ఫోర్స్ టీం సీఐ నాగరాజు సిబ్బందికి శనివారం ఉదయం పట్టుబడ్డారు. నిందితుల వద్ద ఏడు కేజీల గంజాయి, ఒక కారు సెల్ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.

వివరాల్లోకి వెళ్తే..
బెంగళూరులో భరత్ ఫిన్ మెషిన్ లో హెచ్ఆర్ గా పనిచేస్తున్న చెవుల మహేష్ కుమార్ (34) అనే వ్యక్తి పెట్టుబడి పెట్టి నెల్లూరుకు చెందిన గంప ప్రశాంత్ (21), దండు మనోజ్ కుమార్ (24) ఈ ముగ్గురు వ్యక్తులు కలిసి కారును అద్దెకి తీసుకొని వైజాగ్ దగ్గర ఉన్న అరకు వెళ్లి రూ. 5000 కు కేజీ గంజాయి చొప్పున కొనుగోలు చేసి హైదరాబాద్ కు తీసుక వచ్చి గంజాయి అమ్మకం దారులకు రూ. 50 వేలకు కేజీ చొప్పున అమ్మకాలు జరుపు తున్నారు. రాజేంద్రనగర్ ప్రాంతంలోని గగన్ పహాడ్ వద్ద కారులో తీసుకువచ్చిన ఏడు కిలోలను గంజాయిని అమ్మకం దారులకు ఇవ్వడానికి తయారవుతున్న సమయంలో సిఐ నాగరాజు సిబ్బంది కలిసి పట్టుకున్నారు. కారులో ఉన్నటువంటి రూ. మూడున్నర లక్షల విలువ చేసే ఏడు కిలోల గంజాయిని, కారును, ముగ్గురు వద్ద ఉన్నటువంటి సెల్ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. గంజాయిని కారును రాజేంద్రనగర్ ఎక్సైజ్ స్టేషన్లో అప్పగించినట్లు సిఐ నాగరాజు తెలిపారు.

ఊర్కొండ మండల కేంద్రంలో ఇందిరా గాంధీ వర్ధంతి

- **ఊర్కొండ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అయూబ్ పాషా ఆధ్వర్యంలో ఇందిరాగాంధీ వర్ధంతి వేడుకలు**

ఊర్కొండ వుదయం ప్రతినిధి
నాగర్ కర్నూల్ జిల్లా
ఉరుకొండ మండల కేంద్రంలో మరియు పరిసర ప్రాంతాలలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు స్వర్గీయ మాజీ ప్రధాని ఇందిరా గాంధీ జయంతి (నవంబర్ 19) మరియు వర్ధంతి (అక్టోబర్ 31) సందర్భంగా నిర్వహించే సాధారణ కార్యక్రమాలు: చిత్రపటానికి నివాళులు: ఉరుకొండ మండల ప్రధాన చౌరస్తా వద్ద ఇందిరా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తారు. నాయకుల ప్రసంగాలు: ఉక్కు మహిళగా దేశానికి ఇందిరా గాంధీ అందించిన సేవలు, బ్యాంకుల జాతీయీకరణ, పేదరిక నిర్మూలన (గరీబీ హటావో) పథకాలను స్థానిక నాయకులు గుర్తుచేసుకుంటారు.
ఈ కార్యక్రమంలో శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయం చైర్మన్ ఊర్కొండ మండల కాంగ్రెస్ పార్టీ సర్పంచులు ఉప సర్పంచ్లు. మండల జిల్లా నాయకులు. వార్డ్ మెంబర్స్. గ్రామ యువకులు ప్రజలు కార్యకర్తలు పాల్గొన్నారు

సింగూరు ప్రాజెక్టు నుంచి 0.15 టీఎంసీల నీటి విడుదల

- **తాగునీటి అవసరాల కోసమే ముందస్తు చర్యలు**

ఆందోల్ వుదయం
సంగారెడ్డి జిల్లా ప్రజల తాగునీటి అవసరాలను తీర్చేందుకు అధికారులు సింగూరు ప్రాజెక్టు నుంచి మంజీరా బ్యారేజీకి 0.15 టీఎంసీల నీటిని విడుదల చేశారు. భవిష్యత్తులో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యల్లో భాగంగా ఈ నీటిని విడుదల చేసినట్లు అధికారులు తెలిపారు. ప్రజలకు నిరంతరంగా తాగునీరు అందించడమే లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు.అధికారుల హెచ్చరిక సింగూరు ప్రాజెక్టులోని 5, 6, 7వ

గేట్లను ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్న నేపథ్యంలో పరివాహక ప్రాంతాల ప్రజలు, రైతులు, పశువుల కాపరులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరించారు. ఎవరూ నదీ ప్రవాహ ప్రాంతాలకు వెళ్లవద్దని, పశువులను కూడా నీటి ప్రవాహం వైపు తీసుకెళ్లవద్దని సూచించారు.

మొయినాబాద్‌లో విషాదం

రంగారెడ్డి:
విద్యుత్ తీగలు తగిలి ఇద్దరు విద్యార్థులు మృతిరైతు రాజిరెడ్డి పొలానికి ఏర్పాటు చేసిన కరెంట్ తీగలు తగిలి ప్రమాదం కేజీ రెడ్డి కాలేజీ విద్యార్థుల ఫెస్ట్ అనంతరం ఘటనఫెస్ట్ తర్వాత 10 మంది విద్యార్థులు కలిసి పొలాల్లోకి వెళ్లినట్లు సమాచారం మద్యం సేవిస్తుండగా పోలీస్ పెట్రోలింగ్ వాహనాన్ని చూసి పరుగులు ఈ క్రమంలో విద్యుత్ తీగలు తగిలి మోహన్‌తో పాటు మరో విద్యార్థి మృతి

536 గ్రాముల పప్పీస్ట్రా పట్టివేత..

- **రెండు బైకులను స్వాధీనం.**
- **ఇద్దరి వ్యక్తులను అరెస్ట్.**

హైదరాబాద్
చింతల్ షాపూర్ నగర్ మేడ్చల్ మల్కాజిగిరి ప్రాంతంలో ఇద్దరు వ్యక్తులు బైకులపై అమ్మకాలు జరుపుతున్న పప్పీస్ట్రా ఎక్సైజ్ స్టేట్ టాస్క్ ఫోర్స్ టీం బి సి ఐ గణపతి రెడ్డి సిబ్బంది కలిసి పట్టుకున్నారు. ఓం ప్రకాష్ చనగల్ (29), రాజేందర్ (32) అనే ఇద్దరు కార్పెంటర్లకు వద్ద 536 గ్రాముల పప్పీస్ట్రా పట్టుకున్నారు.

నిందితుల వద్ద ఉన్న రెండు బైకులను స్వాధీనం చేసుకొని, పంపిస్తా తో పాటు నిందితులను కుత్బుల్లాపూర్ ఎక్సైజ్ స్టేషన్లో అప్పగించినట్లు సిఐ గణపతి రెడ్డి తెలిపారు.

గ్రేటర్ హైదరాబాద్



ప్రగతినగర్ లో సీసీ రోడ్డును ప్రారంభించిన కొలన్ హన్మంత్ రెడ్డి

ప్రగతి నగర్, అక్టోబర్ 31,(వుదయం ప్రతినిధి),
కుత్బుల్లాపూర్ నియోజకవర్గం 276 డివిజన్ ప్రగతి నగర్ లో సిఎంసీ నిధులు రూ.12 లక్షల వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్డును కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా హన్మంత్ రెడ్డి మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడమే లక్ష్యంగా అభివృద్ధి పనులకు ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. స్థానిక ప్రజలకు రాకపోకల్లో ఇబ్బందులు లేకుండా నాణ్యమైన రహదారుల నిర్మాణానికి కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. సిఎంసీ నిధులతో చేపట్టిన ఈ అభివృద్ధి పనులు స్థానిక ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని అన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు బొమ్ము వెంకటేశ్వర రెడ్డి, ఆలేటి శ్రీనివాస్, సురేంద్ర కుమార్ యాదవ్, అల్లాడి మహేష్ గుప్తా, గూడూరు మురళి కృష్ణ, ఎ వి రెడ్డి, రమేష్ బాబు, సురగాని వీరబాబు, భాస్కర్ రెడ్డి, సుబ్బు, యుగంధర్ రెడ్డి, రఫత్, మేడ శ్రీనివాస రావు, రమేష్ మందలపు, విజయలక్ష్మి, లక్ష్మణ్, ప్రభాకర్ రెడ్డి, ఆది రెడ్డి , ప్రశాంత్ రెడ్డి, సురేంద్ర కుమార్, శివ, వెంకట్రావు, మహమూద్, మహేశ్వర్ రెడ్డి, సాంబి రెడ్డి, సత్యనారాయణ, మహేష్ రెడ్డి, మల్లికార్జున్, గోలి శ్రీనివాస్, ప్రవీణ్ కుమార్, చంద్రకళ, నాగరాణి, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నవంబర్ 2న బీజేపీ మహా పాదయాత్ర

- ముఖ్య అతిథిగా కేంద్ర హోంమంత్రి అమిత్ షా..
- జిల్లా నుంచి వేలాదిగా తరలిరావాలి: ఎమ్మెల్సీ అంజిరెడ్డి

రామచంద్రాపురం,అక్టోబర్ 31(వుదయం)
ప్రజాస్వామ్య పరిరక్షణే లక్ష్యంగా నవంబర్ 2న బీజేపీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో మహా పాదయాత్ర నిర్వహించనున్నట్లు ఎమ్మెల్సీ డాక్టర్ అంజిరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమానికి కేంద్ర హోంమంత్రి అమిత్ షా ముఖ్య అతిథిగా హాజరుకానున్నట్లు వెల్లడించారు. మహా పాదయాత్ర విజయవంతానికి సంబంధించి సంగారెడ్డి జిల్లా బీజేపీ నాయకుల సన్నాహక సమావేశం శనివారం రామచంద్రాపురంలో నిర్వహించారు. ఈ సందర్భంగా అంజిరెడ్డి మాట్లాడుతూ.. రాజ్యాంగ సంస్థలను అప్రతిష్ఠపాలు చేస్తూ కాంగ్రెస్ పార్టీ సాగిస్తున్న కుట్రపూరిత రాజకీయాలను ప్రజల్లో ఎండగట్టాలని

పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ ఉద్యమంలో భాగస్వాములు కావాలన్నారు. సంగారెడ్డి జిల్లా నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చి పాదయాత్రను విజయవంతం చేయాలని కోరారు. నిజాం కళాశాల వద్ద ఉన్న బాబూ జగ్జీవన్‌రామ్

విగ్రహం నుంచి మొజంజాహీ మార్కెట్ వరకు పాదయాత్ర కొనసాగుతుందని తెలిపారు. సమావేశంలో బీజేపీ సంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలు గోదావరి, జిల్లా ఇన్‌చార్జి శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి రాజశేఖర్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు రవీందర్, నరేన్ దేశ్‌పాండే తదితరులు పాల్గొన్నారు.

మాజీ ప్రధాని ఇందిరాగాంధీకి ఘన నివాళులు

చేవెళ్ల,అక్టోబర్ 31 (వుదయం)
భారత మాజీ ప్రధాని స్వర్గీయ ఇందిరా గాంధీ వర్ధంతి సందర్భంగా ఢిల్లీలోని శక్తిస్థల్‌లో ఆమె సమాధి వద్ద,శనివారం చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య,పీసీసీ ఉపాధ్యక్షుడు జనార్దన్ రెడ్డి తదితరులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఇందిరా గాంధీ దేశానికి చేసిన సేవలను, ఆమె నాయకత్వాన్ని స్మరించుకున్నారు.దేశ ఐక్యత, సమగ్రత కోసం ఇందిరాగాంధీ చేసిన కృషి చిరస్మరణీయమని ఈ సందర్భంగా నేతలు పేర్కొన్నారు.దేశ అభివృద్ధి కోసం ఆమె తీసుకున్న నిర్ణయాలు,ప్రజాసేవకు అంకితమైన నాయకత్వం ఎప్పటికీ స్ఫూర్తిదాయకమని కొనియాడారు.దేశ రాజకీయాల్లో ఆమె పోషించిన పాత్రను గుర్తుచేసుకుంటూ ఆమెకు ఘనంగా నివాళులర్పించారు .ఈ కార్యక్రమంలో చేవెళ్ల పీఏసీఎస్ చైర్మన్ దేవర వెంకట్ రెడ్డి, డీసీసీ మాజీ ఉపాధ్యక్షుడు ఆగిరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ రాము గౌడ్, కౌన్సిలర్లు మద్దెల శ్రీనివాస్, ధవల్గారి గోపాల్ రెడ్డి, మాజీ సర్పంచ్ మధుసూదన్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

పేదలకు నాణ్యమైన వైద్యం అందించండి

- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి పటాన్చెరులో కార్పొరేట్ స్థాయి ఆసుపత్రి ఏర్పాటు కావడం సంతోషకరం
- ప్రాచీన్ గ్లోబల్ ఆసుపత్రి ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే జీఎంఆర్..

పటాన్చెరు అక్టోబర్ 31, వుదయం
పటాన్చెరు ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి రావడం ఎంతో సంతోషకరమని పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. పేద, మధ్యతరగతి ప్రజలకు సైతం నాణ్యమైన వైద్యాన్ని అందించాలన్న లక్ష్యంతో మరిన్ని ఆధునిక వైద్య సదుపాయాలు అందుబాటులోకి రావాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. శనివారం పటాన్చెరులో నూతనంగా ఏర్పాటు చేసిన ప్రాచీన్ గ్లోబల్ ఆసుపత్రి ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి హాజరై..ఆసుపత్రిని ప్రారంభించి, అందుబాటులోకి తీసుకువచ్చిన ఆధునిక వైద్య సదుపాయాలను ప్రారంభించారు.
ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పటాన్చెరు పారిశ్రామికంగా, జనాభా పరంగా వేగంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో ప్రజల ఆరోగ్య అవసరాలకు అనుగుణంగా కార్పొరేట్ స్థాయి ఆసుపత్రులు ఏర్పాటు కావడం శుభపరిణామమన్నారు. వైద్య సేవలు కేవలం ఆర్థిక స్థోమత కలిగిన వారికే పరిమితం కాకుండా పేదలకు కూడా అందుబాటులో ఉండాలని సూచించారు.

ఆసుపత్రి యాజమాన్యం నాణ్యమైన వైద్య సేవలతో పాటు పేదలకు అందుబాటు ధరల్లో వైద్యం అందించే దిశగా కృషి చేయాలని ఆకాంక్షించారు.
ఈ కార్యక్రమంలో ఆసుపత్రి చైర్మన్ వెంకట్ ఆలపాటి, మాజీ కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, అమీన్పూర్ మాజీ మున్సిపల్ చైర్మన్ పాండురంగారెడ్డి, పృథ్వీరాజ్, మాజీ ప్రజా ప్రతినిధులు, సీనియర్ నాయకులు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి వేడుకలు

బాచుపల్లి, అక్టోబర్ 31,(వుదయం ప్రతినిధి),
సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకుని ప్రగతి నగర్ 276వ డివిజన్‌లో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బొమ్ము వెంకటేశ్వర రెడ్డి (తాతి రెడ్డి) ఆధ్వర్యంలో ఘనంగా జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కాంగ్రెస్ పార్టీ కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కొలన్ హనుమంత్ రెడ్డి విచ్చేసి సర్దార్ వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు దేశ ఐక్యత, సమగ్రత కోసం సర్దార్ వల్లభాయ్ పటేల్ చేసిన సేవలను, స్వాతంత్ర్య భారతదేశ నిర్మాణంలో వారి కీలక పాత్రను స్మరించుకున్నారు. దేశంలోని సంస్థానాలను ఏకం చేసి భారతదేశ ఐక్యతకు బలమైన పునాది వేసిన మహనీయుడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఆలేటి శ్రీనివాస రావు, సురేంద్ర కుమార్ యాదవ్, ప్రశాంత్ రెడ్డి, గూడూరు మురళి, ఎ వి రెడ్డి, మేడ శ్రీనివాస రావు, బండ్ల విజయ్ కుమార్, అల్లాడి మహేష్ గుప్తా, లక్ష్మణ్, ప్రభాకర్ రెడ్డి, పోచంపల్లి రమేష్ బాబు, సురగాని వీరబాబు గౌడ్, మల్లికార్జున్, శేఖర్, యుగంధర్ రెడ్డి, ప్రవీణ్ కుమార్, సుబ్బు, శివ, మహమ్మద్, సాంబ శివరావు, ఆది రెడ్డి, భాస్కర్ రెడ్డి, తులసి దాస్, రమేష్, రవీందర్, రఫత్, విజయలక్ష్మి, చంద్రకళ, నాగరాణి, సురేష్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో ఘనంగా సర్దార్ వల్లభాయ్ పటేల్ 151వ జయంతి వేడుకలు

రంగారెడ్డి జిల్లా. వుదయం
జాతీయ ఐక్యతా దినోత్సవం సందర్భంగా ఐక్యతా ప్రతిజ్ఞ దేశ సమగ్రత, ఐక్యత, సమైక్యతను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, జాతీయ ఐక్యతా స్ఫూర్తిని పెంపొందిస్తూ దేశ సమగ్రతను పరిరక్షించేందుకు నిరంతరం కృషి చేయాలని జిల్లా కలెక్టర్ అన్నారు.
శనివారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనంలోని సమావేశ మందిరంలో భారత ఉక్కుమనిషి, స్వాతంత్ర్య సమరయోధుడు, భారత తొలి ఉప ప్రధానమంత్రి, తొలి హోంమంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్ 151వ జయంతిని పురస్కరించుకొని జాతీయ ఐక్యతా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ సి .నారాయణ రెడ్డి పాల్గొని సర్దార్ వల్లభభాయ్ పటేల్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, సర్దార్ వల్లభాయ్ పటేల్ దేశ



ఐక్యత, సమగ్రతకు ప్రతీకగా నిలిచారని, స్వాతంత్ర్యం అనంతరం దేశంలోని 500కు పైగా సంస్థానాలను భారతదేశంలో విలీనం చేసి, జాతీయ సమైక్యతను బలోపేతం చేయడంలో కీలక పాత్ర పోషించారని తెలిపారు. దేశాన్ని ఐక్యంగా, బలంగా తీర్చిదిద్దడంలో ఆయన చూపిన నాయకత్వం, దూరదృష్టి, దేశభక్తి చిరస్మరణీయమని అన్నారు. దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ పోషించిన కీలక పాత్రను, స్వాతంత్ర్యం అనంతరం దేశ సమైక్యత కోసం చేసిన విశేష కృషిని ఈ సందర్భంగా స్మరించుకున్నారు. ఆయన ఆశయాలు, ఆదర్శాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని, దేశ ఐక్యత, సమగ్రత, భద్రతను కాపాడుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత అని తెలిపారు. సర్దార్ వల్లభభాయ్ పటేల్ ఆశయాలను ఆదర్శంగా తీసుకొని ప్రజలకు సమర్థవంతమైన సేవలు అందిస్తూ, దేశ అభివృద్ధి, జాతీయ సమైక్యతకు ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ సూచించారు.
జాతీయ ఐక్యతా దినోత్సవం సందర్భంగా జిల్లా కలెక్టర్, అధికారులు, ఉద్యోగులు, సిబ్బందిచే "దేశ ఐక్యత, సమగ్రత, భద్రతను కాపాడేందుకు అంకితభావంతో పనిచేస్తామని, ప్రజల మధ్య సోదరభావం, సామరస్యం, ఐక్యతను పెంపొందించేందుకు కృషి చేస్తామని" జాతీయ ఐక్యతా ప్రతిజ్ఞ చేయించారు.
ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ లోని వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించటమే లక్ష్యం

: కాంగ్రెస్ ఇంచార్జి కోలన్ హన్మంత్ రెడ్డి

కుత్బుల్లాపూర్, అక్టోబర్ 31,(వుదయం ప్రతినిధి),
కుత్బుల్లాపూర్ నియోజకవర్గం 275వ డివిజన్ నిజాంపేట్ పరిధిలోని బండారి లేఔట్, అర్జీకే 55 బ్లాక్‌లో సిఎంసీ నిధులు రూ.25 లక్షల వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్డును కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా కొలన్ హన్మంత్ రెడ్డి మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడమే లక్ష్యంగా అభివృద్ధి పనులకు ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. స్థానిక ప్రజలకు రాకపోకల్లో ఇబ్బందులు లేకుండా నాణ్యమైన రహదారుల నిర్మాణానికి కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. సిఎంసీ నిధులతో చేపట్టిన ఈ అభివృద్ధి పనులు స్థానిక ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని అన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు కొలన్ శ్రీనివాస్ రెడ్డి, డివిజన్ అధ్యక్షులు వరగాని వాసు, బొమ్ము వెంకటేశ్వర రెడ్డి, సిద్ధనోళ్ల సంజీవ రెడ్డి, ఆలేటి శ్రీనివాస్, రఫాత్, సరళ లక్ష్మన్న, ప్రభాకర్ రెడ్డి, రామ్ చందర్ నాయక్, రాజు, విజయ్, ఆటో శీను, గౌస్,బాలకృష్ణ, కుమార్, వైకుంఠరావు, రామా నాయుడు, నయా, అబ్దుల్లా, రషీద్, మొయినుద్దీన్, రవి, రవి నాయక్, శేషు, వెంకటేష్, మూర్తి, చారి, మార్తమ్మ తదితరులు పాల్గొన్నారు.

చేవెళ్ల మండల వార్డ్ మెంబర్స్ ఫోరం అధ్యక్షుడిగా చనగళ్ల శ్రీకాంత్ నియామకం

వార్డ్ మెంబర్ల హక్కుల పరిరక్షణకు కృషి చేస్తా: శ్రీకాంత్

చేవెళ్ల,అక్టోబర్ 31 (వుదయం)
తెలంగాణ వార్డ్ మెంబర్స్ ఫోరం చేవెళ్ల మండల అధ్యక్షుడిగా ఆలూరు గ్రామానికి చెందిన 1వ వార్డ్ నెంబర్ చనగళ్ల శ్రీకాంత్ నియమితులయ్యారు .ఈ మేరకు శనివారం బోడుప్పల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఫోరం రాష్ట్ర అధ్యక్షురాలు నాగబెల్లి జ్యోతి, రంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జి గ్యార సురేష్ చేతుల మీదుగా ఆయన నియామక పత్రాన్ని అందుకున్నారు.ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షురాలు నాగ బెల్లి జ్యోతి మరియు జిల్లా ఇన్చార్జ్ గ్యార సురేష్ మాట్లాడుతూ.. వార్డ్ మెంబర్ల సమస్యల పరిష్కారం, హక్కుల పరిరక్షణ కోసం ఫోరం నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు.చేవెళ్ల మండలంలో ఫోరంను బలోపేతం చేస్తూ వార్డ్ మెంబర్లందరినీ ఐక్యం చేయడంలో శ్రీకాంత్ కీలకంగా వ్యవహరించాలని ఆకాంక్షించారు. నూతన అధ్యక్షుడు చనగళ్ల శ్రీకాంత్ మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర, జిల్లా నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. మండలంలోని వార్డ్ మెంబర్ల సమస్యల పరిష్కారానికి, గ్రామస్థాయిలో వారి హక్కుల పరిరక్షణకు అంకితభావంతో పనిచేస్తానని హామీ ఇచ్చారు.

చేవెళ్ల టీపీసీసీ లీగల్ సెల్ మండల అధ్యక్షుడిగా బి. ఆనంద్ అడ్వకేట్ ఏకగ్రీవ ఎన్నిక

చేవెళ్ల,అక్టోబర్ 31 (వుదయం)
టీపీసీసీ లీగల్ సెల్ ఆదేశాల మేరకు చేవెళ్ల నియోజకవర్గంలో నూతన లీగల్ సెల్ కమిటీని ఏర్పాటు చేశారు. టీపీసీసీ లీగల్ సెల్ చైర్మన్ పొన్నం అశోక్ గౌడ్, వైస్ చైర్మన్ యాది రెడ్డి నాయకత్వంలో చేవెళ్ల నియోజకవర్గ లీగల్ సెల్ మండల అధ్యక్షుడిగా బస్తేపూర్ గ్రామానికి చెందిన బి.ఆనంద్ అడ్వకేట్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు

.ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పార్టీ తనపై నమ్మకం ఉంచి అధ్యక్ష బాధ్యతలు అప్పగించిన కాంగ్రెస్ పార్టీ పెద్దలకు బి. ఆనంద్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.పార్టీ నాయకత్వం తనకు కల్పించిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ,లీగల్ సెల్ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు.న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి, పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు.

లబ్ధిదారులకు ఎల్వోసీ పత్రాలను అందజేసిన బిఆర్ఎస్ నాయకులు

కుత్బుల్లాపూర్, అక్టోబర్ 31,(వుదయం ప్రతినిధి),
కుత్బుల్లాపూర్ నియోజకవర్గం ఎమ్మెల్యే కేపీ.వివేకానంద మంజూరు చేయించిన పలు డివిజన్లకు చెందిన ఎల్వోసీ పత్రాలను చింతల్ క్యాంపు కార్యాలయంలో 127 రంగారెడ్డి నగర్ డివిజన్ గిరి నగర్ కు చెందిన ఆఫ్రిన్ బేగం భర్త మీర్జా కుదుస్ బెగ్ కు రూ.1,10,000/.129 సూరారం డివిజన్ సంజయ్ గాంధీ నగర్ కు చెందిన రాగి పుష్పవతి భర్త లేట్ రాగి రవికి రూ.3,50,000/, కొంపల్లి సర్కిల్ దూలపల్లి కి చెందిన షరీఫా బీ సయ్యద్ భర్త యూసుఫ్ కు రూ.1,00,000/ , ఎల్వోసీ పత్రాలను ఆయా డివిజన్లకు చెందిన మాజీ ప్రజా ప్రతినిధులు, పార్టీ అధ్యక్షులు, నాయకులు లబ్ధిదారుల కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కుత్బుల్లాపూర్ ప్రజలకు మరింత మెరుగైన వైద్యాన్ని అందించాలనే ఆలోచనతో పేద ప్రజల ఆరోగ్య భద్రతకై పనిచేసే నాయకులు బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అని అన్నారు.
ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ మంత్రి సత్యనారాయణ, డివిజన్ అధ్యక్షులు పుప్పాల భాస్కర్, ఎర్వ శంకరయ్య, ప్రధాన కార్యదర్శి సిద్ధిక్, సుధాకర్, క్రాంతి యాదవ్, ఓంకార్ రెడ్డి, లక్ష్మణ్, నాగార్జున, చందు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

యంగ్ ఇండియా పోలీస్ స్కూల్‌కు రూ.42.5 లక్షల సీఎస్ఆర్ నిధులు

హైదరాబాద్, అక్టోబర్ 31:
పోలీసు సిబ్బంది పిల్లలకు నాణ్యమైన విద్యను అందించాలనే లక్ష్యంతో ఏర్పాటు చేసిన యంగ్ ఇండియా పోలీస్ స్కూల్ (వైఐపీఎస్) కు మూడు కార్పొరేట్ సంస్థలు రూ.42.5 లక్షల కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) నిధులను విరాళంగా అందించాయి. కోహినూర్ గ్రూప్‌కు చెందిన ఏక్యూ స్క్వేర్ రియల్టర్స్ ప్రైవేట్ లిమిటెడ్ రూ.25 లక్షలు విరాళంగా అందించింది. సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ మహమ్మద్ అహ్మద్ ఖాద్రీ తరపున ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మహమ్మద్ అజ్మద్, ఆయన కుమారుడు మహమ్మద్ నిసార్ ఖాద్రీ ఈ మొత్తానికి సంబంధించిన చెక్కును డిజిపి సి. వి. ఆనంద్‌కు అందజేశారు. అలాగే పుజ్జోలానా మెషినరీ ఫ్యాబ్రికేషన్స్ ఎల్ఎల్పీ, ఆర్యన్ ప్రెసిషన్ ప్రైవేట్ లిమిటెడ్ తరపున మేనేజింగ్ డైరెక్టర్ ఆదిత్య పాయ్ రూ.10 లక్షలు అందించారు. దీవ్యశక్తి గ్రూప్ ఆఫ్ కంపెనీస్ వ్యవస్థాపక డైరెక్టర్ రవీంద్ర కుమార్ అగర్వాల్ రూ.7.5 లక్షల విరాళాన్ని అందజేశారు.పోలీసు సిబ్బంది సమాజానికి అందిస్తున్న విశిష్ట సేవలను గుర్తిస్తూ, వారి పిల్లల విద్యాభివృద్ధికి తోడ్పడాలనే ఉద్దేశంతో ఈ విరాళాలు అందించినట్లు సంస్థల ప్రతినిధులు తెలిపారు. విద్యాభివృద్ధికి ఉదారంగా సహకరించిన సంస్థల ప్రతినిధులను డిజిపి సి. వి. ఆనంద్ అభినందించారు.

సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ జయంతి సందర్భంగా ఘన నివాళులు అర్పించిన హైడ్రా కమిషనర్

హైదరాబాద్, అక్టోబర్ 31:
స్వాతంత్ర్య సమరయోధుడు, దేశ సమగ్రతకు మార్గదర్శకుడైన దార్శనిక నాయకుడు, భారతరత్న సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ జయంతి వేడుకలు హైడ్రా కార్యాలయంలో ఘనంగా జరిగాయి. హైడ్రా కమిషనర్ శ్రీ ఏవి రంగనాథ్ గారు ఆ మహనీయుడి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. "సర్దార్ వల్లభ్‌బాయ్ పటేల్ గారి దూరదృష్టి, నిబద్ధత, దేశభక్తి నేటి తరాలకు ఎంతో స్ఫూర్తి అని ఈ సందర్భంగా కొనియాడారు. హైడ్రా అడిషనల్ డైరెక్టర్ శ్రీ వర్ల పాపయ్యగారు, అడిషనల్ కమిషనర్లు శ్రీ ఆర్. సుదర్శన్ గారు ,శ్రీ డి. ఆనంద్‌కుమార్ గారితో పాటు పలువురు అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

IN THE COURT OF THE HON'BLE I JUNIOR CIVIL JUDGE, CITY CIVIL COURTS AT SECUNDERABAD
OS NO. 799 OF 2024
Between :
M/s. Sri Badarayanaswamy Temple (P) Trust Represented by Its Manager, Arcot Narayana Rao, S/o. Late A. Hanumantha Rao, R/o. H.No. 5-4-63 to 70, M.G.Road, Ranigunj, Secunderabad ...Plaintiff
AND
Govinda Chary S/o. Not known. aged about 85 Years, Occ: Proprietor of Chimalgi General Stores, R/o. Shop No. 5-4-71, Distillery Road, Rajigunj, Secunderabad. ...Defendant
Please take notice that the above named Plaintiff herein has filed the above Suit against you for "EVICTION AND FOR RECOVERY OF POSSESSION" before the Hon'ble I Junior Civil Judge, City Civil Courts at Secunderabad and the Hon'ble Court was ordered notice to the Defendant through this paper publication and the said case is posted on 17.11.2026 for your appearance at 10.30 am before the said Court. If you are having any objections for such claim you have to appear before the said court on the above mentioned date and time in person or through your Advocate on the said date and time failing which the matter will be decided on merits by the Hon'ble Court.
"BY ORDER OF THE COURT"
Sd/-
T.VENUGOPAL RAO
Advocate Counsel for Plaintiff
 # 1-6-212/65/107/50, Gangaputra Colony, Musheerabad, Hyderabad - 500 020. Mobile No. 8008116451



" విపక్షాల తీరు చూస్తుంటే క్రికెట్ మ్యాచ్ ఓడిపోయాక మరింత కష్టపడి సాధన చేయకుండా అంపైర్ వల్లే పరాజయం పాలయ్యామని ఆరోపిస్తున్నట్లున్నది. ఓటు చోరీ ఆరోపణలపై చర్చించేందుకు పార్లమెంటు ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉన్నది. వచ్చే ఏడాది జరిగే ఉత్తర్‌ప్రదేశ్ శాసనసభ ఎన్నికల్లో భాజపా తిరిగి అధికారాన్ని కైవసం చేసుకుంటుంది. యుపిలో భాజపా మళ్లీ అధికారంలోకి రాగానే పలు రాష్ట్రాల్లో ఇప్పటికే అమలులోకి తెచ్చిన ఉమ్మడి పౌర స్మృతిని అమల్లోకి తీసుకొస్తాం. ఇండియా కూటమి చేపట్టిన చలో ఢిల్లీ కార్యక్రమానికి అమిత్ షా అవరోధాలు కల్పిస్తున్నారన్న రాహుల్ ఆరోపణలు నిరాధారం. "

- అమిత్ షా, కేంద్ర మంత్రి

వే'మన' పద్యం

వాన రాకడయును బ్రాణంబు పోకడ
కానబడ దదెంత ఘనునికైన
గానబడిన మీద గలియెట్లు నడుచురా
విశ్వదాభిరామ వినురవేమ



సంపాదకీయం

ప్రజల బతుకుల్లో పెరుగుతున్న సంక్షోభం

దేశంలో నిరుద్యోగ సమస్య రోజురోజుకూ తీవ్రరూపం దాలుస్తోంది. అధిక చదువులు చదివినా ఉపాధి దొరకని పరిస్థితి యువతను నిరాశానిస్పృహలకు గురిచేస్తోంది. మరోవైపు నిత్యావసర వస్తువుల ధరలు సామాన్యుల జీవనాన్ని భారంగా మారుస్తున్నాయి. అభివృద్ధి పేరుతో సహజ వనరులను కార్పొరేట్ సంస్థలకు అప్పగిస్తుండటంతో పర్యావరణ సంక్షోభం మరింత తీవ్రమవుతోంది. పాలకులు మాత్రం పెట్టుబడులు, పారిశ్రామిక అభివృద్ధి, లక్షలాది ఉద్యోగాల కల్పన అంటూ ప్రకటనలతో ప్రజలను మభ్యపెడుతున్నారు. కానీ క్షేత్రస్థాయిలో పరిస్థితి అందుకు పూర్తి భిన్నంగా ఉంది. నిరుద్యోగం, ధరల పెరుగుదల, పర్యావరణ విధ్వంసం రాష్ట్ర భవిష్యత్తును ప్రశ్నార్థకం చేస్తున్నాయి. ఉద్యోగాల కోసం అప్పులు చేసి చదువుకున్న యువత పరిస్థితి దయనీయంగా మారుతోంది. విదేశాల్లో ఉపాధి అవకాశాలు కూడా గతంలో మాదిరిగా అందుబాటులో లేకపోవడం, ముఖ్యంగా అమెరికా వీసాలు, ఉద్యోగాల విషయంలో నెలకొన్న అనిశ్చితి యువతను మరింత ఆందోళనకు గురిచేస్తోంది. విదేశాల్లో ఉన్నవారు కూడా ఉద్యోగ భద్రత లేక స్వదేశానికి తిరిగి రావాలా, అక్కడే కొనసాగాలా అనే సందిగ్ధంలో కొట్టుమిట్టాడుతున్నారు. ఈ పరిస్థితులు యువతలో తీవ్ర అసంతృప్తికి దారితీస్తున్నాయి. నిరాశానిస్పృహల నుంచి బయటపడి నిరుద్యోగులు ఉద్యమాల బాట పడుతున్నారు. నీట్ వ్యతిరేక ఆందోళనలు, సర్ వ్యతిరేక పోరాటాలు సహా దేశవ్యాప్తంగా యువతలో పెరుగుతున్న నిరసన స్వరాలు ఈ అసంతృప్తికి నిదర్శనం. ప్రపంచంలోని పలు దేశాల్లోనూ యువత ఇదే తరహా సమస్యలపై ఉద్యమిస్తోంది.

అవి ఎప్పుడు కార్యరూపం దాల్చుతాయి? ఎన్ని ఉద్యోగాలు కల్పిస్తాయి? స్థానిక యువతకు ఎంత ఉపాధి లభిస్తుంది? అనే ప్రశ్నలకు ప్రభుత్వం సమాధానం చెప్పాలి.
పెట్టుబడుల ఆకర్షణ పేరుతో ప్రభుత్వాలు భూములు, రాయితీలు, సబ్సిడీలు, రుణాలు అందిస్తున్నా ఆశించిన స్థాయిలో పరిశ్రమలు ఏర్పాటు కావడం లేదు. కొన్ని సంస్థలు ఒప్పందాలు చేసుకుని వెనక్కి వెళ్లిపోతున్నాయి. హెచ్‌పీ సంస్థ ఎస్‌ఈజెడ్ నుంచి వైదొలగడం వంటి పరిణామాలు పారిశ్రామిక పెట్టుబడుల వాస్తవ పరిస్థితిని తెలియజేస్తున్నాయి. మరోవైపు అత్యధిక మందికి ఉపాధి కల్పించే చిన్న, మధ్య తరహా పరిశ్రమలు ప్రభుత్వ ప్రోత్సాహం లేక మూతపడుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన సుమారు రూ.5 వేల కోట్ల పారిశ్రామిక సబ్సిడీలు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉండటం పరిశ్రమలపై ప్రభావం చూపుతోంది. భారీ ప్రాజెక్టుల వల్ల పర్యావరణంపై పడే ప్రభావం, స్థానిక ప్రజల జీవనోపాధిపై కలిగే నష్టం గురించి సమగ్రంగా అధ్యయనం చేయకుండా అనుమతులు ఇవ్వడం ప్రమాదకరం.
వాతావరణ మార్పులు, ఎల్‌నినో వంటి వాతావరణ పరిణామాలు వ్యవసాయ రంగాన్ని తీవ్రంగా ప్రభావితం చేస్తున్నాయి. వర్షాభావం, పంటల నష్టం రైతుల జీవితాలను సంక్షోభంలోకి నెడుతున్నాయి. పారిశ్రామిక కాలుష్యం నదులను కలుషితం చేస్తోంది. భూగర్భ జలాలు కలుషితమవుతున్నాయి. పట్టణాల్లో మురుగునీటి నిర్వహణ, డ్రైనేజీ వ్యవస్థలు సక్రమంగా లేకపోవడంతో చిన్నపాటి వర్షాలకే కాలనీలు మునిగిపోతున్నాయి. దోమలు, అంటువ్యాధులు ప్రజల ఆరోగ్యాన్ని దెబ్బతీస్తున్నాయి. తాగునీరు కూడా కొనుక్కోవాల్సిన పరిస్థితి అనేక ప్రాంతాల్లో ఏర్పడుతోంది. కాలుష్యం, కలుషిత నీరు, పారిశ్రామిక వ్యర్థాల ప్రభావాలపై ప్రజల్లో ఆందోళనలు పెరుగుతున్నాయి.
నిరుద్యోగం ఒకవైపు యువతను కుంగదీస్తుంటే, మరోవైపు నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదల సామాన్య, మధ్యతరగతి కుటుంబాల ఆర్థిక పరిస్థితిని మరింత దిగజారుస్తోంది. ఆదాయాలు పెరగకపోయినా ఖర్చులు పెరుగుతుండటంతో కుటుంబాలు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నాయి. ఉద్యోగ భద్రత లేకపోవడం, ఉపాధి అవకాశాలు తగ్గిపోవడం, ధరల భారం పెరగడం కలిసి ప్రజల జీవన ప్రమాణాలను దెబ్బతీస్తున్నాయి. ఈ సమస్యలన్నీ విడివిడిగా కనిపించినా ఒకదానితో మరొకటి ముడిపడి ఉన్నవే. ప్రభుత్వాలు ఇప్పటికైనా ప్రకటనల పాలనకు స్వస్తి పలికి ఉపాధి కల్పన, ధరల నియంత్రణ, స్థానిక పరిశ్రమల పునరుద్ధరణ, పర్యావరణ పరిరక్షణపై దృష్టి సారించాలి. యువతకు ఉద్యోగాలు, ప్రజలకు మెరుగైన జీవన పరిస్థితులు, భవిష్యత్ తరాలకు సురక్షితమైన పర్యావరణం కల్పించడం పాలకుల ప్రాథమిక బాధ్యత. ప్రజల బతుకుల్లో మార్పు తీసుకురాని అభివృద్ధి ప్రచారానికి అర్థం లేదు. ప్రజల సంక్షేమమే అభివృద్ధికి అసలైన గీటురాయి కావాలి.

రచనలు పంపండి

వుదయం సాహిత్య పేజీ 'ఉష' కు సాహిత్య వ్యాసాలు, కవితలు, విమర్శలు పంపించాలని రచయితలకు ప్రత్యేకంగా విజ్ఞప్తి చేస్తున్నాం. అలాగే సంపాదకీయం పుటకు రాజకీయ ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక తదితర రంగాలపై వ్యాసాలను, సంపాదక లేఖలను పంపించవలసిందిగా కోరుతున్నాం. వాటిని ఈ కింది ఈమెయిల్ కు పంపించాలని మనవి.
voodayam2007@gmail.com
website : www.voodayam.com
Editor : 9247698676
1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020

రైతు కష్టానికి అంతం ఎప్పుడు?

పెట్టుబడి భారంతో మొదలై.. పంట అమ్మకం వరకు వెంటాడుతున్న సమస్యలు
సాగునీటి అనిశ్చితి.. విద్యుత్ అంతరాయాలు.. గిట్టుబాటు ధరల కోసం ఎదురుచూపులు అన్నం పెట్టే రైతుకు భరోసా మాటల్లోనా.. చేతల్లోనా?

తెల్లవారకముందే పొలంబాట పట్టే రైతుకు ప్రతి రోజు ఒక కొత్త పరీక్షే. విత్తనం కొనాలి.. ఎరువులు సమకూర్చుకోవాలి.. కూలీలను పెట్టుకోవాలి.. పొలానికి నీరు అందించాలి.. పంటను కంటికి రెప్పలా కాపాడుకోవాలి. నెలల తరబడి శ్రమించిన తర్వాత పంట చేతికి వచ్చినా దానికి గిట్టుబాటు ధర వస్తుందన్న నమ్మకం ఉండటం లేదు. ప్రకృతి వైపరీత్యాలు ఒకవైపు.. పెట్టుబడి ఖర్చులు మరోవైపు.. విద్యుత్ అంతరాయాలు, సాగునీటి కొరత ఇంకోవైపు.. ఇలా అన్నదాతను సమస్యలు చుట్టుముడుతున్నాయి. పంట పండించడమే కాదు.. దాన్ని కాపాడుకోవడం, మార్కెట్‌కు చేర్చడం, అమ్మిన తర్వాత డబ్బు చేతికి తెచ్చుకోవడం కూడా రైతుకు సవాలుగా మారుతోంది. పెట్టుబడి పెరుగుతోంది.. ఆదాయం మాత్రం అనిశ్చితంవ్యవసాయం అంటే విత్తనం వేసి పంట కోయడం మాత్రమే కాదు. ప్రతి దశలో రైతు డబ్బు ఖర్చు చేయాల్సి వస్తోంది. విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, దుక్కి దున్నడం, కూలీల ఖర్చులు, యంత్రాల అద్దెలు, రవాణా.. ఇలా సాగు ప్రారంభం నుంచే పెట్టుబడి పెరుగుతోంది. కూలీ రేట్లు, డీజిల్, వ్యవసాయ పరికరాల నిర్వహణ ఖర్చులు కూడా రైతు లెక్కలను తారుమారు చేస్తున్నాయి. చిన్న, సన్నకారు రైతులకు ఈ భారం మరింత ఎక్కువగా ఉంటుంది. పంట దిగుబడి బాగున్నా మార్కెట్‌లో ధర పడిపోతే రైతుకు ఆశించిన ఆదాయం రాదు. దిగుబడి తగ్గితే పెట్టుబడి కూడా తిరిగి వచ్చే పరిస్థితి ఉండదు. అప్పు చేసి సాగు చేసిన రైతుకు పంట నష్టమైతే తదుపరి సీజన్ పెట్టుబడి కోసం మళ్లీ అప్పు చేయాల్సి వస్తుంది. వ్యవసాయాన్ని లాభదాయకంగా మార్చాలంటే పెట్టుబడి వ్యయాన్ని తగ్గించే చర్యలతోపాటు పంటకు న్యాయమైన ధర కల్పించే విధానం అవసరం.నీటి కోసం ఎదురుచూపులు.. బోర్లపైనే ఆధారంవ్యవసాయానికి నీరే ప్రాణాధారం. వర్షాలు సకాలంలో కురవకపోతే బోర్లు, బావులపై ఆధారపడాల్సి వస్తుంది. భూగర్భజలాలు తగ్గుతున్న ప్రాంతాల్లో కొత్త బోర్లు వేయడం, పాత బోర్లను మరమ్మతు చేయడం రైతుకు అదనపు ఖర్చుగా మారుతోంది. బోరు వేయడానికి వేల రూపాయలు ఖర్చు చేసినా నీరు పడుతుందన్న హామీ లేదు. నీరు పడినా నిరంతరంగా అందుతుందన్న నమ్మకం ఉండదు. ఒకవైపు నీటి కొరత.. మరోవైపు మోటార్ల మరమ్మతులు.. రైతు ఆర్థిక పరిస్థితిని మరింత దెబ్బతీస్తున్నాయి. వర్షాధారంగా సాగు చేసే రైతులకు వర్షాలపై ఆధారపడటం తప్ప మరో మార్గం ఉండటం లేదు. సాగునీటి ప్రాజెక్టుల నీరు ఎప్పుడు, ఎంత మేరకు అందుతుందన్న స్పష్టత లేకపోతే పంటల ఎంపిక కూడా కష్టమవుతుంది. చెరువులు, కుంటలు, కాలువల నిర్వహణ, వర్షపు నీటి సంరక్షణ, భూగర్భజలాల పెంపుపై ప్రభుత్వం దీర్ఘకాలిక ప్రణాళికతో ముందుకు సాగాలి. నీటి లభ్యతను బట్టి పంటల సాగుపై రైతులకు ముందస్తు సమాచారం అందించాలి.విద్యుత్ అంతరాయాలతో మోటార్లకు నష్టంవ్యవసాయానికి విద్యుత్ సరఫరా అత్యంత కీలకం. కరెంటు ఎప్పుడు వస్తుందో, ఎప్పుడు పోతుందో తెలియని పరిస్థితి ఉంటే రైతు పంటకు నీరు పెట్టే సమయాన్ని కూడా నిర్ణయించుకోలేడు. తక్కువ వోల్టేజీ, తరచూ సరఫరా నిలిచిపోవడం వల్ల మోటార్లు, పంపుసెట్లు దెబ్బతినే ప్రమాదం ఉంది. వాటి మరమ్మతులకు రైతులు అదనంగా ఖర్చు చేయాల్సి వస్తోంది. కీలక సమయంలో నీరు అందక పంట ఎండిపోతే నష్టం మరింత తీవ్రంగా ఉంటుంది. వికారాబాద్ జిల్లాలో విద్యుత్ అంతరాయాలపై రైతుల ఆందోళనలు ఈ సమస్య తీవ్రతను బయటపెట్టాయి. 2026 అక్టోబర్ 9న కేరెల్లి, ఇబ్బనూర్, కొండాపూర్, కుర్దు, బాచారం గ్రామాల రైతులు వికారాబాద్-తాండూరు రహదారిపై నిరసనకు దిగారు. తరచూ విద్యుత్ సరఫరా నిలిచిపోవడం, తక్కువ వోల్టేజీతో మోటార్లు దెబ్బతినడం, పంటలకు సక్రమంగా నీరు అందకపోవడం తమ సమస్యలని రైతులు ఆందోళనలో పేర్కొన్నారు. నాణ్యమైన విద్యుత్ రోజులో రెండు మూడు గంటలకే పరిమితమవుతోందని వారు ఆరోపించారు. కేవలం విద్యుత్ శాఖకు సంబంధించిన సమస్యగా చూడలేం. విద్యుత్ సరఫరాలో అంతరాయం అంటే పొలానికి నీరు అందకపోవడం.. నీరు అందకపోతే పంట ఎదుగుదల దెబ్బతినడం.. చివరకు రైతు ఆదాయం తగ్గిపోవడం. అందువల్ల వ్యవసాయ విద్యుత్ సరఫరాకు నిర్దిష్ట షెడ్యూల్, నాణ్యమైన వోల్టేజీ, అత్యవసర మరమ్మతులకు వేగవంతమైన స్పందన ఉండాలి. సరఫరా నిలిపివేయాల్సిన పరిస్థితి ఉంటే రైతులకు ముందుగానే సమాచారం ఇవ్వాలి. మోటార్లు, ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతిన్నప్పుడు బాధిత రైతులకు పరిష్కారం చూపాలి.పంట పండినా గిట్టుబాటు ధర ఎక్కడ?రైతు కష్టానికి నిజమైన ఫలితం పంట అమ్మినప్పుడే తెలుస్తుంది. నెలల తరబడి శ్రమించి పండించిన పంటను మార్కెట్‌కు తీసుకెళ్లినప్పుడు ఆశించిన ధర రాకపోతే అతడి కష్టం వృథా అవుతుంది. పెట్టుబడి ఖర్చులు పెరుగుతున్నా పంట ధరలు అదే స్థాయిలో పెరగకపోవడం రైతును నష్టాల్లోకి నెడుతోంది. మార్కెట్‌లో ధరలు ఒక్కసారిగా పడిపోవడం, కొనుగోళ్లలో జాప్యం, తూకాల్లో అనుమానాలు, చెల్లింపులు ఆలస్యం కావడం వంటి సమస్యలు కూడా రైతులను ఇబ్బంది పెడుతున్నాయి. కనీస మద్దతు ధర ప్రకటించడం మాత్రమే సరిపోదు. ఆ ధరకు పంటను కొనుగోలు చేసే వ్యవస్థ పటిష్ఠంగా పనిచేయాలి. కొనుగోలు కేంద్రాలు సమయానికి ప్రారంభం కావాలి. తేమ శాతం, నాణ్యత పేరుతో రైతుల పంటను తిరస్కరించే సందర్భాల్లో స్పష్టమైన నిబంధనలు అమలవ్వాలి. కొనుగోలు చేసిన ధాన్యం, ఇతర పంటలకు చెల్లింపులు నిర్ణీత గడువులో రైతుల ఖాతాల్లో జమ కావాలి. మార్కెట్‌లో మధ్యవర్తుల దోపిడీకి అడ్డుకట్ట వేయాలి. పంట చేతికి వచ్చిన సమయంలో ధరలపై ముందస్తు అంచనాలు, మార్కెట్ సమాచారం రైతులకు అందుబాటులో ఉండాలి.కౌలు రైతుల పరిస్థితి మరింత దుర్భరంసొంత భూమి ఉన్న రైతులతో పోలిస్తే కౌలు రైతుల సమస్యలు మరింత క్లిష్టంగా ఉంటాయి. భూమిని కౌలుకు తీసుకోవడానికి ముందుగానే పెద్ద మొత్తంలో డబ్బు చెల్లించాలి. ఆ తర్వాత విత్తనాలు, ఎరువులు, కూలీలు, నీటి ఖర్చులు భరించాలి. పంట నష్టపోతే కౌలు చెల్లింపు బాధ్యత మాత్రం తప్పదు. ప్రభుత్వ పథకాలు, పెట్టుబడి సాయం, పంట బీమా వంటి ప్రయోజనాలు పొందడంలో కూడా అర్హత, గుర్తింపు, పత్రాల సమస్యలు ఎదురవుతాయి. భూమిని సాగు చేస్తున్న వ్యక్తికే ప్రభుత్వ సహాయం అందేలా కౌలు రైతుల గుర్తింపు ప్రక్రియను పారదర్శకంగా రూపొందించాలి. భూయజమానుల హక్కులకు భంగం కలగకుండా సాగుదారుల సమస్యలకు పరిష్కారం చూపాలి. బీమా.. నష్టపరిహారం అందడంలో జాప్యం వద్దుఅకాల వర్షాలు, వడగండ్లు, తెగుళ్లు, ఎండ తీవ్రత, వరదలు వంటి కారణాలతో పంట నష్టపోయినప్పుడు రైతుకు తక్షణ ఆర్థిక సహాయం అవసరం. పంట బీమా పథకాలు ఉన్నా వాటి ప్రయోజనాలు రైతులకు సులభంగా అందుతున్నాయా? నష్టం అంచనా పారదర్శకంగా జరుగుతోందా? పరిహారం సకాలంలో అందుతోందా? అన్న అంశాలను ప్రభుత్వం సమీక్షించాలి. పంట నష్టం జరిగిన తర్వాత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి వివరాలను నమోదు చేయాలి. వికారాబాద్ రైతులకు ప్రత్యేక కార్యాచరణ అవసరంవికారాబాద్ జిల్లాలో వర్షాధార సాగుతోపాటు బోర్లు, బావులపై ఆధారపడే రైతులు కూడా ఉన్నారు. ప్రాంతాన్నిబట్టి నీటి లభ్యత, నేల స్వభావం, పంటల సాగు మారుతున్నాయి. విద్యుత్ అంతరాయాలు, భూగర్భజలాల తగ్గుదల, మోటార్ల మరమ్మతులు, పెట్టుబడి వ్యయాలు రైతులపై అదనపు భారాన్ని మోపుతున్నాయి. జిల్లాలోని ప్రతి మండలంలో వ్యవసాయ పరిస్థితులను వేర్వేరుగా పరిశీలించాలి. విద్యుత్ శాఖ అధికారులు గ్రామాలవారీగా సరఫరా సమయాలు, అంతరాయాలు, తక్కువ వోల్టేజీ సమస్యలు, దెబ్బతిన్న ట్రాన్స్‌ఫార్మర్ల వివరాలను సేకరించాలి. వ్యవసాయ శాఖ అధికారులు పంటల పరిస్థితి, సాగు విస్తీర్ణం, నీటి అవసరాలు, పెట్టుబడి వ్యయాలపై నివేదిక రూపొందించాలి. నీటిపారుదల శాఖ చెరువులు, కాలువలు, సాగునీటి వనరుల స్థితిగతులను వెల్లడించాలి. ఈ శాఖల మధ్య సమన్వయం ఉంటే సమస్యలను ముందుగానే గుర్తించి పరిష్కరించే అవకాశం ఉంటుంది.హామీలకు మించి అమలు ముఖ్యం రైతు సంక్షేమం అనేది ఒక పథకంతోనో, ఒక ప్రకటనతోనో పూర్తయ్యే అంశం కాదు. సాగుకు అవసరమైన విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉండాలి. నాణ్యమైన విద్యుత్ సరఫరా జరగాలి. సాగునీటి వనరులను సమర్థంగా నిర్వహించాలి. పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలి. నష్టపోయిన రైతులకు బీమా, పరిహారం సకాలంలో అందాలి. వ్యవసాయ మార్కెట్లలో పారదర్శకత ఉండాలి. ఈ అంశాలన్నీ సమన్వయంతో అమలైనప్పుడే రైతుకు నిజమైన భరోసా లభిస్తుంది. ప్రభుత్వం ప్రతి సీజన్‌కు ముందే వ్యవసాయ కార్యాచరణ ప్రణాళిక ప్రకటించాలి. రైతు సంఘాలు, క్షేత్రస్థాయి అధికారులు, వ్యవసాయ నిపుణులతో సమావేశాలు నిర్వహించి సమస్యలను తెలుసుకోవాలి. విద్యుత్, నీరు, విత్తనాలు, ఎరువులు, కొనుగోళ్లపై ఫిర్యాదులు స్వీకరించే ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేయాలి. వచ్చిన ఫిర్యాదులకు నిర్ణీత సమయంలో పరిష్కారం చూపాలి. రైతు సమస్యను కార్యాలయాల చుట్టూ తిప్పకుండా పొలం దగ్గరే పరిష్కరించే విధానం రావాలి.అన్నదాతకు భరోసా మాటల్లో కాదు.. చేతల్లో చూపాలి రైతు బాగుంటేనే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బాగుంటుంది. రైతు పంట పండిస్తేనే ప్రజలకు ఆహారం అందుతుంది. అలాంటి రైతు సాగు కోసం అప్పులు చేసి, పంటను కాపాడుకోవడానికి రాత్రింబవళ్లు కష్టపడి, చివరకు గిట్టుబాటు ధర కోసం ఎదురుచూడాల్సి రావడం ఆందోళనకరం. వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చకుండా రైతు కుటుంబాల భవిష్యత్తుకు భరోసా కల్పించడం సాధ్యం కాదు. వికారాబాద్ రైతుల విద్యుత్ సమస్యలపై వచ్చిన నిరసన వార్తలు పాలకులకు ఒక హెచ్చరిక. రైతు రోడ్డెక్కిన తర్వాత స్పందించడం కాదు.. సమస్య రాకముందే పరిష్కరించే వ్యవస్థ ఉండాలి. విద్యుత్ సరఫరా సాగునీరు, పెట్టుబడి ఖర్చులు, పంట కొనుగోళ్లు, గిట్టుబాటు ధరలపై ప్రభుత్వం స్పష్టమైన కార్యాచరణ ప్రకటించి అమలు చేయాలి. రైతు చెమటకు విలువ దక్కాలి. పంటకు ధర రావాలి. నష్టపోతే పరిహారం అందాలి. సాగు చేయడానికి భయం కాకుండా భరోసా కలగాలి. అన్నం పెట్టే రైతు తన కుటుంబానికి అన్నం పెట్టుకోలేని పరిస్థితి రావడం సమాజానికి అవమానం. రైతు కష్టాన్ని గుర్తించడం అంటే ప్రసంగాల్లో పొగడటం కాదు.. అతడి పొలంలో సమస్యను పరిష్కరించడం. రైతుకు ఇచ్చే హామీ పంట చేతికి వచ్చే నాటికి ఫలితంగా కనిపించాలి. అన్నదాతకు భరోసా మాటల్లో కాదు.. చేతల్లో నిరూపించాలి.

ఎం రవీందర్
7901503777

ఐక్యతకు ప్రతీక భారత్.. విభేదాలకు బలికావద్దు!

భాషలు వేరు.. యాసలు వేరు.. మతాలు వేరు.. సంప్రదాయాలు వేరు.. అయినా మనమంతా భారతీయులమే! ఇదే ప్రపంచంలో భారతదేశానికి ప్రత్యేక గుర్తింపు తెచ్చిన భిన్నత్వంలో ఏకత్వం. స్వాతంత్ర్యం కోసం కలిసికట్టుగా పోరాడిన జాతి.. నేడు కులం, మతం, ప్రాంతం, భాష పేరుతో పరస్పరం దూరమైతే దేశ ప్రగతి ఎలా సాధ్యం? విభిన్న అభిప్రాయాలు సహజమే.. అవి విద్వేషాలుగా మారడమే ప్రమాదకరం. ఈ వాస్తవాన్ని గుర్తుచేసే సందర్భమే అక్టోబర్ 31న నిర్వహించే జాతీయ ఐక్యత దినోత్సవం. సర్దార్ వల్లభభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకొని నిర్వహించే ఈ వేడుక కేవలం ప్రతిజ్ఞలకో, పరుగులకో పరిమితం కాకూడదు. దేశాన్ని ఏకం చేసిన మహనీయుడి స్ఫూర్తిని మన జీవితాల్లో ఆచరించే సంకల్పంగా మారాలి.సంస్థానాలను ఏకం చేసిన ఉక్కు మనిషి1875 అక్టోబర్ 31న జన్మించిన సర్దార్ వల్లభభాయ్ పటేల్ స్వాతంత్ర్య ఉద్యమంలో కీలక పాత్ర పోషించారు. స్వాతంత్ర్యానంతరం వందలాది సంస్థానాలను భారత సమాఖ్యలో విలీనం చేయడంలో ఆయన చూపిన దృఢ సంకల్పం, రాజకీయ చతురత దేశ చరిత్రలో చిరస్థాయిగా నిలిచాయి. భారత దేశ తొలి ఉపప్రధానిగా, హోంమంత్రిగా ఆయన దేశ సమైక్యతకు పునాదులు బలోపేతం చేశారు. అందుకే ఆయనను 'భారత ఉక్కు మనిషి'గా గౌరవిస్తున్నాం. ఆయన జయంతిని జాతీయ ఐక్యత దినోత్సవంగా నిర్వహించడం వెనుక ఉన్న ఉద్దేశం కూడా దేశ సార్వభౌమత్వం, సమగ్రత, భద్రతను కాపాడుకోవాలనే సంకల్పాన్ని పునరుద్ధరించుకోవడమే. నాడు సంస్థానాలను ఏకం చేసిన పటేల్‌ను స్మరించుకుంటున్న మనం.. నేడు ప్రజల మధ్య పెరుగుతున్న అగాధాలను తగ్గించేందుకు ఏం చేస్తున్నాం? దేశాన్ని భౌగోళికంగా ఏకం చేయడం ఎంత ముఖ్యమో.. ప్రజల హృదయాలను ప్రేమ, పరస్పర గౌరవంతో అనుసంధానించడం కూడా అంతే ముఖ్యం.

రాజ్యాంగం చెప్పిన ఐక్యతా మార్గం

భారత రాజ్యాంగం పౌరులకు హక్కులను కల్పించడమే కాకుండా బాధ్యతలను కూడా గుర్తుచేస్తోంది. రాజ్యాంగంలోని 51ఏ అధికరణం ప్రకారం దేశ సార్వభౌమత్వం, ఐక్యత, సమగ్రతను కాపాడటం ప్రతి పౌరుడి ప్రాథమిక విధుల్లో ఒకటి. మత, భాష, ప్రాంతీయ భేదాలకు అతీతంగా సామరస్యాన్ని, సౌభ్రాతృత్వాన్ని పెంపొందించడం కూడా పౌరుల బాధ్యతే. ఈ రాజ్యాంగ స్ఫూర్తి పుస్తకాలకే పరిమితం కాకూడదు. ఇతరుల విశ్వాసాలను గౌరవించడం, మహిళల గౌరవాన్ని కాపాడటం, వివక్షకు దూరంగా ఉండటం, హింసను తిరస్కరించడం నిత్యజీవితంలో కనిపించాలి. దేశభక్తి అంటే జాతీయ జెండాకు వందనం చేయడం మాత్రమే కాదు.. ఆ జెండా కింద జీవిస్తున్న ప్రతి భారతీయుడి గౌరవాన్ని గుర్తించడం కూడా! హక్కుల కోసం గొంతెత్తినప్పుడు బాధ్యతలను మరచిపోకూడదు. బాధ్యతలను నిర్వర్తించినప్పుడే హక్కులకు నిజమైన విలువ లభిస్తుంది.

రాజకీయాలకు అతీతంగా ప్రజల ఐక్యత

ప్రజాస్వామ్యంలో భిన్నమైన రాజకీయ అభిప్రాయాలు ఉండటం సహజం. ప్రభుత్వ విధానాలను ప్రశ్నించడం, ప్రజా సమస్యలపై విమర్శించడం పౌరుల హక్కు. అయితే రాజకీయ ప్రయోజనాల కోసం ప్రజల మధ్య ద్వేషాన్ని పెంచడం, కులమతాల పేరుతో సమాజాన్ని చీల్చడం, నిర్ధారణ లేని సమాచారంతో ఉద్రిక్తతలు సృష్టించడం దేశ ప్రయోజనాలకు విరుద్ధం. రాజకీయ నాయకులు తమ మాటల్లో సంయమనం పాటించాలి. ప్రభుత్వాలు చట్టాన్ని నిష్పాక్షికంగా అమలు చేస్తూ ప్రతి పౌరుడికి సమాన రక్షణ కల్పించాలి. నేరానికి పాల్పడిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలి తప్ప.. అతని కులం, మతం లేదా ప్రాంతం ఆధారంగా ప్రజలను నిందించకూడదు. భిన్నాభిప్రాయాలను శత్రుత్వంగా కాకుండా ప్రజాస్వామ్య సహజ లక్షణంగా చూడాలి. మనిషిని మనిషిగా గౌరవించే సంస్కృతి బలపడినప్పుడే సామాజిక ఐక్యతకు గట్టి పునాది పడుతుంది.యువత చేతుల్లోనే రేపటి భారత్‌నేటి యువత చేతుల్లోనే రేపటి భారతదేశం రూపుదిద్దుకోనుంది. సామాజిక మాధ్యమాల్లో వచ్చే ప్రతి సమాచారాన్ని నిజమని నమ్మడం, నిర్ధారణ లేని వార్తలను ఇతరులకు పంపడం, భిన్నాభిప్రాయాలున్న వారిపై ద్వేషపూరిత వ్యాఖ్యలు చేయడం సమాజంలో చీలికలకు కారణమవుతాయి. యువత సమాచారాన్ని పరిశీలించి నిజానిజాలు తెలుసుకోవాలి. తప్పుడు ప్రచారాన్ని తిరస్కరించాలి. కులమతాలకు అతీతంగా స్నేహభావాన్ని పెంపొందించుకోవాలి. పాఠశాలలు, కళాశాలల్లో స్వాతంత్ర్య సమరయోధుల చరిత్రతోపాటు రాజ్యాంగ విలువలు, పౌర బాధ్యతలు, సామాజిక సామరస్యంపై అవగాహన కల్పించాలి. భిన్న భాషలు, సంప్రదాయాల పట్ల గౌరవం పెంచాలి. ఐక్యత అంటే అందరూ ఒకేలా ఉండటం కాదు.. భిన్నంగా ఉన్నా దేశ ప్రయోజనాల కోసం కలిసికట్టుగా నిలవడం. ద్వేషాన్ని పంచే సందేశం కన్నా స్నేహాన్ని పెంచే మాట గొప్పది. విభజనకు దారితీసే చర్య కన్నా ఐక్యతను పెంచే ప్రయత్నమే నిజమైన దేశసేవ.వేడుకలతో కాదు.. ఆచరణతోనే ఐక్యతజాతీయ ఐక్యత దినోత్సవం సందర్భంగా ప్రతిజ్ఞలు చేయడం, ఐక్యతా పరుగులు నిర్వహించడం, సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టడం మంచి పరిణామం. కానీ ఆ స్ఫూర్తి మరుసటి రోజే మాయమైతే ప్రయోజనం ఏమిటి? కులమత వివక్షకు తావులేకుండా ప్రభుత్వ సేవలు అందాలి. విద్య, ఉపాధి, వైద్యం వంటి రంగాల్లో వెనుకబడిన వర్గాలకు సమాన అవకాశాలు కల్పించాలి. పేదరికం, నిరుద్యోగం, విద్యలో అసమానతలు వంటి సమస్యల పరిష్కారానికి ప్రభుత్వాలు చిత్తశుద్ధితో కృషి చేయాలి. మీడియా వాస్తవాలకు ప్రాధాన్యమిస్తూ సామాజిక బాధ్యతతో వ్యవహరించాలి. ప్రజలు తప్పుడు ప్రచారాన్ని నమ్మకుండా, హింసకు దూరంగా ఉంటూ శాంతి, సౌభ్రాతృత్వాలను కాపాడాలి. దేశ ఐక్యత అనేది కేవలం సరిహద్దులను కాపాడటంతోనే పూర్తికాదు.. దేశంలోని ప్రతి పౌరుడికి గౌరవం, భద్రత, న్యాయం లభించినప్పుడే అది మరింత బలపడుతుంది.సర్దార్ వల్లభభాయ్ పటేల్ జీవితం మనకు ఇచ్చిన సందేశం స్పష్టం. దేశం బలంగా ఉండాలంటే ప్రజలు కలిసుండాలి.. ప్రజలు కలిసుండాలంటే సమానత్వం, న్యాయం, పరస్పర గౌరవం బలపడాలి. ఐక్యతను ప్రసంగాల్లో ప్రశంసిస్తూ ఆచరణలో విభేదాలను పెంచితే ఆశించిన ఫలితం రాదు. జాతీయ ఐక్యత దినోత్సవం మనకు ఒక ప్రశ్న వేయాలి: దేశం కోసం మనం ఏం చేస్తున్నాం? మన మాటలు ప్రజలను కలుపుతున్నాయా.. విడదీస్తున్నాయా? మన చర్యలు సామరస్యాన్ని పెంచుతున్నాయా.. విద్వేషాలకు తావిస్తున్నాయా? ఈ ప్రశ్నలకు ప్రతి పౌరుడూ తన మనస్సాక్షి ముందు సమాధానం చెప్పుకోవాలి. జెండా ఒక్కటే ఉంటే సరిపోదు.. మనసులూ కలవాలి! రాజ్యాంగం చేతిలో ఉంటే సరిపోదు.. దాని విలువలు జీవితాల్లో కనిపించాలి! పటేల్‌ను స్మరించడమే కాదు.. ఆయన ఆశయాలను ఆచరించాలి! ఐక్యత మన బలం.. సమానత్వం మన పునాది.. సమైక్య భారతమే మన సంకల్పం కావాలి!

శ్రీశైలం దూడం
ఫ్రీలాన్స్ జర్నలిస్ట్
జగిత్యాల
9133947176

పర్యావరణం, ప్రజారోగ్య పరిరక్షణే 'వేగనిజం' ధ్యేయం

పండ్లు, కాయలు, ఆకుకూరలు, కూరగాయలు, ఆహార ధాన్యాలు, పప్పులు, నట్స్, గింజలు, సూపర్‌ఫుడ్స్ లాంటి వృక్ష సంబంధ ఆహార పదార్థాలను "వేగన్ ఫుడ్"గా వర్గీకరిస్తారు. వృక్ష లేదా మొక్కల నుంచి లభించే ఉత్పత్తులను మాత్రమే తమ ఆహారంగా తీసుకునే వ్యక్తులను "వేగన్స్" అని, ఇలాంటి ఆహార పదార్థాలను తీసుకోవాలని ప్రచారం చేసే ఉద్యమాన్ని "వేగనిజం" అని పిలుస్తున్నాం. జంతు సంబంధ మాంసం, పాలు, పాల ఉత్పత్తులు, జంతు కొవ్వు, గుడ్లు, తేనె లాంటి ఆహార పదార్థాలకు దూరంగా కేవలం మొక్కలు లేదా వృక్షాల నుంచి లభించే ఉత్పత్తులను వినియోగించడం, వీటి ప్రాధాన్యాలను వివరించడం, వేగనిజం పాటించడానికి ప్రజలను చైతన్య పరచడం లాంటి ఉన్నత లక్ష్యాలతో 1994 నుంచి ప్రతి ఏట 01 నవంబర్‌న "ప్రపంచ వేగన్ దినోత్సవాన్ని" పాటించుట ఆనవాయితీగా మారింది. లూయిస్ వాల్లిస్ చొరవతో యూకెలో ఏర్పడిన తొలి వేగన్ సొసైటీ 50వ వార్షికోత్సవం సందర్భంగా ప్రపంచ వేగన్ దినం పాటించుట జరుగుతున్నది.

వేగనిజం ప్రయోజనాలు:

వేగన్ లేదా శాఖాహార ఉత్పత్తులను మాత్రమే తీసుకొనుట మన జీవనశైలిలో అలవాటు అయితే మానవాళి ఆరోగ్యంతో పాటు జంతు సంరక్షణ, భూగ్రహ పర్యావరణ పరిరక్షణ కూడా జరుగుతాయని తెలుసుకోవాలి. జంతు సంబంధ ఆహార పదార్థాలతో పాటు జంతు ఉత్పత్తుల నుంచి తయారైన వస్త్రాలు, ఎముకలతో తయారైన ఉత్పత్తులు, తోలు సంబంధ వస్తువులు మొదలగు వాటి వాడకాన్ని కూడా వేగన్స్ నిషేధిస్తారు. జంతు ఆహార ఉత్పత్తులు తినడం లేదా వాడడంతో జీవ వైవిధ్యం దెబ్బ తినడం, జంతు హింస, సాదు జంతువుల వల్ల అడవుల్లో హరిత క్షేత్రాలు పలచబడడం, పర్యావరణ కాలుష్యానికి ఆజ్యం పోయడం, భూతాపం పెరగడం లాంటి ప్రతికూల మార్పులకు దారి తీస్తుందని, కేవలం వృక్ష సంబంధ ఆహారం లేదా ఇతర ఉత్పత్తులు వాడడం వల్ల మానవాళి ఆరోగ్యంతో పాటు సుస్థిర పర్యావరణం, జీవ వైవిధ్యం ఫలిస్తాయని తెలుసుకోవాలి. వరల్డ్ వేగన్ డే సందర్భంగా శాఖాహారాన్ని ప్రోత్సహిస్తూ #గోవేగన్, #వేగన్‌లైఫ్‌స్టైల్, #ప్లాంట్‌బేస్డ్‌ఛాయిసెస్ లాంటి హాష్‌ట్యాగులతో సామాజిక మాధ్యమాలు, వేగన్ డే వేదికలు, విద్యాలయాల్లో ముమ్మర ప్రచారం చేయడానికి ప్రతి ఒక్కరం కృషి చేద్దాం, ఆరోగ్యకర పౌర సమాజాన్ని/పర్యావరణాన్ని/జంతుజాలాన్ని నిర్మిద్దాం.

మధుసూదన్ రెడ్డి
9949700037

జాతీయం-అంతర్జాతీయం

నిజమైన ఓటర్ల కోసం పోరాడుతున్నాం : ఖర్గే

న్యూఢిల్లీ :
ఇండియా బ్లాక్ 'చొరబాటుదారులను' కాపాడటానికి కాకుండా నిజమైన ఓటర్ల కోసమే పోరాడుతోందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే పేర్కొన్నారు. న్యూఢిల్లీలోని రాజాజీ మార్గ్‌లో ఉన్న ఖర్గే నివాసంలో, మాజీ లోక్‌సభ స్పీకర్ మీరా కుమార్ అధ్యక్షతన, ఇండియా బ్లాక్ 'బహిరంగ అభిశంసన' కార్యక్రమం శనివారం ప్రారంభమైంది. సిఇసి జ్ఞానేశ్ కుమార్‌పై ఇండియా బ్లాక్ చేపట్టిన ఈ ప్రతీకాత్మక బహిరంగ అభిశంసన కార్యక్రమంలోఖర్గే మాట్లాడారు. ఇండియా బ్లాక్ 'చొరబాటుదారులను' కాపాడటానికి కాకుండా నిజమైన ఓటర్ల కోసమే పోరాడుతోందని అన్నారు. ఈ కార్యక్రమంలో సిఇసిపై ఆరు అభియోగాలను ప్రదర్శించారు. సిఇసి జ్ఞానేశ్ కుమార్ ఓట్లను దొంగిలించడానికి కుట్ర పన్నారని, 13.2 కోట్ల ఓటర్లను తొలగించారని, పార్లమెంటు ప్రమేయం లేకుండా ఫారం 6ను తిరిగి రాశారని, ఈసిఐనెట్ ద్వారా ఓటర్ల జాబితాను స్వాధీనం చేసుకున్నారని, ఇతర ఇద్దరు ఎన్నికల కమిషనర్లను పక్కన పెట్టారని, ప్రధాని మోడీ, అమిత్ షాల ఆదేశాల మేరకు పనిచేశారని పేర్కొన్నారు.
సార్వత్రిక వయోజన ఓటు హక్కుకు హామీ ఇచ్చే రాజ్యాంగంలోని ఆర్టికల్ 326 తీవ్ర ముప్పులో ఉందని అన్నారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ (సిఇసి) జ్ఞానేశ్ కుమార్ ప్రధాని మోడీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షాలు '' ప్రత్యక్ష ఆదేశాల'' మేరకు ఎన్నికల కమిషన్‌ను నడుపుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏడు నెలల క్రితం, 193 మంది ప్రతిపక్ష ఎంపీలు పార్లమెంటు ఉభయ సభలలో సిఇసిని తొలగించాలని ఒక తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. అయితే, తమ నోటీసులను తిరస్కరించారని, వాటిని పరిగణనలోకి తీసుకోలేదని అన్నారు. దీంతో ఈ రోజు తాము ప్రవేశపెట్టిన తీర్మానం ఒక రాజ్యాంగ సంస్థ గౌరవాన్ని కాపాడటమే లక్ష్యంగా పెట్టుకుందని అన్నారు.నవంబర్ 1న సెంట్రల్ ఢిల్లీలోని మింటో రోడ్‌కన్నాట్ ప్లేస్ జంక్షన్ నుండి రామ్‌లీలా మైదాన్ వరకు ప్రతిపక్ష పార్టీలు 'చలో ఢిల్లీ' మార్చ్ చేపడతాయని లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ అన్నారు. ఓట్ల చోరీకి వ్యతిరేకంగా ర్యాలీ నిర్వహించి, సిఇసి రాజీనామా చేయాలని ఇండియా బ్లాక్ డిమాండ్ చేస్తుందని తెలిపారు. నవంబర్ 1న జరిగే ర్యాలీకి ప్రజలు ఢిల్లీకి రాకుండా హోం మంత్రి అడ్డుకునేందుకు యత్నిస్తున్నారని రాహుల్‌గాంధీ మండిపడ్డారు.

ఎన్‌సీలో ముదిరిన విభేదాలు..

శ్రీనగర్ :
జమ్మూకశ్మీర్‌లో అధికార నేషనల్ కాన్ఫరెన్స్ (ఎన్‌సీ)లో అంతర్గత విభేదాలు భగ్గుమన్నాయి. శ్రీనగర్ లోక్‌సభ సభ్యుడు అగా సయ్యద్ రుహుల్లా మెహదీ పార్టీ నాయకత్వంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తూ సంచలన ప్రకటన చేశారు. నవంబర్ 3న తన ఎంపీ పదవితో పాటు పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేయనున్నట్లు శనివారం ప్రకటించారు. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో, కనీసం వాటి అమలుకు చర్యలు చేపట్టడంలోనూ పార్టీ విఫలమైందని విమర్శించారు. నవంబర్ 3న బుద్గామ్‌లోని బెహిష్‌త్‌ఎజెహ్రా పార్కులో అగా సయ్యద్ మెహదీ వర్ధంతి కార్యక్రమంలో ప్రజలను ఉద్దేశించి ప్రసంగించిన అనంతరం రాజీనామా చేస్తానని అన్నారు. పార్టీలో జరుగుతున్న రాజకీయ బేరసారాలతో తనను ముడిపెట్టవద్దని స్పష్టం చేశారు. ఎన్నికల హామీలను అమలు చేయకపోవడమే తన అసంతృప్తికి కారణమని చెప్పారు. తనకు ఎలాంటి పదవి దక్కలేదని బాధపడటం లేదని అన్నారు. ఎన్‌సీ నాయకత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. జమ్మూకశ్మీర్‌ను ఒక కుటుంబానికి చెందిన వారసత్వ ఆస్తిగా పార్టీ నాయకత్వం భావిస్తోందని అన్నారు. అధికారంలోకి రావడానికి ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరించిందని మండిపడ్డారు.



ఆర్టికల్ 370 పునరుద్ధరణ, ఖైదీల విడుదల, ప్రజల హక్కుల పరిరక్షణ వంటి హామీలతోనే పార్టీ అధికారంలోకి వచ్చిందని, వాటిని అమలు చేయాలని కోరితే తమకే రాజకీయాలపై అవగాహన లేదన్నట్లుగా మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ పరిస్థితులను పార్టీలో ఉండి సరిదిద్దడం సాధ్యం కాదని పేర్కొన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీతోనే ఎంపీగా గెలిచానని, ఆ హామీలకు ద్రోహం చేయడంలో భాగస్వామి కావడం ఇష్టం లేకే పదవిని వదులుకోవాలని నిర్ణయించుకున్నానని అన్నారు.మెహదీ ప్రకటనపై జమ్మూకశ్మీర్ మంత్రి జావేద్ రాణా స్పందించారు. ఆయన పార్టీని వీడినంత మాత్రాన ఎన్‌సీకి ఎలాంటి నష్టం ఉండదని అన్నారు. పార్టీ నాయకత్వం కింద ఎన్‌సీ ఐక్యంగా, బలంగా ఉందని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా నాయకత్వంలోని ప్రభుత్వం, ఫరూక్ అబ్దుల్లా నాయకత్వంలో పార్టీ పటిష్టంగా ఉన్నాయని పేర్కొన్నారు. మంత్రి పదవులు పరిమితంగా ఉండటంతో కొందరు ఎమ్మెల్యేల్లో అసంతృప్తి ఉండవచ్చని అభిప్రాయపడ్డారు. రాష్ట్ర హోదా పునరుద్ధరణ జరిగితే మరిన్ని మంత్రి పదవులు అందుబాటులోకి వస్తాయని చెప్పారు.

మంత్రివర్గ విస్తరణతో అసంతృప్తి

ఇటీవల జమ్మూకశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా తన మంత్రివర్గాన్ని విస్తరించారు. కుప్వారా జిల్లా ట్రెహ్‌గామ్ ఎమ్మెల్యే మీర్ సైఫుల్లా, శ్రీనగర్ ఖన్యార్ ఎమ్మెల్యే అలీ మహమ్మద్ సాగర్, హబ్బా కడల్ ఎమ్మెల్యే షమీమా ఫిర్దౌస్, పహల్గామ్ ఎమ్మెల్యే అల్తాఫ్ అహ్మద్ వానీలను మంత్రులుగా తన కేబినెట్‌లోకి తీసుకున్నారు. ఈ విస్తరణ అనంతరం కొందరు నాయకులు అసంతృప్తి వ్యక్తం చేశారని ఎన్‌సీ కశ్మీర్ ప్రావిన్షియల్ అధ్యక్షుడు షౌకత్ అహ్మద్ మీర్ తెలిపారు. అయితే ఇది పార్టీ అంతర్గత వ్యవహారంలో భాగమేనని అన్నారు. కొందరు ఎమ్మెల్యేలు తమతో మాట్లాడినప్పుడు 'దర్బార్ మూవ్' అంశంపై చర్చించినట్లు వెల్లడించారు. ఈ వ్యవహారంలో 27 మంది ఎమ్మెల్యేలు పాల్గొంటున్నారంటూ వచ్చిన వార్తలను ఆయన ఖండించారు. ఇలాంటి పుకార్లకు బిజెపి ఆజ్యం పోస్తోందని అన్నారు. జమ్మూ ప్రజలకు రాష్ట్ర హోదా పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చిన బిజెపి, ఆ విషయంలో విఫలమైందని విమర్శించారు.

అర్జెంటీనా దౌత్యవేత్తకు బ్రెజిల్ సమన్లు

బ్రసీలియా :
దేశం నుండి పారిపోయిన మితవాద అభ్యర్థి ఫ్లావియో బోల్సెనారో గురించి వివరాలు అందించాలని అర్జెంటీనా అగ్ర రాయబారికి బ్రెజిల్ సమన్లు జారీ చేసినట్లు ప్రభుత్వ వర్గాలు శనివారం తెలిపాయి. బ్రెజిల్ విదేశాంగ శాఖ గురువారం అర్జెంటీనా ఛార్జ్ డి అఫైర్స్, ఎమిలియా కోర్టెస్‌ను పిలిపించిందని ఆ వర్గాలు మీడియాకు వెల్లడించాయి. ఆదివారం జరిగిన అధ్యక్ష ఎన్నికల్లో మితవాద అభ్యర్థి ఫ్లావియో బోల్సెనారో ఓటమిపాలైన సంగతి తెలిసిందే. దీంతో ఆయన అర్జెంటీనాకు అక్కడి నుండి అమెరికాకు పారిపోయినట్లు సమాచారం. బోల్సోనారో దేశం విడిచి వెళ్లిన వ్యవహారం బ్రెజిల్ అధ్యక్షుడు లూలా డా సిల్వా, అర్జెంటీనా అధ్యక్షుడు జేవియర్ మిలే మధ్య ఇప్పటికే ఉన్న విభేదాలను మరింత పెరిగే అవకాశముందని ఆ వర్గాలు తెలిపాయి.
ఆదివారం ఎన్నికల అనంతరం పాస్‌పోర్టులు అప్పగించాల్సిందిగా బోల్సోనారోకు గడువు బ్రెజిల్ ప్రభుత్వం గడువు విధించింది. బాంకో మాస్టర్ స్కామ్‌గా పిలిచే మనీలాండరింగ్ కేసులో భాగంగా, ఆయనను దేశం విడిచి వెళ్లకూడదని ఆదేశించింది. మాజీ అధ్యక్షుడు, తన తండ్రి జైర్ బోల్సెనారో సినిమాకు నిధులు సమకూర్చడం కోసం, బాంకో మాస్టర్ మాజీ అధ్యక్షుడు డేనియల్ వోర్కారో నుండి బోల్సెనారో కోట్ల డాలర్ల చెల్లింపులు తీసుకున్నారన్న ఆరోపణలపై దర్యాప్తు అధికారులు విచారణ చేపడుతున్నారు. మరోవైపు, ఫ్లావియో బోల్సెనారో శుక్రవారం ఎక్స్ వేదికగా స్పందించారు. స్వదేశంలో తాను వేధింపులకు గురవుతున్నానని పేర్కొన్నారు. సుప్రీంకోర్టు న్యాయమూర్తి అలెగ్జాండర్ డి మోరెస్ తనపై తప్పుడు ఆరోపణలు చేశారని ఆరోపించారు. తాను బ్రెజిల్‌ను విడిచిపెట్టలేదని, బ్రెజిల్ కోసమే బయలుదేరాను అని పేర్కొన్నారు.

పంజాబ్ ఎన్నికలు..

40 మంది అభ్యర్థులతో ఆప్ జాబితా

న్యూఢిల్లీ :
పంజాబ్ అసెంబ్లీ ఎన్నికల కోసం ఆప్ 40 మంది అభ్యర్థులతో కూడిన జాబితాను శనివారం ప్రకటించింది. ధూరి నియోజకవర్గం నుంచి ప్రస్తుత ముఖ్యమంత్రి భగవంత్ మాన్ మరోసారి పోటీ చేయనున్నారు. ఆప్ రాజకీయ వ్యవహారాల కమిటీ (పీఏసీ) సమావేశం అనంతరం అభ్యర్థుల జాబితాను ప్రకటించినట్లు భగవంత్ మాన్ తెలిపారు. తన పేరుతో సహా మొత్తం 40 మంది అభ్యర్థులను ఖరారు చేసినట్లు వెల్లడించారు.
117 స్థానాలున్న పంజాబ్ అసెంబ్లీకి 2027 ప్రారంభంలో ఎన్నికలు జరగాల్సి ఉంది. ఫిబ్రవరి-మార్చి నెలల్లో పోలింగ్ జరిగే అవకాశం ఉంది. ప్రస్తుత అసెంబ్లీ ఐదేళ్ల పదవీకాలం 2027 మార్చి 16తో ముగియనుంది.

పార్లమెంట్‌లో పొగ బాంబు

- అల్బేనియా పార్లమెంట్ వెల్‌లోకి దూసుకెళ్లిన ప్రతిపక్షం

టిరానా:
అల్బేనియా రాజధాని టిరానాలో ప్రతిపక్ష సభ్యులు గురువారం పార్లమెంటు సమావేశాన్ని అడ్డుకున్నారు. సభలో పొగ బాంబులు ప్రయోగించారు. ప్రభుత్వ వ్యతిరేకంగా విద్యార్థులు చేపట్టిన నిరసనలను ప్రధాని విస్మరిస్తున్నారని ప్రతిపక్షాలు విమర్శించాయి. ప్రధానమంత్రి ఎడి రామా రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తున్న ఆందోళనకారులకు మద్దతుగా డెమొక్రటిక్ పార్టీ ఆఫ్ అల్బేనియా నేత సాలీ బెరీషా, ఇతర ప్రతిపక్ష సభ్యులు సభలోకి దూసుకెళ్లారు. దేశ కేంద్ర బ్యాంకును నియంత్రించే కొత్త చట్టంపై జరగాల్సిన ఓటింగ్‌ను అడ్డుకున్నారు. ''వీళ్లు (అధికార పక్ష సభ్యులు) నేరస్థులు. టియర్ గ్యాస్, రబ్బరు బుల్లెట్లు, పగిలిన తలలు, విరిగిన ఎముకలు వీరికి తగినవి. యువతకు కాదు'' అని బెరీషా అన్నారు. బెరీషా సభలో మాట్లాడుతుండగా, రబ్బరు బుల్లెట్ల వల్ల గాయపడ్డారని చెబుతున్న ఆందోళనకారుల ఫొటోలను పట్టుకుని నినాదాలు చేశారు. దీంతో సభకు అంతరాయం కలిగింది.

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అల్లుడు జేరెడ్ కుష్నర్‌కు ప్రధాని ఎడి రామా ఓ విలాసవంతమైన రిసార్ట్‌ను అప్పగించడాన్ని వ్యతిరేకిస్తూ ఈ ఏడాది మేలో మొదలైన ఆందోళనలు దేశవ్యాప్తంగా విస్తరించాయి. విద్యార్థుల నేతృత్వంలో సాగుతున్న ఈ ఉద్యమం క్రమంగా విస్తరించింది. ప్రభుత్వ అవినీతి, విద్యా ప్రమాణాలు లోపించడం, అధిక ట్యూషన్ ఫీజులకు వ్యతిరేకంగా విద్యార్థులు గళమెత్తారు. అల్బేనియా మునుపెన్నడూ లేని విధంగా అట్టుడికిపోతుంది.

పంచకులాలో దారుణం.బాలికపై మూడో తరగతి విద్యార్థి దాడి

హైదరాబాద్: హర్యానా చండీగఢ్‌లోని పంచకులాలో దారుణం జరిగింది. ఒక పాఠశాలలో తీవ్ర కలవరపరిచే సంఘటన ఒకటి వెలుగులోకి వచ్చింది. మూడో తరగతి చదువుతున్న 8 ఏళ్ల విద్యార్థి, ఎల్ కేజీ చదివే బాలిక(6)పై విచక్షణరహితంగా దాడి చేశాడు. కాళ్లతో తన్ని, ఇటుకలతో దాడి చేసిన దృశ్యాలు సీసీ కెమెరాల్లో నమోదు అయ్యాయి. నిందితుడైన విద్యార్థి ఆ చిన్నారి జుట్టు పట్టుకుని, ఆమె తలను బల్లకు బలంగా బాదాడు. ఆ చిన్నారి తీవ్రంగా గాయపడటంతో, ఆమెను పీజీఐ చండీగఢ్‌కు తరలించారు. బాధితురాలి తల్లిదండ్రుల ఫిర్యాదుతో పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

జైలు నుంచి ఖైదీల పరారీ కలకలం

- జైలు నుంచి ఖైదీల పరారీ కలకలం.
- సీఎం విజయ్ కీలక ఆదేశాలు వెల్లడి

చెన్నై:
తమిళనాడులోని తేని జిల్లా తెక్కంపట్టి సబ్ జైలు నుంచి సినీఫక్కీలో 17మంది ఖైదీలు పారిపోయిన ఘటనపై దర్యాప్తు కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో సీఎం విజయ్ కీలక ఆదేశాలు జారీ చేశారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించినందుకు గానూ జైలు డిప్యూటీ సూపరింటెండెంట్‌ను సస్పెండ్ చేయాలని ఆదేశించారు. అంతేకాదు.. జైళ్ల శాఖలో భారీగా బదిలీలు చేపట్టనున్నట్లు ప్రకటించారు. భద్రతా లోపాలకు కారణమైన ఇతర అధికారులపై కఠిన క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశించారు.
ఈ ఘటన నేపథ్యంలో డీఎంకే అధినేత ఎంకే స్టాలిన్ స్పందిస్తూ టీవీకే ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు క్షీణిస్తున్నాయని మండిపడ్డారు. చెన్నైలోని ప్రముఖ ప్రాంతాలలో జరుగుతున్న హత్యలు, పిల్లలపై లైంగిక హింస, జైలు నుంచి ఖైదీలు పారిపోవడం వంటి ఘటనలే ఇందుకు ఉదాహరణలని దుయ్యబట్టారు. శాంతిభద్రతల పరిస్థితి, పెరుగుతున్న ధరలకు నిరసనగా అక్టోబర్ 31న రాష్ట్రవ్యాప్తంగా తమ పార్టీ మహిళా విభాగం నిరసన చేపట్టనున్నట్లు ప్రకటించారు. విజయ్ హీరోయిజం సినిమాల్లోలాగానే నిజజీవితంలోనూ కనిపిస్తుందనే ఆశతో ప్రజలు ఆయనకు ఓటు వేశారని అన్నారు. కానీ ప్రస్తుత పరిస్థితులు చూసి వారు నిరాశ చెందుతున్నారని విమర్శించారు.
అక్టోబరు 26న రాత్రి జైలు సిబ్బందిపై దాడి చేసి.. 17 మంది ఖైదీలు తప్పించుకున్న సంగతి తెలిసిందే. దీంతో పోలీసులు 20కి పైగా ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి పారిపోయిన వారందరినీ పట్టుకున్నారు. ప్రస్తుతం వారందరినీ రాష్ట్రంలోని అత్యంత భద్రత కలిగిన కేంద్ర కారాగారాలకు తరలించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. ఈ ఘటన నేపథ్యంలో రాష్ట్రంలోని అన్ని జైళ్లలో సెక్యూరిటీని కట్టుదిట్టం చేశారు.

ఒమన్ తీరంలో

భారతీయులున్న నౌకపై దాడి

ఒమన్ తీరంలో దుబాయ్‌కు చెందిన పనామా జెండాతో ఉన్న ఎంటీ లూయిస్ నౌక ఇంజిన్ రూమ్‌లో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. అప్పుడు ఆ నౌకలో 27 మంది భారతీయ సిబ్బంది ఉన్నారు. మంటల్ని అదుపులోకి తేవడంతో ఎలాంటి ప్రాణనష్టం సంభవించలేదు. అయితే ఈ అగ్ని ప్రమాదానికి లింపెట్ మైన్స్ కారణమని తెలుస్తోంది.ఒక చిన్న పడవలో వచ్చిన కొందరు చమురు ట్యాంకర్ ఇంజిన్ రూమ్ దిగువభాగంలో రెండు మైన్స్‌ను అమర్చి.. తర్వాత అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఆ తర్వాత కొద్దిసేపటికి ఇంజిన్ రూమ్‌లో పేలుడు సంభవించింది. ఒమన్ తీరంలో జరిగిన ఈ దాడి ఇరాన్ పనేనని అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. యూఎస్‌ఇరాన్ యుద్ధంలో లింపెట్ మైన్స్‌ను విజయవంతంగా వాడటం ఇదే తొలిసారి అని పేర్కొన్నాయి. అబ్బే యుద్ధానికి పెద్దగా ఖర్చేంకాలే.. వెనెజువెలా నుంచి రాబట్టాంగా: ట్రంప్ వ్యాఖ్యలు
లింపెట్ మైన్స్. నౌకాదళం ఉపయోగించే పేలుడు పదార్థాలు. ఈ మైన్స్‌ను శక్తిమంతమైన అయస్కాంతాల సహాయంతో నేరుగా నౌకలకు అంటిస్తారు. సముద్రతీరంలో బండరాళ్లను గట్టిగా అంటిపెట్టుకొని ఉండే లింపెట్ అనే సముద్రనత్తల పేరిట వీటికి ఆ పేరు వచ్చింది. ఈ మందుపాతరలు కూడా నత్తల వలే చిన్నగా, శంఖు ఆకారంలో ఉంటాయి. ఓడలను పూర్తిగా ముంచేయడం కంటే.. వాటిని ఎటూ కదలనీయకుండా నిలిపివేయడమే మైన్స్ ముఖ్య ఉద్దేశం. ఓడ ఇంజిన్ రూమ్ వెలుపలి భాగం, స్టీరింగ్ గేర్, ప్రొపెల్లర్లు ఉండే నౌక భాగాల వద్ద అమర్చుతారు.

నౌకాదళానికి చెందిన ప్రత్యేక డైవర్లు రహస్యంగా శత్రునౌకల వద్దకు ఈదుకుంటూ వెళ్లి లేదా చిన్న బోట్ల సహాయంతో అక్కడకు చేరుకొని నౌకలకు అమరుస్తారు. రిమోట్ కంట్రోల్ ద్వారా లేదా అమర్చిన వ్యక్తి అక్కడి నుంచి వెళ్లిన తర్వాత నిర్దేశించిన సమయానికి అవి పేలేలా రూపొందించారు. పశ్చిమాసియాలో 2017లో వీటిని తొలిసారి ఉపయోగించారు. తర్వాత నుంచి ట్యాంకర్లను పేల్చేందుకు వాడుతున్నారు. హర్మూజ్ జలసంధి (Strait of Hormuz)లో తక్కువ ఖర్చుతో ఈ సాంకేతికతను ఉపయోగించి వాణిజ్య నౌకలను లక్ష్యంగా చేసుకోవడం ఆందోళన కలిగిస్తోంది.

కొత్త వైమానికదళ చీఫ్‌గా

అశుతోష్ దీక్షిత్

న్యూఢిల్లీ :
భారత వైమానిక దళం (ఐఏఎఫ్) కొత్త చీఫ్‌గా శనివారం ఎయిర్ చీఫ్ మార్షల్ అశుతోష్ దీక్షిత్ బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల పదవీ విరమణ చేసిన ఎయిర్ చీఫ్ మార్షల్ ఎ.పి. సింగ్ స్థానంలో ఆయన నియమితులయ్యారు. గతంలో వైమానిక దళ వైస్ చీఫ్‌గా, చీఫ్స్ ఆఫ్ స్టాఫ్ కమిటీకి అనుసంధానమైన ఇంటిగ్రేటెడ్ డిఫెన్స్ స్టాఫ్‌లో కీలక బాధ్యతలు నిర్వహించారు. సుమారు నాలుగు దశాబ్దాల అనుభవం ఉన్న దీక్షిత్ ఫైటర్, టెస్ట్ పైలట్‌గా వివిధ విమానాల్లో 3,500 గంటలకు పైగా ప్రయాణించారు. ఆపరేషన్ సఫేద్ సాగర్, ఆపరేషన్ రక్షక్, కోప్ ఇండియా, ఆపరేషన్ సిందూర్ వంటి సైనిక కార్యకలాపాలు, విన్యాసాల్లో పాల్గొన్నారు. పలు కీలక కమాండ్, సిబ్బంది బాధ్యతలు నిర్వహించిన ఆయనకు వైమానిక దళ కార్యకలాపాలు, ప్రణాళికలు, ఆధునికీకరణ రంగాల్లో విశేష అనుభవం ఉంది.

'నువ్వు చాలా అసహ్యంగా కనిపిస్తున్నావు'

- **జర్నలిస్ట్‌పై ట్రంప్ బాడీ షేమింగ్**
- **ఆరోగ్యంపై ఆరా తీసినందుకు విలేకరిపై అమెరికా అధ్యక్షుడి గుస్సా**

వాషింగ్టన్ :
అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ గురువారం మీడియాతో మాట్లాడిన సందర్భంగా తీవ్ర ఆగ్రహానికి లోనయ్యారు. అమెరికాలో మిడ్టర్మ్ ఎన్నికల ప్రచార ర్యాలీలను రద్దు చేయడం, ఆయన ఆరోగ్యంపై ప్రశ్నించిన ఒక జర్నలిస్ట్‌పై ట్రంప్ వ్యక్తిగత దూషణకు దిగారు. సదరు విలేకరిని బాడీ షేమింగ్ చేస్తూ "నిన్ను నువ్వు అద్దంలో చూసుకో, కాస్త ఫిట్నెస్ సాధించు" అంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు.
వచ్చే వారంలో అమెరికాలో మిడ్ టర్మ్ ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో ఎన్నికల ప్రచారంలో భాగంగా కాన్సాస్, అయోవా రాష్ట్రాల్లో జరగాల్సిన ప్రచార ర్యాలీలను ట్రంప్ రద్దు చేసుకున్నారు. 'కొన్ని వారాలుగా దేశవ్యాప్తంగా తీరికలేకుండా ప్రచారం నిర్వహిస్తున్న కారణంగా అనారోగ్యానికి గురయ్యారా ? అందుకే ఈ ప్రచార ర్యాలీలను రద్దు చేసుకున్నారా?' అని రిపోర్టర్ ట్రంప్ను ప్రశ్నించారు. ఆ ప్రశ్నతో ట్రంప్ ఒక్కసారిగా అసహనానికి గురయ్యారు.

'అలాంటి ప్రశ్న అడుగుతున్న నీకే జబ్బు చేసింది. నువ్వు ఓ రోగివి' అని సదరు జర్నలిస్ట్‌ను ఉద్దేశించి అన్నారు. 'ఈయనను చూడండి, ఇతని శరీరం అస్సలు ఫిట్గా లేదు. చాలా అసహ్యంగా ఉన్నావు. ముందు నువ్వు ఫిట్నెస్ సాధించు. చూడడానికి చాలా అసహ్యంగా కనిపిస్తున్నావు' అని జర్నలిస్ట్పై ట్రంప్ మండిపడ్డారు. అయితే తాను కేవలం అధ్యక్షుడి క్షేమసమాచారం తెలుసుకోవడానికి మాత్రమే ఆ ప్రశ్న అడిగానని వివరణ ఇచ్చే ప్రయత్నం చేసినప్పటికీ ట్రంప్ పట్టించుకోలేదని తెలిసింది. అలాగే తన ఆరోగ్యంపైనా ట్రంప్ మాట్లాడారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్యంగానే ఉన్నట్లు చెప్పారు. కాన్సాస్కు వెళ్లి ప్రత్యక్షంగా ప్రచారం చేయాల్సిన అవసరం లేదని, అక్కడ రిపబ్లికన్ అభ్యర్థి కచ్చితంగా గెలుస్తారన్న నమ్మకం ఉందని ఆయన చెప్పారు. 'గత రెండు వారాలుగా నన్ను నేను గమనిస్తూనే ఉన్నాను. నా ఆరోగ్యం అద్భుతంగా ఉంది' అని ట్రంప్ స్పష్టం చేశారు.

ట్రంప్‌కు సర్వే షాక్!

అయితే ఈ మధ్యంతర ఎన్నికల వేళ ట్రంప్‌నకు ఎదురుగాలి వీస్తోందని సర్వేలు చెబుతున్నాయి. ట్రంప్ మద్దతుదారులు కూడా ఇప్పుడు ఆయనను వ్యతిరేకిస్తు న్నట్టు పేర్కొన్నాయి. 2024అధ్యక్ష ఎన్నికల్లో ట్రంప్‌నకు ఓటేసిన దక్షిణాసియా అమెరికన్లలో 25 శాతం మంది ఈసారి డెమొక్రాట్లకు వైపు మొగ్గు చూపించనున్నట్లు 'ఇండియన్ అమెరికన్ ఇంపాక్ట్' అనే న్యాయవాద బృందం జరిపిన సర్వేలో వెల్లడైంది. ఇందులో పాల్గొన్న ఓటర్లలో 87శాతం మంది ఇండోఅమెరికన్లుకాగా, మిగితావారు పాకిస్తాన్ , బంగ్లాదేశ్, శ్రీలంకకు చెందినవారు.గత అధ్యక్ష ఎన్నికల్లో కమలా హారిస్‌కు ఓటేసిన వారిలో 96శాతం మంది మళ్లీ డెమొక్రాట్లకే జైకొడుతుండ గా, ట్రంప్ మద్దతుదారుల్లో 67శాతం మంది మాత్రమే రిపబ్లికన్లకు మద్దతు ప్రకటించారు. మిగితా 25శాతం మంది డెమొక్రాట్ల వైపు మొగ్గుచూపారు. జాత్యహంకారం, వివక్ష వంటి కారణాలతోనే డెమొక్రాట్లకు ఓటు వేయనున్నట్లు ఇండో అమెరికన్లు సోషల్ మీడి యాలో బహిరంగంగానే చెబుతున్నారు. కాలి ఫోర్నియా, టెక్సాస్, న్యూజెర్సీ, న్యూయార్క్, పెన్సి ల్వేనియా, జార్జియా, మిచిగాన్, నార్త్ కరోలినా వంటి కీలకమైన 'బ్యాటిల్‌గ్రౌండ్' రాష్ట్రాల్లో కేవలం ఒక ట్రొండు శాతం ఓట్లే అభ్యర్థుల జాతకాలను తారుమారు చేస్తాయి. దీంతో మధ్యంతర ఎన్నికల్లో దక్షిణాసియా అమెరికన్ల ఓట్లు అత్యంత కీలకం కానున్నాయని సర్వే స్పష్టంచేసింది.

ఎన్నికల్లో డెమోక్రాట్లు గెలిస్తే..

- **అమెరికాలో ప్రజాస్వామ్యం అంతమే : మస్క్ సంచలన ప్రకటన**

న్యూయార్క్ :
అమెరికాలో మధ్యంతర ఎన్నికలు సమీపిస్తున్న వేళ వ్యాపారవేత్త ఎలాన్ మస్క్ సంచలన వ్యాఖ్యలు చేశారు. 2028లో జరగబోయే అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో డెమోక్రాట్లు (యూఎస్ ప్రతినిధుల సభ, సెనేట్, అధ్యక్ష పదవి) గెలిస్తే దేశంలో ప్రజాస్వామ్యం అంతమ వుతుందని హెచ్చరించారు. అటువంటి ఎన్నికల ఫలితం అమెరికాలో ప్రధాన రాజకీయ, సంస్థాగత మార్పులకు దారితీయవచ్చని పేర్కొన్నారు. 2028లో జరగబోయే అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో యూఎస్ ప్రతినిధుల సభ, సెనేట్, అధ్యక్ష పదవిని డెమోక్రాట్లు దక్కించుకుంటే వారు ఏం చేస్తారనే దానిపై మస్క్ తన ఆందోళనలను సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్'లో పోస్ట్ చేశారు.

వరంగల్ | ఖమ్మం | నల్లగొండ - ఉమ్మడి జిల్లాల వార్తలు

యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామివారిని దర్శించుకున్న రాష్ట్ర గవర్నర్ శ్రీ శివ ప్రతాప్ శుక్ల

యాదాద్రి భువనగిరి జిల్లా.., అక్టోబర్31 (వుదయం ప్రతినిధి):
యాదగిరిగుట్ట: శ్రీ జనార్ధనానంద సరస్వతి స్వామి సంస్కృతి ట్రస్ట్ ఆధ్వర్యంలో అక్టోబర్ 28వ తేదీ నుండి యాదగిరిగుట్ట దేవస్థానంలో నిర్వహించబడుతున్న తెలంగాణ వేద విద్వన్మహాసభలకు తెలంగాణ రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్ల విచ్చేశారు. ఈ సందర్భంగా కొండపైన అతిథి గృహం వద్ద రాష్ట్ర గవర్నర్ కు రాష్ట్ర మంత్రి శ్రీధర్ బాబు, ప్రభుత్వ విప్ మరియు ఆలేరు శాసనసభ్యులు శ్రీ బీర్ల ఐలయ్య దేవాదాయ శాఖ కమిషనర్ శ్రీ హనుమంతరావు , దేవస్థాన కార్యనిర్వహణాధికారి శ్రీ భవానీ శంకర్, ఐఏఎస్ గారు, జిల్లా కలెక్టర్ శ్రీ అనురాగ్ జయంతి గారు, జిల్లా ఎస్పీ శ్రీ అక్షాంశ్ యాదవ్ , యాదగిరిగుట్ట దేవస్థానం బోర్డు సభ్యులు లక్ష్మీనారాయణ గారు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం గవర్నర్ గారు కుటుంబ సమేతంగా శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ సంప్రదాయం ప్రకారం అర్చకులు, వేద పండితులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. గవర్నర్ గారితో పాటు విచ్చేసిన మంత్రివర్యులు, శాసనసభ్యులు మరియు ఇతర ఉన్నతాధికారులకు దేవస్థాన కార్యనిర్వహణాధికారి శ్రీ భవానీ శంకర్, ఐఏఎస్ గారి ఆధ్వర్యంలో ప్రత్యేక దర్శన ఏర్పాట్లు కల్పించారు.

దర్శనానంతరం అర్చకులు వేదమంత్రాలతో వేదాశీర్వచనం అందజేశారు. ఈ సందర్భంగా కార్యనిర్వహణాధికారి గారు శ్రీ స్వామివారి జ్ఞాపిక (మొమెంటో), ప్రసాదాలను గవర్నర్ గారికి అందజేశారు. అనంతరం దేవస్థానం రూపొందించిన 2027 నూతన వార్షిక క్యాలెండర్‌ను గవర్నర్ శ్రీ శివ ప్రతాప్ శుక్ల గారు ఆవిష్కరించారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు జాబితాలో పేర్లు నమోదు చేసుకోవాలి

జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్

నవంబర్ 30న తుది ఎస్ఐఆర్ ఓటరు జాబితా ప్రచురణ
ఖమ్మం జిల్లాలో 1,75,275 మంది ఓటర్ల విచారణ పూర్తి
పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు ఇప్పటి వరకు 73,898 దరఖాస్తుల స్వీకరణ
సర్ 2026 , పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓటర్ నమోదుపై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించిన జిల్లా కలెక్టర్

ఖమ్మం వుదయం బ్యూరో , అక్టోబర్ -31
పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు జాబితాలో పేర్లు నమోదు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ సూచించారు. శనివారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో జిల్లా కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్బంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ ఎస్ఐఆర్ 2026 షెడ్యూల్‌ను భారత ఎన్నికల సంఘం సవరించిందని కలెక్టర్ తెలిపారు. సవరించిన షెడ్యూల్ ప్రకారం నోటీసుల పరిష్కారం, విచారణలు, అభ్యంతరాల పరిశీలన ప్రక్రియను నవంబర్ 26వ తేదీలోగా పూర్తి చేయాలని, నవంబర్ 30వ తేదీన తుది ఎస్ఐఆర్ ఓటరు జాబితాను ప్రచురించనున్నట్లు తెలిపారు. ఖమ్మం జిల్లాలో ఇప్పటి వరకు మొత్తం 1,75,841 నోటీసులు జారీ చేయగా, వాటిలో 1,75,629 నోటీసులను ఓటర్లకు అందజేశామని కలెక్టర్ వివరించారు. మొత్తం 1,75,275 మంది ఓటర్ల విచారణ పూర్తయిందని, వీరిలో 1,74,838 మందిని తుది జాబితాలో అర్హులైన ఓటర్లుగా చేర్చేందుకు క్లియరెన్స్ ఇచ్చినట్లు తెలిపారు. వరంగల్, నల్గొండ, ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గాల ఓటరు జాబితాలో పేర్లు నమోదు చేసుకునేందుకు అర్హులైన పట్టభద్రులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. గత 2024 ఎన్నికల సమయంలో ఖమ్మం జిల్లా నుంచి మొత్తం 83,879 మంది పట్టభద్రులు ఓటర్లుగా నమోదయ్యారని, ప్రస్తుత నమోదు ప్రక్రియలో ఇప్పటివరకు 73,898 దరఖాస్తులు అందాయని కలెక్టర్ తెలిపారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు జాబితా ముసాయిదాను నవంబర్ 25, 2026న ప్రచురించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ముసాయిదా జాబితాపై డిసెంబర్ 10, 2026 వరకు క్లెయిమ్‌లు, అభ్యంతరాలు సమర్పించవచ్చని పేర్కొన్నారు. డిసెంబర్ 25, 2026లోగా వాటిని పరిష్కరించి, డిసెంబర్ 30, 2026న తుది పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు జాబితాను ప్రచురించనున్నట్లు వివరించారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా. పీ. శ్రీజ, ఖమ్మం నగర పాలక సంస్థ కమిషనర్ అభిషేక్ అగస్త్య, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, ఖమ్మం ఆర్డీవో ఎన్. శ్రీనివాస్, కలెక్టరేట్ ఎన్నికల విభాగం పర్యవేక్షకులు రాజు, డిటి అన్సారీ, ఆమ్ ఆద్మీ పార్టీ ప్రతినిధి స్వర్ణ సుబ్బారావు, బిఆర్ఎస్ పార్టీ ప్రతినిధి బెల్లం వేణుగోపాల్, బీజేపీ పార్టీ ప్రతినిధి వి. రాజేష్, బిఆర్ఎస్వి ప్రతినిధి ఎల్. సురేష్ బాబు, టిడిపి పార్టీ ప్రతినిధి పాలడుగు టీఆర్ కృష్ణప్రసాద్, బీఎస్పీ పార్టీ ప్రతినిధి వేల్పుల రాజయ్య,

ఐఎన్ సి పార్టీ ప్రతినిధి అన్నెం గోపాల్ రావు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

పట్టణ క్లాక్‌టవర్ సుందరీకరణకు రూ.197.44 కోట్లు

ప్రపంచ బ్యాంకు, రాష్ట్ర ప్రభుత్వ నిధులతో ఆధునిక హంగులు
నమూనా ఆవిష్కరించిన మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాసరెడ్డి

నల్లగొండ జిల్లా అక్టోబర్ 31 (వుదయం ప్రతినిధి) :
నల్లగొండ నగర అభివృద్ధిలో భాగంగా చారిత్రక క్లాక్‌టవర్ కేంద్రాన్ని ఆధునిక హంగులతో సుందరీకరించేందుకు ప్రభుత్వం రూ.197.44 కోట్ల నిధులు మంజూరు చేసింది. ఇందులో ప్రపంచ బ్యాంకు రూ.138.21 కోట్లు, రాష్ట్ర ప్రభుత్వం రూ.59.23 కోట్లు కేటాయించాయి. ఈ నిధులతో క్లాక్‌టవర్ కేంద్రంలోని పాత ఆర్‌అండ్‌బీ కార్యాలయ స్థలంలో వాణిజ్య సముదాయం, మల్టీప్లెక్స్ నిర్మించడంతోపాటు పరిసరాలను అభివృద్ధి చేయనున్నారు. శనివారం నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో సుందరీకరణ నమూనా నమూనాను మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాసరెడ్డి, డిప్యూటీ మేయర్ మహమ్మద్ అష్రఫ్ అలీ అమేర్, కార్పొరేటర్లతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ క్లాక్‌టవర్ అభివృద్ధి నగరానికి ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుందని తెలిపారు. షాపింగ్ కాంప్లెక్స్ ఏర్పాటుతో స్థానిక వ్యాపారులకు ప్రోత్సాహం లభించడంతో పాటు ప్రజలకు మెరుగైన వాణిజ్య సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయన్నారు. మల్టీప్లెక్స్ ఏర్పాటుతో వినోద సౌకర్యాలు కూడా మెరుగుపడతాయని పేర్కొన్నారు. మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి సహకారంతో ఇప్పటికే నగరంలో కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. పానగల్ ఛాయా సోమేశ్వరాలయ అభివృద్ధికి రూ.20 కోట్లు, సాగర్ రోడ్డులో వైఎస్సార్ విగ్రహం నుంచి చర్లగౌరారం రోడ్డు వరకు ఆరు వరుసల రహదారి విస్తరణకు రూ.20 కోట్లు మంజూరైనట్లు వెల్లడించారు. అలాగే రూ.100 కోట్లతో సయ్యద్ లతీఫుల్లా ఖాద్రి గుట్ట, బ్రహ్మంగారి గుట్టలకు ఘాట్ రోడ్లు నిర్మించనున్నట్లు తెలిపారు. నగర అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యమిస్తూ నిధులు మంజూరు చేసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డికి మేయర్ నగర ప్రజలు, మున్సిపల్ పాలకవర్గం తరఫున కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వంశీకృష్ణ, కార్పొరేటర్లు కేసాని వేణుగోపాల్‌రెడ్డి, గుమ్ముల జానకీమోహన్‌రెడ్డి, ఇబ్రహీం, ఆలకుంట్ల నాగరాజు, అబ్బగోని కవితా రమేష్‌గౌడ్, బొజ్జ శంకర్, ఏదుళ్ల శ్రీధర్‌రెడ్డి, ఇటికాల మంగమ్మ శ్రీనివాస్, పెరిక స్వాతి, ఆలకుంట్ల ఝాన్సీ, అల్లి సుభాష్‌యాదవ్, రేగట్టె అండాలు, పున్న జ్ఞానేశ్వరి, పాలకూరి సుమలత, గోగుల గణేష్, వజ్జ సంతోషిని, గుండెబోయిన పుష్పలత తదితరులు పాల్గొన్నారు.

దేశ ఐక్యత, సమగ్రత, భద్రత పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద.

వరంగల్ జిల్లా వుదయం ప్రతినిధి అక్టోబర్ 31.
దేశ ఐక్యత, సమగ్రత, భద్రతను పరిరక్షించేందుకు ప్రతి ఒక్కరూ అంకితభావంతో కృషి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద పిలుపునిచ్చారు. ఉక్కుమనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ ఆశయాలు, స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకుని దేశ సమైక్యతకు ప్రతి ఒక్కరూ కట్టుబడి ఉండాలని ఆమె సూచించారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి, జాతీయ ఐక్యత దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం వరంగల్ జిల్లా కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పటేల్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ దేశంలోని సంస్థానాలను ఏకం చేసి భారతదేశ సమైక్యతకు పటిష్ట పునాది వేసిన సర్దార్ వల్లభాయ్ పటేల్ సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. ఆయన చూపిన ఐక్యతా మార్గంలో పయనిస్తూ దేశ సమగ్రత, భద్రత పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని పేర్కొన్నారు. అనంతరం జాతీయ ఐక్యత దినోత్సవం (రాష్ట్రీయ ఏక్తా దివస్) సందర్భంగా దేశ ఐక్యత, సమగ్రత, భద్రతను కాపాడేందుకు కృషి చేస్తామని అధికారులు, సిబ్బందితో కలిసి ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు ఎల్. కిషోర్ కుమార్ (రెవెన్యూ), వై.వి. గణేష్ (లోకల్ బాడీస్), కలెక్టరేట్ ఏఓ శ్రవణ్ కుమార్, వివిధ సెక్షన్ల సూపరింటెండెంట్లు, సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలకు ఆహ్లాదం.. తిప్పరోని కుంట బండ్‌గా అభివృద్ధి

–జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ ఆదేశం

హనుమకొండ, అక్టోబర్ 31 (వుదయం జిల్లా ప్రతినిధి) :
ఖిలా వరంగల్ మండలం తిమ్మాపూర్ లోని తిప్పరోని కుంట చెరువు కట్టపై చేపట్టనున్న బండ్ అభివృద్ధి పనులను త్వరితగతిన ప్రారంభించి, వేగవంతంగా పూర్తి చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రత్యేక అధికారి చాహత్ బాజ్‌పాయ్ అధికారులను ఆదేశించారు. శనివారం మున్సిపల్, సాగునీటి పారుదల, సర్వే శాఖల అధికారులతో కలిసి కలెక్టర్ తిప్పరోని కుంటను ప్రత్యక్షంగా పరిశీలించారు. కుంట కట్ట ప్రారంభం నుండి చివరి వరకు పరిశీలించి, కట్ట విస్తీర్ణం మరియు ప్రతిపాదిత అభివృద్ధి పనులపై సంబంధిత అధికారుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. తిప్పరోని కుంట కట్టపై ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేలా ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు.

ప్రధాన ఆదేశాలు:
కుంట బండ్‌పై రకరకాల మొక్కలతో ప్లాంటేషన్ చేపట్టి, పచ్చదనాన్ని పెంపొందించాలి. బండ్‌పై మెరుగైన విద్యుత్ దీపాలు ఏర్పాటు చేసి, సుందరీకరణ పనులను వేగవంతం చేయాలి. స్థానిక ప్రజలు వాకింగ్ చేసుకోవడానికి వీలుగా, పనులను నాణ్యతా ప్రమాణాలతో త్వరగా అందుబాటులోకి తీసుకురావాలి. ఈ తనిఖీ కార్యక్రమంలో గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ఎస్ఈ రాజ్ కుమార్, ఈఈ సంజయ్, సాగునీటి పారుదల శాఖ ఈఈ కిరణ్ కుమార్, డీఈ మధుసూదన్ రెడ్డి, సర్వేయర్ సందీప్ అధికారులు పాల్గొన్నారు.

పాఠశాల దశ నుంచే చట్టాల పై అవగాహనా అవసరం

జయశంకర్ భూపాలపల్లి, అక్టోబర్ 31(వుదయం ప్రతినిధి):
జాతీయ, తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవల అథారిటీచే ప్రారంభించబడిన సురక్షిత్ బచ్‌పన్ అభియాన్, పిల్లలను రక్షించడానికి ఉద్దేశించిన దేశవ్యాప్త ప్రచారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం అవగాహనా కార్యక్రమాలు జరిగాయి. కాటారం లోని ప్రభుత్వ పాఠశాలలో సమావేశం నిర్వహించారు. అతిదిగ పాల్గొన్న సీనియర్ సివిల్ జడ్జి, న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి తాడూరు మహతి వైష్ణవి మాట్లాడుతూ దేశ బంగారు భవిష్యత్తు నేటి బాలల పరిరక్షణతో సాధ్యమన్నారు. పోక్సో నేరాల నివారణ, సైబర్ మోసాల నుండి పిల్లల్ని కాపాడుకోవడం మన ప్రథమ కర్తవ్యం అని తెలిపారు. విద్యార్థులు పాఠశాల స్థాయినుండి అవగాహనా కలిగి ఉండాలని సూచించారు. మొబైల్ ను జాగ్రత్తగా వాడటం అలవాటు చేసుకోవాలి అని పేర్కొన్నారు. కాటారం లోని కె.జి.బి.వి. పాఠశాలలో జరిగిన మరో కార్యక్రమంలో అతిధిగా పాల్గొన్న అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి జి .అఖిల మాట్లాడుతూ ప్రతి బిడ్డ బాల్యం మనందరి బాధ్యత అని అన్నారు. చాలా మంది పిల్లలకు తమ హక్కులు తెలియవు, సహాయం ఎలా పొందాలో తెలియదు. దీన్ని మార్చడమే ఈ ప్రచారం లక్ష్యం అని పేర్కొన్నారు. గణపురం మండల కేంద్రంలోని ప్రభుత్వ మోడల్ స్కూల్ లో జరిగిన మరో కార్యక్రమంలో అతిధిగా పాల్గొన్న ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి ఎస్.ఆర్. దిలీప్ కుమార్ నాయక్ మాట్లాడుతూ విద్యార్థులు జీవితంలో క్రమశిక్షణతో చదువుకొని ఉన్నత లక్షలను అధిరోహించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డి.ఎస్.పి. సూర్యనారాయణ, జిల్లా సంక్షేమ అధికారి మల్లేశ్వరి. ప్రొటెక్షన్ ఆఫీసర్ వెంకటస్వామి, విద్యార్థులు,

ఉపాధ్యాయులు, సూపరింటెండెంట్ రఘురాం, న్యాయసేవాధికార సంస్థ సిబ్బంది అంబాల దేవేందర్, గోపాల్, రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ సమైక్యతకు బలమైన పునాదులు వేసిన ఉక్కుమనిషి పటేల్

రాష్ట్ర ఐక్యతా దినోత్సవం సందర్భంగా సర్దార్ వల్లభాయ్ పటేల్‌కు ఘన నివాళులు
అధికారులు, సిబ్బందితో జాతీయ ఐక్యత ప్రతిజ్ఞ చేయించిన కలెక్టర్ అంకిత్

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అక్టోబర్ 31(వుదయం ప్రతినిధి):
స్వాతంత్ర్యానంతరం దేశ సమైక్యతకు ఎదురైన సవాళ్లను ధైర్యంగా ఎదుర్కొని, సంస్థానాల విలీనంతో భారతదేశ ఐక్యతకు బలమైన పునాదులు వేసిన మహనీయుడు సర్దార్ వల్లభాయ్ పటేల్ అని జిల్లా కలెక్టర్ అంకిత్ కొనియాడారు. ఆయన జయంతిని పురస్కరించుకుని శనివారం ఐడీఓసీ కార్యాలయంలో రాష్ట్ర ఐక్యతా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అంకిత్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందన, జిల్లా రెవెన్యూ అధికారి పద్మావతితో కలిసి సర్దార్ వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం అధికారులు, సిబ్బందితో జాతీయ ఐక్యత ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజలంతా కుల, మత, ప్రాంతీయ భేదాలకు అతీతంగా జాతీయ ఐక్యతా భావంతో మెలగాలని సూచించారు. దేశ స్వాతంత్ర్యం కోసం భగత్‌సింగ్, మహాత్మా గాంధీ, సర్దార్ వల్లభాయ్ పటేల్ వంటి మహనీయులు ఎన్నో ఉద్యమాలు, పోరాటాలు చేసి అపార త్యాగాలు చేశారని గుర్తుచేశారు. ఆ క్లిష్ట పరిస్థితుల్లో భారత తొలి ఉప ప్రధానిగా, కేంద్ర హోంశాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వర్తించిన సర్దార్ వల్లభాయ్ పటేల్ తన రాజకీయ చతురత, దృఢ సంకల్పం, కార్యదక్షతతో సంస్థానాల విలీన ప్రక్రియను విజయవంతం చేశారని తెలిపారు. ఆయన దూరదృష్టి, అంకితభావం దేశ సమైక్యతకు బలమైన పునాదులు వేశాయని కొనియాడారు. పటేల్ చూపిన ఐక్యతా మార్గంలో దేశం పురోగమిస్తూ ప్రపంచంలో ఐదవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదిగిందని కలెక్టర్ పేర్కొన్నారు. దేశ స్వాతంత్ర్యం, సమగ్రత కోసం జాతీయ నాయకులు చేసిన పోరాటాలు, త్యాగాలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని, వారి ఆశయాలకు అనుగుణంగా దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. జాతీయ ఐక్యత, సమగ్రత, సోదరభావం ప్రతి ఒక్కరిలో వెల్లివిరియాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సీపీఓ సునీత, వ్యవసాయ శాఖ అధికారి బాబురావు, డీపీఓ అనూష, బీసీ సంక్షేమ అధికారి విజయలక్ష్మి, ఓఎస్డీ వెంకటరమణతో పాటు వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సిపిఐ నేత మేకల రవికి కన్నీటి వీడ్కోలు

కూనంనేని, తక్కళ్లపల్లి, ఈటి నర్సింహ, ఎమ్మెల్యే నాయిని నివాళులు
*** మేకల రవి మృతి సిపిఐకి తీరని లోటు : కూనంనేని సాంబశివరావు**

వరంగల్, అక్టోబర్ 31 (వుదయం ప్రతినిధి) :
సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు మేకల రవికి శనివారం వరంగల్ నగరంలో కన్నీటి వీడ్కోలు పలికారు. శుక్రవారం మేకల రవి అనారోగ్యంతో వరంగల్ ఎంజీఎం ఆసుపత్రిలో మృతి చెందగా శనివారం వరంగల్ లో అశ్రునయనాల మధ్య అంత్యక్రియలు నిర్వహించారు. వరంగల్ నగరంలోని శివ నగర్ లో గల మేకల రవి స్వగృహం వద్ద ఆయన భౌతిక కాయాన్ని ఉంచగా వందలాది మంది ప్రజలు, సిపిఐ కార్యకర్తలు తరలి వచ్చి నివాళులు అర్పించారు. మేకల రవి మృతి వార్త తెలుసుకున్న సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, రాష్ట్ర సహాయ కార్యదర్శులు తక్కళ్లపల్లి శ్రీనివాసరావు, ఈటి నర్సింహ, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి తదితరులు వరంగల్ శివ నగర్ కు చేరుకుని రవి భౌతిక కాయానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. రవి భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులు అర్పించిన వారిలో సిపిఐ వరంగల్, హనుమకొండ, మహబూబాబాద్, జనగామ, భూపాలపల్లి, సిద్దిపేట జిల్లాల కార్యదర్శులు ఎస్ కే బాష్ మియా, కర్రె బిక్షపతి, బి. విజయ సారథి, సిహెచ్ రాజారెడ్డి, కొరిమి రాజ్ కుమార్, మంద పవన్, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి, సీనియర్ నాయకులు టి. వెంకట్రాములు, తమ్మెర విశ్వేశ్వరరావు, మోతె లింగారెడ్డి, రాష్ట్ర సమితి సభ్యులు సిరబోయిన కరుణాకర్, ఆదరి శ్రీనివాస్, మండ సదాలక్ష్మి, సయ్యద్ వలీ ఉల్లా ఖాద్రి, డిహెచ్ పిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్ కుమార్, జిల్లా పార్టీ సహాయ కార్యదర్శులు తోట బిక్షపతి, పనాస ప్రసాద్, దండు లక్ష్మణ్, వివిధ జిల్లాల కార్యవర్గ సభ్యులు, ప్రజాసంఘాల నాయకులు ఉన్నారు.

మేకల రవి మృతి సిపిఐకి తీరని లోటు : కూనంనేని సాంబశివరావు
సిపిఐ నేత మేకల రవి అకాల మృతి ప్రజా రంగానికి పార్టీకి తీరని లోటు అని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. మేకల రవి భౌతిక కాయం వద్ద నివాళులు అర్పించిన అనంతరం కూనంనేని మాట్లాడుతూ మేకల రవి జీవితాంతం పేదల సంక్షేమం, కార్మికుల హక్కులు, ప్రజా సమస్యల పరిష్కారం కోసమే శ్రమించారని అన్నారు. ఎలాంటి ప్రతిఫలం ఆశించకుండా నిరంతరం ప్రజల్లో ఉంటూ పోరాటాలు నడిపిన నిజాయితీ గల నాయకుడు మేకల రవి అని తెలిపారు. ఆయన ఆశయాలు, చూపిన బాట ఎప్పటికీ ఆదర్శనీయమైనవని, వారి కుటుంబ సభ్యులకు తన సానుభూతిని తెలియజేస్తున్నానని, వారి కుటుంబానికి సీపీఐ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు.

* నివాళులు అర్పించిన వివిధ పార్టీల నాయకులు
శివ నగర్ లోని మేకల రవి స్వగృహం వద్ద ఆయన భౌతిక కాయాన్ని వివిధ పార్టీల నాయకులు, ప్రజాసంఘాల నాయకులు సందర్శించి నివాళులు అర్పించారు. సిపిఎం నాయకులు ఎస్. వాసుదేవ రెడ్డి, జి. ప్రభాకర్ రెడ్డి, సిహెచ్ రంగయ్య, రత్నమాల, ఎంసిపిఐ(యు) నాయకులు ఎన్ రెడ్డి హంసారెడ్డి, పెద్దారపు రమేష్, గద్దం నాగార్జున, బీఆర్ఎస్ నాయకులు జన్ను జకార్య, డిబిఎఫ్ కార్యదర్శి చుంచు రాజేందర్ తదితరులు నివాళులు అర్పించిన వారిలో ఉన్నారు.

కరువును ఎదిరించేలా 'ఎల్ నీనో' పాట ఆవిష్కరణ!

- వరంగల్ జిల్లా కలెక్టర్ సత్య శారద చేతుల మీదుగా సీడీ విడుదల
- అభినందించిన జాయింట్ కలెక్టర్, అడిషనల్ కలెక్టర్, డీపీఆర్వో ప్రేమలత
- - రచయిత గౌరారపు డప్ప యుగేందర్, గాయకుడు జూపాక శివలకు ప్రశంసలు

పర్వతగిరి , అక్టోబర్ 31 (వుదయం ప్రతినిధి):
ప్రకృతి వైపరీత్యాలు, కరువు పరిస్థితులపై అవగాహన కల్పించేలా రూపొందించిన విప్లవాత్మక గీతం అందరి ప్రశంసలు అందుకుంటోంది. వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం చౌటపల్లి గ్రామానికి చెందిన ప్రతిభావంతుడైన డప్పు కళాకారుడు గౌరారపు డప్పు యుగేందర్ రచించిన 'ఎల్ నీనో కరువు' పాటల సీడీని వరంగల్ జిల్లా కలెక్టర్ సత్య శారద ఐఏఎస్ ఘనంగా ఆవిష్కరించారు. కలెక్టరేట్ కార్యాలయంలో జరిగిన ఈ ఆవిష్కరణ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ తో పాటు జాయింట్ కలెక్టర్, అడిషనల్ కలెక్టర్, జిల్లా పౌర సంబంధాల అధికారి ప్రేమలత మేడమ్ మరియు పలువురు జిల్లా ఉన్నత అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాట రచయిత గౌరారపు డప్పు యుగేందర్, అద్భుతమైన గానం అందించిన గాయకుడు జూపాక శివలను జిల్లా అధికారులు ప్రత్యేకంగా అభినందించారు. సమాజంలో చైతన్యం తెచ్చేలా కళాకారులు ఇలాంటి సామాజిక అంశాలపై పాటలు రాయడం అభినందనీయమని కొనియాడారు.

ఈ కార్యక్రమంలో తెలంగాణ సాంస్కృతిక సారధి వరంగల్ జిల్లా కళాకారులు కూడా పెద్ద సంఖ్యలో పాల్గొని, కళాకారులకు సంఘీభావం తెలిపారు.

ప్రజల వద్దకే 'కమ్యూనిటీ కనెక్ట్' నేరాల నివారణపై అవగాహన: సీపీ ఎన్. శ్వేత

వరంగల్ క్రైం, అక్టోబర్ 31 (వుదయం ప్రతినిధి) :
ప్రజల భద్రతే ధ్యేయంగా వరంగల్ పోలీస్ కమిషనరేట్ వినూత్నంగా 'కమ్యూనిటీ కనెక్ట్' కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. నేరాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలపై ఇంటింటికీ వెళ్లి ప్రజలకు అవగాహన కల్పించడమే ఈ ప్రోగ్రామ్ ముఖ్య ఉద్దేశమని వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత, ఐపీఎస్ తెలిపారు. సైబర్ నేరాలు, సోషల్ మీడియా మోసాలు, మహిళలుచిన్నారుల భద్రత, ఆస్తి సంబంధిత నేరాలు, దృష్టి మరల్చే దొంగతనాలు మరియు గంజాయిమత్తు పదార్థాల వల్ల కలిగే దుష్ప్రభావాలపై ప్రజలను అప్రమత్తం చేయనున్నట్లు సీపీ వివరించారు. ఇంటింటికీ సమాచారం: మహిళలు, చిన్నారులు, వృద్ధుల వద్దకే వెళ్లి పోలీస్ సిబ్బంది నేర నివారణపై సూచనలు చేస్తారు. గుర్తుతెలియని వ్యక్తులకు OTPలు, బ్యాంకింగ్ వివరాలు పంచుకోవద్దని, డిజిటల్ అరెస్ట్ పేరుతో జరిగే ఆన్‌లైన్ మోసాల పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచన. నేరాల నియంత్రణ, ఆధారాల సేకరణలో కీలకమైన CCTV కెమెరాలను ఇళ్లు, వ్యాపార సంస్థలు మరియు కాలనీల్లో ఏర్పాటు చేసుకోవాలని పిలుపు. మత్తు పదార్థాలపై ఉక్కుపాదం వల్ల యువత గంజాయి, ఇతర మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి. ఈ కార్యక్రమాన్ని మొదట వరంగల్ నగర పరిధిలోని 9 పోలీస్ స్టేషన్లలో ప్రారంభించి,

ఆ తర్వాత కమిషనరేట్ పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్లకు విస్తరించనున్నట్లు తెలిపారు. ప్రజల భాగస్వామ్యం, అప్రమత్తతతోనే నేరరహిత సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని సీపీ శ్వేత పేర్కొన్నారు.

ఆర్‌ఓఎఫ్ఆర్ అమలుపై కలెక్టర్ సమీక్ష

దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలి. జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద.

వరంగల్ జిల్లా వుదయం ప్రతినిధి అక్టోబర్ 31.
జిల్లాలో అటవీ హక్కుల గుర్తింపు చట్టం (ఆర్ఓఎఫ్ఆర్) అమలుకు సంబంధించి చేపడుతున్న చర్యలపై జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద సమీక్ష నిర్వహించారు. శనివారం జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన ఆర్ఓఎఫ్ఆర్ జిల్లా స్థాయి కమిటీ సమావేశంలో జిల్లా అటవీ అధికారి (డీఎఫ్ఓ) నిఖిల, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి లెనిన్ వాత్సల్ టోప్పో, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎల్. కిషోర్ కుమార్ తదితర అధికారులతో కలిసి కలెక్టర్ వివిధ అంశాలను సమీక్షించారు. ఈ సందర్భంగా రైతులు బోర్‌వెల్ డ్రిల్లింగ్ అనుమతుల కోసం సమర్పించిన దరఖాస్తులను కలెక్టర్ పరిశీలించారు. ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి, నిబంధనలకు అనుగుణంగా తదుపరి చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

ఈ సమావేశంలో నర్సంపేట ఆర్డీవో ఉమారాణి, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి నారాయణరెడ్డి, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

కరీంనగర్ |అదిలాబాద్ | నిజామాబాద్ - ఉమ్మడి జిల్లాల వార్తలు

సంక్షేమ గురుకుల పాఠశాలల్లో ఖాళీ పోస్టులకు దరఖాస్తుల స్వీకరణ: కలెక్టర్

జగిత్యాల అక్టోబర్ 31 (వుదయం ప్రతినిధి)

జగిత్యాల జిల్లాలోని మహాత్మా జ్యోతిబా పూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల విద్యాసంస్థల సొసైటీ (ఎ ంజెపిటిబిసిడ బ్ల్యూఆ ర్ఈ ఐ ఎ స్) పరిధిలో ఖాళీగా ఉన్న నాలుగు పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇట్టి నియామకాల్లో భాగంగా అతిథి పేట్ (పురుషులకు ప్రాధాన్యత) పోస్టుకు బిపిఈడి అర్హత కలిగిన అభ్యర్థులు అర్హులు ఎంపికైన వారు బీర్పూర్ మెట్‌పల్లిలోని బాలుర గురుకుల పాఠశాలలో విధులు నిర్వహించాల్సి ఉంటుంది. నెలకు 20 వేల రూపాయల వేతనం చెల్లిస్తారు. అతిథి ఆరోగ్య పర్యవేక్షకులు (గెస్ట్ హెల్త్ సూపర్వైజర్ పురుషులకు ప్రాధాన్యత) పోస్టుకు బి ఎస్ సి నర్సింగ్ అర్హత కలిగిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఎంపికైన వారు జగిత్యాల జిల్లాలోని ఎంజేపిటిబిసిడబ్ల్యూఆర్ విలీన బాలుర జూనియర్ కళాశాలలో విధులు నిర్వహించాల్సి ఉంటుంది. నెలకు 20 వేల రూపాయల వేతనం చెల్లిస్తారు. అతిథి జూనియర్ లెక్చరర్ (భౌతిక శాస్త్రం – మహిళలకు మాత్రమే) పోస్టుకు ఎం ఎస్ సి ఫిజిక్స్ బిఈడి అర్హత కలిగిన మహిళా అభ్యర్థులు అర్హులు రాజారంలోని ఎంజేపిటిబిసిడబ్ల్యూఆర్ విలీన బాలికల జూనియర్ కళాశాలలో విధులు నిర్వహించాల్సి ఉంటుంది. నెలకు 27 వేల రూపాయల వేతనం చెల్లిస్తారు. అతిథి టీజీటీ (గణితం – మహిళలకు మాత్రమే) పోస్టుకు ఎం ఎస్ సి మాథ మాటిక్స్ బి ఈడి తో పాటు టెట్ అర్హత కలిగిన మహిళా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. పెగడపల్లి (గొల్లపల్లి) లోని బాలికల గురుకుల పాఠశాలలో విధులు నిర్వహించాల్సి ఉంటుంది. నెలకు 24 వేల రూపాయల వేతనం చెల్లిస్తారు. ఇట్టి పోస్టులకు సంబంధించిన నియామక కాలపరిమితి ఆరు నెలలు మాత్రమే ఉంటుందని కలెక్టర్ స్పష్టం చేశారు. అర్హత ఆసక్తి కలిగిన అభ్యర్థులు తమ బయోడేటా (రెస్యూమ్) సంబంధిత విద్యార్హత ధ్రువ పత్రాల జిరాక్స్ ప్రతులతో నవంబర్ 1 నుంచి నవంబర్ 3వ తేదీ సాయంత్రం 4 గంటలలోపు ఎంజేపిటిబిసిడబ్ల్యూఆర్ విలీన బాలుర జూనియర్ కళాశాల జగిత్యాల జిల్లాలో దరఖాస్తులు సమర్పించాలని సూచించారు. అభ్యర్థులకు సంబంధించిన బోధనా ప్రదర్శనలు (డిమాంస్ట్రేషన్స్) నవంబర్ 4వ తేదీన ఉదయం 10 గంటల నుంచి అదే కళాశాలలో నిర్వహించనున్నట్లు తెలిపారు మరిన్ని వివరాలకు జిల్లా కోఆర్డినేటర్ చెరుకు సుస్మితను 9154102664 నంబర్‌లో లేదా [mjpdmp456@gmail.com](mail:mjpdmp456@gmail.com) ఈ-మెయిల్ ద్వారా సంప్రదించాలని జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్ సూచించారు.

రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలి..జిల్లా ఎస్పీ నితికా పంత్

ఆసిఫాబాద్ (వుదయం ప్రతినిధి)

రక్తదానం ఒక గొప్ప మానవతా సేవ అని, మనం చేసే ఒక్క యూనిట్ రక్తదానం మరొకరి ప్రాణాలను కాపాడే అవకాశం కల్పిస్తుందని జిల్లా ఎస్పీ నితికా పంత్, అన్నారు. ఈరోజు కుమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ నితికా పంత్, ఐపీఎస్ పాల్గొని రక్తదానం చేస్తున్న యువత, పోలీస్ సిబ్బందిని అభినందించారు. యువతతో పాటు జిల్లా పోలీస్ సిబ్బంది స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేశారు.ఈ రక్తదాన శిబిరంలో జిల్లా పోలీసు అధికారులు, సిబ్బంది, యువత, విద్యార్థులు,స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, మీడియా మిత్రులు ఉత్సాహంగా పాల్గొని స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. మొత్తం 400 మంది రక్తదానం చేయగా, 400యూనిట్ల రక్తాన్ని సేకరించి ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ఆసిఫాబాద్ , రిమ్స్ ఆదిలాబాద్ ఆసుపత్రులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదాలు, అత్యవసర వైద్య చికిత్సలు, ప్రసవ సమయంలో, ఇతర అనారోగ్య పరిస్థితుల్లో రక్తం అవసరమైన వారికి సకాలంలో రక్తం అందించడం ఎంతో కీలకమని తెలిపారు. రక్తానికి ప్రత్యామ్నాయం లేదని, ఆరోగ్యవంతులైన ప్రతి ఒక్కరూ నిర్దిష్ట వ్యవధిలో స్వచ్ఛందంగా రక్తదానం చేయడం ద్వారా సమాజానికి విలువైన సేవ అందించవచ్చని పేర్కొన్నారు. పోలీస్ శాఖ కేవలం శాంతిభద్రతల పరిరక్షణకే పరిమితం కాకుండా, సామాజిక బాధ్యతలో భాగంగా ప్రజలకు ఉపయోగపడే సేవా కార్యక్రమాల్లోనూ ముందుంటుందని తెలిపారు. రక్తదానం పట్ల యువతలో మరింత అవగాహన పెంపొందించాలని, ఆపదలో ఉన్నవారికి సహాయం చేయాలనే మానవతా దృక్పథాన్ని ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ స్వచ్ఛంద రక్తదానంలో భాగస్వాములై ప్రాణదాతలుగా నిలిచిన అందరినీ జిల్లా ఎస్పీ నితికా పంత్ ఐపీఎస్ అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పోలీస్ అధికారులు, పోలీస్ సిబ్బంది, యువత తదితరులు పాల్గొన్నారు.

గోదావరి పుష్కరాల ఏర్పాట్ల పనులను వేగవంతం చేయాలి ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్

జగిత్యాల అక్టోబర్ 31 (వుదయం ప్రతినిధి)

గోదావరి పుష్కరాలు 2027ను దృష్టిలో ఉంచుకొని చేపట్టిన అభివృద్ధి పనులు మౌలిక సదుపాయాల కల్పన ఘాట్ల అభివృద్ధి తదితర పనుల పురోగతిపై ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్ ఎండోమెంట్స్ కమిషనర్ హన్మంత రావు శనివారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జగిత్యాల జిల్లా కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్‌తో పాటు సంబంధిత శాఖల అధికారులు వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్ మాట్లాడుతూ గోదావరి పుష్కరాల సందర్భంగా జిల్లాలో చేపట్టాల్సిన ఏర్పాట్లు ఇప్పటికే ప్రతిపాదించిన అభివృద్ధి పనులు వాటి ప్రస్తుత పురోగతి పనుల అమలులో ఎదురవుతున్న సమస్యలు తదితర అంశాలపై సమీక్షించారు. ముఖ్యంగా గోదావరి నదీ తీర ప్రాంతాల్లో భక్తులకు అవసరమైన సౌకర్యాల కల్పనపై చర్చించారు. పుష్కరాల సమయంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఘాట్ల అభివృద్ధి రహదారుల నిర్మాణం తాగునీటి సరఫరా పారిశుధ్యం విద్యుత్ దీపాల ఏర్పాటు మరుగుదొడ్లు పార్కింగ్ వైద్య సదుపాయాలు తదితర అంశాలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పని చేస్తూ చేపట్టిన పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని సమావేశంలో ఆదేశించారు. పనుల నాణ్యత విషయంలో రాజీ పడకుండా క్షేత్ర స్థాయిలో నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. అనంతరం జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్ మాట్లాడుతూ జిల్లాలో గోదావరి పుష్కరాల కోసం చేపడుతున్న ఏర్పాట్లు ప్రతిపాదిత అభివృద్ధి పనులు వాటి పురోగతి సంబంధిత శాఖల ద్వారా తీసుకుంటున్న చర్యలను వివరించారు. పుష్కరాల నిర్వహణకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జగిత్యాల ఆర్డీవో మధుసూదన్ ఈఈపిఆర్ విద్యుత్ శాఖ అధికారులు తహసీల్దార్ సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థుల అభ్యసన సామర్థ్యాల పెంపునకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలి - కలెక్టర్

విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలి

విద్యార్థుల్లో వినడం, మాట్లాడడం, చదవడం, సృజనాత్మకంగా రాయడం వంటి భాషా నైపుణ్యాలను పెంపొందించాలి

గణితంలో నాలుగు ప్రాథమిక ప్రక్రియల్లో విద్యార్థులు వంద శాతం నైపుణ్యం సాధించేలా బోధించాలి

ఏడు మండలాల ఎం.ఈ.ఓలు, ప్రధానోపాధ్యాయులకు ఒకరోజు ఓరియంటేషన్ శిక్షణ

పెద్దపల్లి, అక్టోబర్ 31 (వుదయం ప్రతినిధి)

విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పెంపొందించేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించి అమలు చేయాలని, రెమిడియేషన్, ఖాన్ అకాడమీ, ఎఫ్.ఎల్.ఎన్. తరగతులను మండల విద్యాధికారులు (ఎం.ఈ.ఓలు), ప్రధానోపాధ్యాయులు (హెచ్.ఎం.లు) నిరంతరం పర్యవేక్షించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సూచించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు.శనివారం పెద్దపల్లిలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఏడు మండలాల ఎం.ఈ.ఓలు, ప్రధానోపాధ్యాయులకు నిర్వహించిన ఒకరోజు ఓరియంటేషన్ శిక్షణ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. తెలుగు, ఆంగ్లం, గణితం సబ్జెక్టుల్లో నిర్వహిస్తున్న రెమిడియేషన్ తరగతుల పురోగతిని నిరంతరం సమీక్షించాలని, ఖాన్ అకాడమీలో విద్యార్థుల రిజిస్ట్రేషన్, అభ్యసన ఫలితాలు, ఇతర పరిపాలనా అంశాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా విద్యాబోధనలో అనుసరించాల్సిన పద్ధతులను వివరిస్తూ, ఉపాధ్యాయులు తరగతి గదిలో ఫెసిలిటేటర్లుగా వ్యవహరించాలని తెలిపారు. విద్యార్థులు నేర్చుకున్న విషయాలను వారే స్వయంగా మాట్లాడేలా ప్రోత్సహించాలని, కేవలం వినేవారిగా కాకుండా నేర్చుకున్న అంశాలను అర్థం చేసుకొని స్వయంగా వ్యక్తీకరించేలా బోధనా పద్ధతులు ఉండాలని సూచించారు.విద్యార్థుల్లో భాషా నైపుణ్యాలైన వినడం, మాట్లాడడం, చదవడం, సృజనాత్మకంగా రాయడం వంటి సామర్థ్యాలను పెంపొందించడంపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. ప్రతి విద్యార్థి అభ్యసన స్థాయిని గుర్తించి, అవసరమైన అదనపు బోధన అందించడం ద్వారా విద్యా ప్రమాణాలను మెరుగుపరచాలని సూచించారు.తెలుగు, ఆంగ్లం, గణితం సబ్జెక్టుల్లో విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను మెరుగుపరిచేందుకు నిర్వహిస్తున్న రెమిడియేషన్ తరగతులు సమర్థవంతంగా కొనసాగాలని సూచించారు. గణితంలో కూడిక, తీసివేత, గుణకారం, భాగహారం అనే నాలుగు ప్రాథమిక ప్రక్రియల్లో విద్యార్థులు వంద శాతం నైపుణ్యం సాధించేలా బోధన చేపట్టాలని తెలిపారు. ఆయా తరగతుల ఫలితాలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ విద్యార్థుల ప్రగతిని అంచనా వేయాలని ఎం.ఈ.ఓలు, హెచ్.ఎం.లకు సూచించారు.ఖాన్ అకాడమీలో విద్యార్థుల రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేయడంతో పాటు, విద్యార్థులు డిజిటల్ అభ్యసన ద్వారా సాధిస్తున్న ప్రగతిని నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. విద్యార్థుల వినియోగం, అభ్యసన ఫలితాలను సమీక్షిస్తూ అవసరమైన మార్గదర్శకాలు అందించాలని తెలిపారు.ఎఫ్.ఎల్.ఎన్. కార్యక్రమంలో రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానం సాధించిన విధంగా, ఉన్నత పాఠశాలలు కూడా మెరుగైన ఫలితాలు సాధించేలా ప్రణాళికలు రూపొందించి పకడ్బందీగా అమలు చేయాలని కలెక్టర్ సూచించారు. ఉపాధ్యాయుల తరగతి బోధనను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ విద్యార్థులకు నాణ్యమైన విద్య అందేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.అనంతరం మండల విద్యాధికారులు, ప్రధానోపాధ్యాయులు తమ తమ పాఠశాలల్లో విద్యార్థుల అభివృద్ధి, అభ్యసన ప్రగతికి సంబంధించిన అంశాలపై చర్చించారు. ఎఫ్.ఎల్.ఎన్. కార్యక్రమం పురోగతి, ఏ బుక్ ఆన్ డిజిటల్ లెర్నింగ్ అంశాలపై డి.ఆర్.పీలు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఏ.ఎం.ఓ. డా. పి.ఎం. షేక్, పెద్దపల్లి మండల విద్యాధికారి సురేంద్ర కుమార్, సుల్తానాబాద్, శ్రీరాంపూర్, ఓదెల, ధర్మారం, జూలపల్లి, ఎలిగేడు మండలాల విద్యాధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఆలోకిట్ ప్రతినిధులు ప్రమోద్, అంజద్, సమీద్, స్కూల్స్ ఇన్‌స్పెక్షన్ టీమ్ లీడర్ సి.హెచ్. ఆగయ్య, డి.ఆర్.పి.లు గడ్డం జగదీశ్వర్, కృష్ణమోహన్, జె. శ్రీనివాస్, ఏ. శ్రీనివాస్, రమేష్, మంజుల, జ్యోతి, కిరణ్, కృష్ణారెడ్డి, దేవేందర్, రవి, పుష్పలత, సి.ఆర్.పి.లు తదితరులు పాల్గొన్నారు.

సాదాసీదాగా క్యాతనపల్లి మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం...

-మున్సిపల్ చైర్ పర్సన్ గొడిసెల సంధ్యారాణి...

చైర్‌పర్సన్ వైఖరిపై కాంగ్రెస్ కౌన్సిలర్ల నిరసన...

మంచిర్యాల / రామకృష్ణాపూర్/ అక్టోబర్ 31 (వుదయం ప్రతినిధి)

క్యాతనపల్లి మున్సిపాలిటీ కార్యాలయంలో నిర్వహించిన కౌన్సిల్ సాధారణ సమావేశం 34 అంశాల ఎజెండాతో కొనసాగింది. ఈ సమావేశానికి జిల్లా అదనపు కలెక్టర్ పి. చంద్రయ్య హాజరయ్యారు. మున్సిపల్ కమిషనర్ అధ్యక్షతన సమావేశం నిర్వహించవద్దని కలెక్టర్‌కు వినతిపత్రం అందజేయడంతో అదనపు కలెక్టర్‌ను సమావేశానికి నియమించినట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ గొడిసెల సంధ్యారాణి తెలిపారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ.. నిధుల దుర్వినియోగం జరిగిందని కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు ఆరోపించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. పట్టణ అభివృద్ధిలో భాగంగా బీఆర్ఎస్, సీపీఐ కౌన్సిలర్లకు చెందిన వార్డుల్లో అభివృద్ధి పనులు జరగడం లేదని, ఈ నేపథ్యంలో ప్రతి వార్డుకు రూ.5 లక్షల చొప్పున నిధులు మంజూరు చేయాలని సమావేశంలో ప్రతిపాదించినట్లు తెలిపారు. ఈ ప్రతిపాదనకు సభ్యులందరూ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారని పేర్కొన్నారు. చైర్ పర్సన్ వైఖరిపై కాంగ్రెస్ కౌన్సిలర్ల నిరసన....మరోవైపు, సమావేశంలో చైర్ పర్సన్ గొడిసెల సంధ్యారాణి కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లను అవహేళన చేశారంటూ కాంగ్రెస్ కౌన్సిలర్లు మున్సిపల్ కార్యాలయం ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు.కౌన్సిల్ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లను మాట్లాడనివ్వడం లేదని, ఎవరూ తన ముందు మాట్లాడకూడదని చైర్‌పర్సన్ అంటున్నారని కౌన్సిలర్లు పల్లె శ్రీదేవి, దాముఖ శిరీష, గోపతి భాగ్య, పుల్లూరి తిరుమల ఆరోపించారు. ఇటీవల చేపట్టిన వివిధ కార్యక్రమాల్లో నిధుల దుర్వినియోగం జరిగిందని, దీనిపై ప్రశ్నించినందుకే తమ గొంతు నొక్కే ప్రయత్నం చేస్తున్నారని వారు విమర్శించారు.చైర్‌పర్సన్ తన వైఖరిని మార్చుకోవాలని, కౌన్సిల్ సమావేశాల్లో అన్ని పార్టీల కౌన్సిలర్లకు మాట్లాడే అవకాశం కల్పించాలని కాంగ్రెస్ కౌన్సిలర్లు డిమాండ్ చేశారు.

మిర్చి, క్యాప్సికం సాగుతో అధిక లాభాలు: రైతుకు కలెక్టర్ ప్రశంసలు

కూరగాయల సాగుతో తక్కువ పెట్టుబడికి అధిక ఆదాయం పొందవచ్చని తెలిపిన రైతు

కామారెడ్డి, అక్టోబర్ 31 (వుదయం ప్రతినిధి):

కామారెడ్డి జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ కోమిరెడ్డి అంజయ్య సాగు చేస్తున్న మిర్చి, క్యాప్సికం తోటలను శనివారం సందర్శించి, పంటల సాగు విధానం, దిగుబడి, మార్కెటింగ్, రైతుకు వస్తున్న ఆదాయం తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రైతు కోమిరెడ్డి అంజయ్య మాట్లాడుతూ, తాను గత మూడు సంవత్సరాలుగా క్యాప్సికం పంటను సాగు చేస్తున్నానని తెలిపారు. ఒక ఎకరా విస్తీర్ణంలో క్యాప్సికం సాగు చేసి సుమారు 30 టన్నుల దిగుబడిని సాధించినట్లు వెల్లడించారు. పండించిన పంటను టన్నుకు రూ.40,000 చొప్పున విక్రయించగా, మొత్తం రూ.12 లక్షల ఆదాయం వచ్చినట్లు తెలిపారు. సాగు ఖర్చులు, ఇతర వ్యయాలు పోను సుమారు రూ.10 లక్షల వరకు నికర ఆదాయం పొందినట్లు సంతోషం వ్యక్తం చేశారు. సంప్రదాయ వరి సాగుతో పోలిస్తే కూరగాయల సాగు ద్వారా అధిక ఆదాయం పొందే అవకాశం ఉందని, ముఖ్యంగా క్యాప్సికం వంటి ఉద్యాన పంటలను శాస్త్రీయ పద్ధతుల్లో సాగు చేయడం వల్ల మంచి దిగుబడితో పాటు మెరుగైన లాభాలు పొందవచ్చని రైతు తన అనుభవాన్ని వివరించారు. గత మూడు సంవత్సరాలుగా క్యాప్సికం సాగు ద్వారా మంచి ఫలితాలు సాధిస్తున్నానని, ఇతర రైతులు కూడా పంటల మార్పిడి విధానాన్ని అనుసరిస్తూ కూరగాయల సాగుపై దృష్టి సారించాలని సూచించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ రైతుతో మాట్లాడి, ఉద్యాన పంటల సాగులో అనుసరిస్తున్న పద్ధతులు, పంటల యాజమాన్యం, దిగుబడి వివరాలను తెలుసుకున్నారు. సంప్రదాయ పంటలతో పాటు ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులు దృష్టి సారించడం ద్వారా వ్యవసాయాన్ని మరింత లాభసాటిగా మార్చుకోవచ్చని పేర్కొన్నారు. మార్కెట్ డిమాండ్‌కు అనుగుణంగా పంటలను ఎంపిక చేసుకొని, ఆధునిక సాగు పద్ధతులు పాటిస్తూ అధిక దిగుబడులు, మెరుగైన ఆదాయం సాధించాలని రైతులకు సూచించారు.రైతులు తమకున్న భూమి, నీటి వనరులు, మార్కెట్ పరిస్థితులను పరిగణనలోకి తీసుకొని ఉద్యాన పంటల సాగును ప్రోత్సహించుకోవాలని, వ్యవసాయ, ఉద్యాన శాఖల అధికారుల సలహాలు, సూచనలు పాటిస్తూ ముందుకు సాగాలని ఈ సందర్భంగా సూచించారు.ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఎన్.వై. గిరి, జిల్లా ఉద్యాన పట్టుపరిశ్రమ శాఖ అధికారి జ్యోతి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి మోహన్ రెడ్డి, ఉద్యాన శాఖ అధికారి సుమన్, ఉద్యాన విస్తరణ అధికారి బాపురెడ్డి, ఇతర మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

నాడు దోచుకోవడంలో పోటీపడ్డారు.. నేడు మభ్యపెట్టేందుకు పోటీపడుతున్నారు!

- కవిత, కేటీఆర్‌పై పాయల్ శంకర్ ఘాటు విమర్శలు

ఆదిలాబాద్, వుదయం ప్రతినిధి, అక్టోబర్ 31:

అధికారంలో ఉన్న పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఆదిలాబాద్ అభివృద్ధికి చేసిందేమీ లేదని, నాడు దోచుకోవడంలో పోటీపడ్డవారు.. నేడు ప్రజలను మభ్యపెట్టేందుకు పోటీపడుతున్నారని ఎమ్మెల్యే పాయల్ శంకర్ ఘాటుగా వ్యాఖ్యానించారు. శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రైతు గర్జన సభకు వస్తున్న కేటీఆర్ పదేళ్ల పాలనలో జిల్లాకు చేసిన అభివృద్ధిపై సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఆదిలాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీకి సంబంధించిన నిధులను సిద్దిపేట, గజ్వేల్, సిరిసిల్ల ప్రాంతాలకు మళ్లించిన సమయంలో అప్పటి స్థానిక ఎమ్మెల్యే, మంత్రి జోగు రామన్న ఎందుకు స్పందించలేదని ప్రశ్నించారు. నాలుగుసార్లు ఎమ్మెల్యేగా, మంత్రిగా పనిచేసిన ఆయన జిల్లా అభివృద్ధికి చేసిన కృషిపై ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కోర్టా-చనాకా ప్రాజెక్టును పదేళ్లలో ఎందుకు పూర్తి చేయలేకపోయారని ప్రశ్నించారు. కోట్లాది రూపాయల ప్రజాధనం ఖర్చు చేసినప్పటికీ కాలువలు నాసిరకం పనుల కారణంగా కూలిపోతున్నాయని ఆరోపించారు. పనుల నాణ్యత, కాంట్రాక్టు ఒప్పందాలు, అంచనాలు, నిధుల వినియోగంపై సమగ్ర విచారణ జరగాలని కోరారు. అప్పటి మంత్రి జోగు రామన్న హయాంలో జరిగిన ఆర్థిక లావాదేవీలు, అవకతవకలపై కూడా విచారణ జరిపించి వాస్తవాలను ప్రజల ముందుంచాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజనను అమలు చేయకపోవడంతో రైతులకు అన్యాయం జరిగిందని విమర్శించారు. పంట నష్టాలతో రైతులు ఇబ్బందులు పడుతున్న సమయంలో భరోసా కల్పించలేని నాయకులు ఇప్పుడు రైతు గర్జన సభలు నిర్వహించడం వెనుక ఉద్దేశమేమిటని ప్రశ్నించారు. తాను ఎమ్మెల్యేగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఆదిలాబాద్ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వ సహకారంతో రూ.128 కోట్లతో రైల్వే ROB/RUB ప్రాజెక్టును తీసుకొచ్చానని తెలిపారు. ఈ ప్రాజెక్టు 100 శాతం కేంద్ర ప్రభుత్వ నిధులతో చేపడుతున్నట్లు వివరించారు. ఆదిలాబాద్‌కు విమానాశ్రయం తీసుకొచ్చేందుకు కూడా కృషి చేస్తున్నామని చెప్పారు. తనపై కవిత చేసిన వ్యాఖ్యలకు స్పందిస్తూ, ముఖ్యమంత్రిని కాపాడాల్సిన అవసరం తనకు లేదని అన్నారు. మీకు వ్యాపార భాగస్వామ్యాలు ఉండవచ్చేమో కానీ, తనకు మాత్రం ఆదిలాబాద్ అభివృద్ధే ఏకైక అజెండా అని స్పష్టం చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు రఘుపతి, జోగు రవి, శ్రీకాంత్, పోసాలు, శివగౌడ్, సూర్యకిరణ్, రవి, భీమ్‌సన్‌రెడ్డి, భూమారెడ్డి, సృజన్, ప్రతిష్, యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

పటేల్ ఐక్యతా స్ఫూర్తిని ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలి

--జాతీయ ఐక్యతా దినోత్సవంలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్



రాజన్న సిరిసిల్ల, అక్టోబర్ 31: (వుదయం ప్రతినిధి):

సర్దార్ వల్లభాయ్ పటేల్ చూపిన ఐక్యతా స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ పిలుపునిచ్చారు, సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకుని శనివారం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం (ఐడీఓసీ) ఆడిటోరియంలో జాతీయ ఐక్యతా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, జిల్లా రెవెన్యూ అధికారి జయశ్రీలు పటేల్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగానివాళులర్పించారు. అనంతరం వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు, సిబ్బందితో ఐక్యతా ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం అదనపు కలెక్టర్ మాట్లాడుతూ భారత స్వాతంత్ర్య ఉద్యమంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ కీలక పాత్ర పోషించారని గుర్తుచేశారు. స్వాతంత్ర్యంఅనంతరందేశంలోని పలు సంస్థానాలను భారత యూనియన్‌లో విలీనంచేసి జాతీయ సమైక్యతకు బలమైన పునాది వేశారని కొనియాడారు. దేశ ఐక్యత, సమగ్రతను కాపాడటంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఏవో రాంరెడ్డి, వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

పేదరికం నుంచి ఇండియన్ బ్యాంక్ హెచ్‌ఆర్ మేనేజర్‌గా...

కమలాపూర్ యువకుడు తోట. పవన్ విజయం

ధర్మపురి, అక్టోబర్31 (వుదయం ప్రతి నిధి):

ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొంటూ, పట్టుదలతో శ్రమిస్తే ఏ లక్ష్యమైనా సాధించవచ్చని ధర్మపురి మండలం కమలాపూర్ గ్రామానికి చెందిన తోట పవన్ నిరూపించారు. ఇండియన్ బ్యాంక్ స్పెషలిస్ట్ ఆఫీసర్ నియామక ఫలితాల్లో ఆయన హెచ్‌ఆర్ మేనేజర్‌గా ఎంపికయ్యారు. వ్యవసాయ కుటుంబానికి చెందిన రాజ్యలక్ష్మి , శంకరయ్య దంపతుల కుమారుడైన పవన్ 7వ తరగతిలో ఉండగానే తండ్రిని కోల్పోయారు. ఈ క్లిష్ట సమయంలో ఎన్టీఆర్ ట్రస్ట్ ద్వారా హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ మోడల్ స్కూల్‌లో ఉచిత విద్యనభ్యసించిన ఆయన, అనంతరం సీవీఆర్ కళాశాలలో బీటెక్ పూర్తి చేశారు. క్యాంపస్ ప్లేస్ మెంట్‌లో టీసీఎస్‌లో ఇంజినీర్‌గా ఉద్యోగం సాధించిన ప్పటికీ, ఉన్నత లక్ష్యంతో ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఎంబీఏ పూర్తి చేశారు.ఉద్యోగం చేస్తూనే రాత్రి వేళల్లో పడిన కష్టానికి తగిన ఫలితంగా నేడు ఇండియన్ బ్యాంక్‌లో హెచ్‌ఆర్ మేనేజర్ కొలువు సాధించారు. తల్లి త్యాగం,మేనమామ అప్పల నారాయణ మార్గదర్శకత్వం తన విజయంలో కీలకమని పవన్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయనను గ్రామస్థులు, బంధుమిత్రులు అభినందించారు.

దివ్యాంగులు సహాయ ఉపకరణాలను సద్వినియోగం చేసుకోవాలి: కలెక్టర్

ఆసిఫాబాద్ (వుదయం ప్రతినిధి)

దివ్యాంగులకు ఉచితంగా అందించిన సహాయ ఉపకరణాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలోని కలెక్టర్ ఛాంబర్ లో సాయి స్వస్థ వెల్నెస్ సెంటర్- కాగజ్ నగర్ ఆధ్వర్యంలో జైపూర్ ఫుట్ క్యాంప్ గోడ ప్రతులను సంస్థ ప్రతినిధులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సాయి స్వస్థ వెల్నెస్ సెంటర్ వారు దివ్యాంగులకు కృత్రిమ కాళ్లు, కృత్రిమ చేతులు, ఊత కర్రలు, నడక సహాయ కాలు, ఆర్థోపెడిక్ బూట్లు, సహాయ బెల్టులు, వినికిడి పరికరాలు, ఇతర సహాయ ఉపకరణాలను అందిస్తున్నారని, వీటిని దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో సాయి స్వస్థ వెల్నెస్ సెంటర్- కాగజ్ నగర్ ప్రతినిధులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ పబ్బం కోసం అసత్య ఆరోపణలా? కవిత వ్యాఖ్యలకు జోగు రామన్న ఘాటు కౌంటర్

ఆదిలాబాద్, వుదయం ప్రతినిధి, అక్టోబర్ 31:

రాజకీయ పబ్బం గడుపుకోవడం కోసమే బీఆర్ఎస్‌పై కల్వకుంట్ల కవిత అసత్య ఆరోపణలు చేస్తున్నారని మాజీ మంత్రి జోగు రామన్న విమర్శించారు. జిల్లాలోని చనాక-కొరాట ప్రాజెక్టు గురించి వాస్తవాలు తెలుసుకోకుండా రూ.1,700 కోట్ల అవినీతి జరిగిందంటూ మాట్లాడటం హాస్యాస్పదమన్నారు. ఇంద్రవెల్లి పాంచజన్య సభలో కేటీఆర్, బీఆర్ఎస్‌ను లక్ష్యంగా చేసుకుని చేసిన వ్యాఖ్యలను ఖండించారు. శనివారం ఆదిలాబాద్‌లోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.2015లో జీవో 120 ప్రకారం చనాక-కొరాట ప్రాజెక్టుకు రూ.1,220 కోట్లు మంజూరు చేశామని, 2025 నాటికి అంచనా వ్యయం రూ.1,590 కోట్లకు చేరిందని తెలిపారు. తమ ప్రభుత్వ హయాంలో ప్రాజెక్టు వ్యయం రూ.1,300 కోట్లు కూడా దాటలేదని పేర్కొన్నారు. అలాంటప్పుడు రూ.1,700 కోట్ల అవినీతి జరిగిందని కవిత ఎలా ఆరోపిస్తారని ప్రశ్నించారు. ఆరోపణలు చేసే ముందు ప్రాజెక్టు అంచనాలు, ప్రభుత్వ ఉత్తర్వులను పరిశీలించాలని హితవు పలికారు.సీసీఐ పరిశ్రమ పునరుద్ధరణకు బీఆర్ఎస్ ప్రభుత్వం పలుమార్లు కేంద్రానికి లేఖలు పంపినా కేంద్రం నుంచి స్పందన రాలేదన్నారు. పరిశ్రమ పునరుద్ధరణ విషయంలో బీజేపీ నేతలు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. జీవో 67 ద్వారా జేఎన్టీయూ ఇంజినీరింగ్ కళాశాలను కూడా మంజూరు చేసినట్లు గుర్తు చేశారు. కవిత చేసిన ఆరోపణలకు ఎక్కడైనా, ఎప్పుడైనా సమాధానం చెప్పేందుకు తాము సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు.ఈ సమావేశంలో పట్టణ అధ్యక్షుడు అజయ్, ఇజ్జగిరి నారాయణ, అన్నెల వాసత్, యాసం నర్సింగరావు, మెట్టు ప్రహ్లాద్, చందల రాజన్న, లింగారెడ్డి, సాజిద్ ఉద్దీన్, మారిశెట్టి గోవర్ధన్, మద్దుల ఉషన్న, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

మహబూబ్‌నగర్ | మెదక్ - ఉమ్మడి జిల్లాల వార్తలు

భూసేకరణ భూముల వివరాలు భూ భారతి రికార్డుల్లో నమోదు చేయాలి : కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్

నాగర్ కర్నూల్, అక్టోబర్ 31 (వుదయం బ్యూరో) :
జిల్లాలో వివిధ సాగునీటి ప్రాజెక్టులు, ప్రధాన కాలువల నిర్మాణం కోసం భూసేకరణ చట్టం ద్వారా రైతుల నుంచి సేకరించిన భూముల వివరాలను భూ భారతి పోర్టల్ తో పాటు రెవెన్యూ రికార్డుల్లో తప్పనిసరిగా నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ నీటిపారుదల శాఖ అధికారులను ఆదేశించారు.శనివారం కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ బి. చెన్నయ్య, భూసేకరణ ప్రత్యేక అధికారి అరుణ రెడ్డితో కలిసి నీటిపారుదల శాఖ అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు.
ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో నూతన సాగునీటి ప్రాజెక్టులు, వాటి ప్రధాన కాలువల నిర్మాణాలకు అవసరమైన భూములను భూసేకరణ చట్టం ప్రకారం సేకరించిన అనంతరం ఆయా భూముల వివరాలను తప్పనిసరిగా భూ భారతి రెవెన్యూ రికార్డుల్లో నమోదు చేయాలని స్పష్టం చేశారు. ఇందుకోసం సంబంధిత మండలాల తహసీల్దార్లతో సమన్వయం చేసుకుంటూ నమోదు ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు.జిల్లాలోని 75 గ్రామాల పరిధిలో భూముల రీసర్వే ప్రక్రియ కొనసాగుతుండగా, ఇప్పటివరకు 15 గ్రామాల్లో సర్వే పనులు పూర్తయ్యాయని కలెక్టర్ తెలిపారు. ఆయా గ్రామాల పరిధిలో రైతుల నుంచి సేకరించి నీటిపారుదల శాఖకు బదిలీ చేసిన భూములను రీసర్వేలో నీటిపారుదల శాఖకు సంబంధించిన ప్రభుత్వ భూములుగా గుర్తించి, భూ భారతి రెవెన్యూ రికార్డుల్లో నమోదు చేయాలని సూచించారు.ఈ ప్రక్రియను నీటిపారుదల శాఖ అధికారులు ప్రత్యేక చొరవతో వేగవంతంగా పూర్తి చేయాలని, ఇంకా కొనసాగుతున్న భూసేకరణ ప్రక్రియను కూడా త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు.ఈ సమావేశంలో నీటిపారుదల శాఖ అధికారులు అమర్ సింగ్, లింగాల్, కలెక్టరేట్ విభాగపు సూపరింటెండెంట్ నారాయణ, ఏఈలు తదితరులు పాల్గొన్నారు.

షీ టీమ్స్ నిఘా.. 75 మందికి కౌన్సెలింగ్

- అక్టోబర్‌లో 54 అవగాహన కార్యక్రమాలు.. 2 ఈ-పెట్టి కేసులు నమోదు
- వేధింపులకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు: ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు

మెదక్,వుదయం,నవంబర్,01: (చిలిపిచెడ్ మండల్ ప్రతినిధి):
మహిళలు, బాలికల భద్రతకు ప్రాధాన్యతనిస్తూ మెదక్ జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో షీ టీమ్స్ నిరంతరం నిఘా కొనసాగిస్తున్నాయని జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు ఐపీఎస్ తెలిపారు. మెదక్, తూప్రాన్ పోలీస్ సబ్ డివిజన్ల పరిధిలో సంబంధిత డీఎస్పీల పర్యవేక్షణలో షీ టీమ్స్ పనిచేస్తున్నాయని పేర్కొన్నారు.అక్టోబర్ నెలలో జిల్లావ్యాప్తంగా మహిళలు, బాలికల భద్రత, వేధింపుల నివారణ, సైబర్ నేరాలపై షీ టీమ్స్ ఆధ్వర్యంలో 54 అవగాహన కార్యక్రమాలు నిర్వహించినట్లు వెల్లడించారు. మహిళలను వేధిస్తున్న 75 మందిని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుని కౌన్సెలింగ్ నిర్వహించడంతో పాటు, రెండు ఈపెట్టి కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. మహిళలను వేధించడం, అసభ్యకరంగా ప్రవర్తించడం, సోషల్ మీడియా ద్వారా ఇబ్బందులకు గురిచేయడం వంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు. మహిళలు, బాలికలు ఎలాంటి భయం లేకుండా తమకు ఎదురయ్యే వేధింపులపై షీ టీమ్స్‌కు ఫిర్యాదు చేయాలని సూచించారు. మహిళల భద్రతకు మెదక్ జిల్లా పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని స్పష్టం చేశారు.

ఉపాధి హామీ(వీ బీ జీ రామ్ జీ) పనుల్లో కూలీల సంఖ్యను పెంచాలి : అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఖీమ్యా నాయక్

వనపర్తి అక్టోబర్ 31 (వుదయం ప్రతినిధి)
శనివారం జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఘనపూర్ మండలంలోని వివిధ గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పనులను, ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలను సందర్శించి పరిశీలించారు. ముందుగా ఘనపూర్ గ్రామంలో కొనసాగుతున్న ఫీడర్ ఛానల్ పనులను, అదేవిదంగా వెంకటంపల్లి గ్రామంలోని ఫామ్ పాండ్ పనులను డీఆర్డీఓతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా పనులు చేస్తున్న కూలీలతో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు, వీబీజీరామ్‌జీ సిబ్బందితో మాట్లాడి పనుల పురోగతిని సమీక్షించారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ మండలంలో ఉపాధి హామీ పనులకు కూలీల హాజరు సంఖ్యను మరింత పెంచాలని, కూలీలకు పనులపై అవగాహన కల్పిస్తూ విస్తృతంగా పనులు చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు.
అనంతరం ఘనపూర్‌లోని ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలను సందర్శించి విద్యార్థులు, ఉపాధ్యాయులతో మాట్లాడారు. పాఠశాల వసతి గృహంలోని వంటగది, భోజనశాల, విద్యార్థుల గదులు, మరుగుదొడ్లు, ఇతర వసతులను పరిశీలించారు. విద్యార్థులకు అందిస్తున్న ఆహార నాణ్యత, ప్రభుత్వ మెనూ అమలు, పారిశుద్ధ్యం, పరిసరాల పరిశుభ్రతను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడికి పలు సూచనలు చేస్తూ, విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించడంతో పాటు ఆరోగ్యకరమైన, పరిశుభ్రమైన వాతావరణంలో విద్యనభ్యసించేలా సంబంధిత అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు. విద్యార్థులకు ప్రభుత్వ మెనూ ప్రకారం ఎలాంటి మార్పులు లేకుండా నాణ్యమైన భోజనం అందించాలని, వంటగది, భోజనశాల, వసతి గృహాలు, మరుగుదొడ్లలో నిరంతరం పరిశుభ్రత పాటించాలని ఆదేశించారు. విద్యార్థులతో ఎప్పటికప్పుడు మాట్లాడి వారి సమస్యలు, ఇబ్బందులను తెలుసుకొని పరిష్కరించాలని, వారి విద్యా ప్రగతిని నిరంతరం సమీక్షించాలని సూచించారు. డీఆర్డీఓ ఉమాదేవి, డీటీడీఓ మధు, ఘనపూర్ ఎంపీడీఓ, ఏఈఈ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, వీబీజీరామ్ జీ సిబ్బంది, ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

రవి మృతి తీరని లోటు

*** మెదక్ మాజీ ఎమ్మెల్యేలు**

ఉవుదయం ప్రతినిధి) పాపన్నపేట, అక్టోబర్ :31
కొత్తపల్లి గ్రామానికి చెందిన భారాస కార్యకర్త ఏడుపాల రవి బ్రెయిన్ స్ట్రోక్‌తో మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న మెదక్ మాజీ ఎమ్మెల్యేలు పద్మా దేవేందర్ రెడ్డి,పట్లోళ్ల శశిధర్ రెడ్డి లు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆదివారం కొత్తపల్లి గ్రామంలో రవి పార్థివ దేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రవి భార్య,పిల్లలను ఓదార్చి మనోధైర్యం కల్పించారు. రవి మృతి పార్టీకి,కుటుంబానికి తీరని లోటన్నారు. ఆయన అంత్యక్రియల్లో పాల్గొని,కుటుంబ సభ్యులకు అండగా ఉంటామని భరోసానిచ్చారు. గ్రామ సర్పంచ్ పద్మ జగన్నాథం,ఉపసర్పంచ్

రాము, గ్రామ పార్టీ అధ్యక్షుడు రామకృష్ణయ్య, మాజీ సర్పంచులు గురుమూర్తి గౌడ్,లింగారెడ్డి, బద్రీ మల్లేశం,నాయకులు దుర్గాదాస్,సోమశేఖర్,రాజు తదితరులు పాల్గొన్నారు.

బాలల రక్షణ, హక్కులపై విద్యార్థులకు

అవగాహన కార్యక్రమాలు

మహబూబ్‌నగర్ :
జిల్లాలోని పలు పాఠశాలల్లో 'సురక్షిత్ బచ్చన్ అభియాన్' కార్యక్రమాలుతెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ, హైదరాబాద్ వారు మరియు జిల్లా ప్రధాన న్యాయ మూర్తి N ప్రేమలత గారి ఆదేశాల మేరకు, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ (DLSA), మహబూబ్‌నగర్ ఆధ్వర్యంలో "సురక్షిత్ బచ్చన్ అభియాన్ - పోక్సో చట్టం, 2012పై పాన్ ఇండియా పాఠశాల అవగాహన కార్యక్రమం" మొదటి దశలో భాగంగా 31 అక్టోబర్ 2026న మహబూబ్‌నగర్ జిల్లాలోని పలు పాఠశాలల్లో న్యాయ అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.1.గవర్నమెంట్ Girls కాలేజీ మహబూబ్ నగర్. పాఠశాలల్లో POCSO కోర్ట్ జడ్జి శ్రీమతి T రాజరాజేశ్వరి గారు, DLSA మహబూబ్ నగర్ సెక్రటరీ శ్రీమతి ఇందిరా గారు, LADCS డిప్యూటీ చీఫ్ శ్రీ యోగేశ్వర్ రాజ్ గారు, LADCS అసిస్టెంట్ లు మల్లారెడ్డి గారు, శ్రీ శివరాజ్ గారు మరియు PLV లు పాల్గొన్నారు.2. గవర్నమెంట్ పోలీస్ లైన్ స్కూల్, మహబూబ్‌నగర్ లో spl జ్యూడిషల్ మేజిస్ట్రేట్ శ్రీ మొహమ్మద్ మునవార్ గారు, అడ్వకేట్ శ్రీ కార్తీక్

గారు, అశోక్ గౌడ్ గారు, రవికుమార్ యాదవ్ గారు లు పాల్గొన్నారు.3. ZPHS రాంనగర్ కోయిల్కొండ, మహబూబ్ నగర్ పాఠశాల లో EXCISE కోర్ట్ జడ్జి శ్రీ రవిశంకర్ పాల్గొన్నారు.4. గీతం హై స్కూల్, జడ్చర్ల పాఠశాల లో addl JCJ jadcherla మొహమ్మద్ ముదసిర్ గారు, SI అక్షిత్ గారు, సీనియర్ లాయర్ మాలిక్ గారు పాల్గొన్నారు.5. తక్షశిలా హై స్కూల్ మహబూబ్ నగర్ పాఠశాలలో III Addl JCJ శ్రీమతి R అనిత గారు, అడ్వకేట్ T కృష్ణ గారు, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.ఈ కార్యక్రమాల్లో భాగంగా విద్యార్థులకు పోక్సో చట్టం, 2012లోని ముఖ్యమైన నిబంధనలు, బాలల హక్కులు, వ్యక్తిగత భద్రత, బాలలపై లైంగిక వేధింపుల నివారణ, బాలల రక్షణ వ్యవస్థలపై అవగాహన కల్పించారు.బాలలపై జరిగే లైంగిక నేరాలను అరికట్టడంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, పాఠశాల యాజమాన్యాలు మరియు సంబంధిత అధికారుల పాత్ర ఎంతో కీలకమని వివరించారు. పిల్లలు తమకు ఎదురయ్యే అనుచిత ప్రవర్తనను గుర్తించి, భయపడకుండా తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు లేదా సంబంధిత అధికారులకు తెలియజేయాలని సూచించారు.
బాలలకు సురక్షితమైన వాతావరణాన్ని కల్పించడం, వారి హక్కులను పరిరక్షించడం, వారిపై జరిగే నేరాలను నివారించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఈ కార్యక్రమాల ద్వారా తెలియజేశారు.జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమాలు విద్యార్థుల్లో బాలల రక్షణ, న్యాయ హక్కులు మరియు పోక్సో చట్టంపై అవగాహన పెంపొందించడానికి దోహదపడేలా ఈ కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది.

వికారాబాద్ బీజేపీ ఎస్సీ మోర్చా పగ్గాలు బక్క నర్సింహులుకు!

- జిల్లా కమిటీలో 25 మందికి చోటు.. పారిగి, తాండూరు, వికారాబాద్‌కు ప్రాధాన్యం
- రాష్ట్ర నాయకత్వం ఆమోదంతో నూతన కమిటీ ప్రకటన.. పార్టీ బలోపేతమే లక్ష్యమంటున్న జిల్లా అధ్యక్షుడు

వికారాబాద్ అక్టోబర్ 31 (వుదయం బ్యూరో)
భారతీయ జనతా పార్టీ వికారాబాద్ జిల్లా ఎస్సీ మోర్చా నూతన కమిటీని ప్రకటించింది. జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షుడిగా బక్క నర్సింహులును నియమిస్తూ రాష్ట్ర నాయకత్వం నిర్ణయం తీసుకుంది. రాష్ట్ర ఎస్సీ మోర్చా అధ్యక్షుడు కాంతి కిరణ్ ఆమోదం, బీజేపీ వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు యు. రమేష్ కుమార్ మార్గదర్శకత్వంలో 25 మందితో కూడిన జిల్లా కమిటీని ప్రకటించినట్లు పార్టీ విడుదల చేసిన నియామక ప్రకటనలో పేర్కొన్నారు.
25 మందికి వివిధ హోదాల్లో బాధ్యతలు నూతన కమిటీలో ఆరుగురికి ఉపాధ్యక్షులుగా, ఇద్దరికి ప్రధాన కార్యదర్శులుగా, ఒకరికి కోశాధికారిగా, ఆరుగురికి కార్యదర్శులుగా బాధ్యతలు అప్పగించారు. ఏడుగురిని కార్యవర్గ సభ్యులుగా, ఒకరిని సోషల్ మీడియా కన్వీనర్‌గా, ఇద్దరిని అధికార ప్రతినిధులుగా నియమించారు.ఉపాధ్యక్షులుగా పవన్ కుమార్, బున్నె నర్సింహులు, శ్యాంసుందర్, బజారప్ప, మల్లేశం, కొమరబండ మల్లేశ్‌లను నియమించారు. ప్రధాన కార్యదర్శులుగా విజయ్ కుమార్, బండారి శ్రీకాంత్‌కు బాధ్యతలు అప్పగించారు. కోశాధికారిగా గంగాపురిని ఎంపిక చేశారు. పారిగి, తాండూరు, వికారాబాద్‌కు ప్రాధాన్యం
జిల్లా కమిటీ కూర్పులో పారిగి, తాండూరు, వికారాబాద్ ప్రాంతాలకు చెందిన నాయకులకు ప్రాతినిధ్యం కల్పించారు. మూడు ప్రాంతాల నాయకులకు వివిధ హోదాల్లో బాధ్యతలు అప్పగించడం ద్వారా జిల్లా వ్యాప్తంగా ఎస్సీ మోర్చా సంస్థాగత నిర్మాణాన్ని విస్తరించాలనే లక్ష్యం కనిపిస్తోంది.
రాష్ట్ర నాయకత్వానికి బక్క నర్సింహులు కృతజ్ఞతలుజిల్లా అధ్యక్ష బాధ్యతలు

స్వీకరించిన బక్క నర్సింహులు తన నియామకంపై రాష్ట్ర నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ఎస్సీ మోర్చా అధ్యక్షుడు కాంతి కిరణ్, రాష్ట్ర కార్యదర్శి నాగరాజు, రాష్ట్ర బీజేపీ కమిటీ అగ్రనాయకులు, ఉపాధ్యక్షులు, కార్యదర్శులకు జిల్లా కమిటీ తరపున ధన్యవాదాలు తెలియజేశారు. రాబోయే రోజుల్లో పార్టీ అభివృద్ధి కోసం అహర్నిశలు శ్రమిస్తానని, ఎస్సీ మోర్చాను జిల్లాలో మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని వెల్లడించారు. తనకు ఈ అవకాశం కల్పించిన నాయకులకు పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు.
సామాజిక సమస్యలపై కార్యాచరణకు సిద్ధం కావాల్సిన కమిటీ
కొత్త కమిటీ ముందు అనేక బాధ్యతలు ఉన్నాయి. ఎస్సీ వర్గాల సమస్యలను గుర్తించడం, విద్య, ఉపాధి అవకాశాలపై అవగాహన కల్పించడం, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులకు అందేలా చొరవ చూపడం, సామాజిక న్యాయం, హక్కుల పరిరక్షణ అంశాలపై ప్రజల్లోకి వెళ్లడం కీలకంగా మారనున్నాయి.
గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ పార్టీ కార్యక్రమాలను విస్తరించాల్సిన అవసరం ఉంది. కేవలం పదవులకే పరిమితం కాకుండా ప్రజా సమస్యల పరిష్కారంలో చురుకైన పాత్ర పోషిస్తేనే కమిటీకి గుర్తింపు లభించనుంది.బక్క నర్సింహులు నాయకత్వంలో 25 మందితో ఏర్పాటైన నూతన జిల్లా కమిటీ వికారాబాద్ జిల్లాలో ఎస్సీ మోర్చాను ఏ మేరకు బలోపేతం చేస్తుంది? ప్రజా సమస్యలపై ఎలాంటి కార్యాచరణతో ముందుకు సాగుతుంది? అన్నది రానున్న రోజుల్లో తేలనుంది.

బాలల హక్కులపై న్యాయ అవగాహన

- సురక్షిత్ బచ్చన్ అభియాన్‌లో భాగంగా విద్యార్థులకు చట్టాలపై అవగాహన

సంగారెడ్డి, వుదయం:
బాలల హక్కుల పరిరక్షణ, వ్యక్తిగత భద్రతపై విద్యార్థుల్లో అవగాహన పెంపొందించడమే లక్ష్యంగా సంగారెడ్డిలోని కరుణ హైస్కూల్‌లో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సురక్షిత్ బచ్చన్ అభియాన్ - దేశవ్యాప్త పాఠశాలల బాలల అవగాహన కార్యక్రమంలో భాగంగా శనివారం ఈ కార్యక్రమం చేపట్టారు.
ఈ కార్యక్రమానికి సంగారెడ్డి జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్ జి. భవాని చంద్ర ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి. సౌజన్యతో కలిసి విద్యార్థులకు బాలల హక్కులు, చట్టపరమైన రక్షణ, వ్యక్తిగత భద్రతపై అవగాహన కల్పించారు.
ఈ సందర్భంగా జి. భవాని చంద్ర మాట్లాడుతూ ప్రతి చిన్నారికి సురక్షితమైన బాల్యాన్ని అందించడం సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. బాలలపై లైంగిక వేధింపులు, శారీరక, మానసిక హింస, బాల్య వివాహాలు, బాల కార్మిక వ్యవస్థ, అక్రమ రవాణా వంటి సమస్యలపై పిల్లలకు అవగాహన ఉండాలన్నారు.

తమకు ఎదురయ్యే ఇబ్బందులను భయపడకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు.
కార్యదర్శి బి. సౌజన్య మాట్లాడుతూ పోక్సో చట్టం ద్వారా బాలలకు కల్పిస్తున్న రక్షణ, లైంగిక నేరాలపై ఫిర్యాదుల నమోదు, బాధితులకు అందించే సహాయంపై వివరించారు. బాలల హక్కులు, విద్యా హక్కు, సమానత్వం, గౌరవంగా జీవించే హక్కుల ప్రాముఖ్యతను వివరించారు. ఎవరైనా అనుచితంగా ప్రవర్తించినా, అసభ్యంగా మాట్లాడినా, అసభ్యంగా తాకినా లేదా బెదిరింపులకు పాల్పడినా వెంటనే విశ్వసనీయమైన పెద్దలకు తెలియజేయాలని సూచించారు.
అంతేకాకుండా పాఠశాలల్లో ర్యాగింగ్, బెదిరింపులు, వేధింపులు, ఇంటర్నెట్, సోషల్ మీడియా వినియోగం

లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సైబర్ నేరాలు, వ్యక్తిగత సమాచార భద్రతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. బాలల సమస్యల పరిష్కారానికి చైల్డ్ హెల్ప్‌లైన్ 1098 సేవలను వినియోగించుకోవాలని తెలిపారు.
అర్హులైన వారికి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ద్వారా ఉచిత న్యాయ సహాయం, న్యాయ సలహాలు అందుబాటులో ఉంటాయని వివరించారు. బాలలపై ఎక్కడైనా అన్యాయం, వేధింపులు లేదా దోపిడీ జరిగినట్లు గుర్తిస్తే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని విద్యార్థులకు సూచించారు.ప్రతి బాల్యానికి రక్షణ.. ప్రతి చిన్నారికి భద్రత.. ప్రతి బిడ్డకు హక్కులు అనే నినాదంతో నిర్వహించిన ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో బాలల హక్కులు, చట్టపరమైన రక్షణ, వ్యక్తిగత భద్రతపై అవగాహన కల్పించారు.

యాలాల గ్రామపంచాయతీ నిధులపై డి ఎల్ పి ఓ విచారణ

యాలాల అక్టోబర్ 30 వుదయం ప్రతినిధి :-
యాలాల గ్రామపంచాయతీలో నిధులు నిధులు దుర్వినిగం అయ్యాయని ఫిర్యాదు చేశారు. ఈ మేరకు డిఎల్పిఓ రతన్ సింగ్ పంచాయతీ నిధులపై శనివారం విచారణ జరిపారు. గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ శివయ్య ఉపసర్పంచ్ శోభ రాజు రెడ్డి వార్డు సభ్యులు తదితరులు హాజరయ్యారు. వీరి సమక్షంలో డి ఎల్ పి ఓ రతన్ సింగ్ నిధుల దుర్వినియోగంపై క్షుణ్ణంగా విచారణ జరిపారు. గోవిందరావుపేట గ్రామానికి చెందిన లాలయ్య పంచాయతీ నిధులతో నర్సరీలో అక్రమాలు జరిగాయని ఫిర్యాదు చేశాడు.
సర్పంచ్ వార్డు సభ్యులు లు కార్యదర్శి ఫిర్యాదు దారుడు లాలయ్య సమక్షంలో డిఎల్పి విచారణ చేపట్టారు. విచారం నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని రతన్ సింగ్ తెలిపారు

ర్యాపిడోలో బంగారం పార్సిల్ చోరీ...

- అరవై రెండు వేల విలువైన నగలతో డెలివరీ బాయ్ ఉడాయింపు

హైదరాబాద్
జూబ్లీహిల్స్‌లో వెలుగుచూసిన ఈ ఘటన కలకలం రేపుతోంది. బంజారాహిల్స్ రోడ్ నంబర్2లోని వివో సంస్థలో అడ్మిన్ మేనేజర్‌గా పనిచేస్తున్న దత్త ప్రసాద్ నల్లపాటి..!నాగోల్‌లో ఉంటున్న తన బంధువుల ఇంటికి బంగారు నగలు పంపేందుకు ర్యాపిడో బుక్ చేశారు..!బైక్‌పై వచ్చిన డెలివరీ బాయ్ గీతిమెట్టు మురళి.. సెక్యూరిటీ గార్డు వద్ద పార్సిల్ తీసుకున్నాడు. అందులో రూ.62,383 విలువైన బంగారు మెట్టెలు, రోజ్ గోల్డ్ పట్టీలు ఉన్నాయి..!పార్సిల్ తీసుకున్న అనంతరం పెట్రోల్ ఖర్చుల కోసం మరో రూ.100 కావాలని డెలివరీ బాయ్ అడగడంతో దత్త ప్రసాద్ ఫోన్‌పే ద్వారా పంపించారు. కొద్దిసేపటి తర్వాత రైడర్‌కు ఫోన్ చేయగా అందుబాటులోకి రాలేదు. నాగోల్‌లోని బంధువులను సంప్రదించగా పార్సిల్ చేరలేదని తెలిసింది. తిరిగి ఫోన్ చేయగా రైడర్ తన నంబర్‌ను బ్లాక్ చేసినట్లు గుర్తించారు. కస్టమర్ కేర్‌ను సంప్రదించినా ఫలితం లేకపోవడంతో దత్త ప్రసాద్ జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. రూ.62వేల విలువైన బంగారు నగలతో డెలివరీ బాయ్ మాయమైన ఘటనపై పోలీసులు విచారణ చేపట్టారు..!

పట్టభద్రుల ఓటరు నమోదులో నిర్లక్ష్యం వద్దు!



- అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో ఉండాల్సిందే!
- నవంబర్ 6లోగా నమోదు పూర్తి చేయాలి.. కాంగ్రెస్ శ్రేణులకు చిట్టెం పురుషోత్తం రెడ్డి పిలుపు

గట్టు అక్టోబర్ 31 (వుదయం బ్యూరో)
పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో అర్హులైన ప్రతి పట్టభద్రుడు ఓటరుగా నమోదు కావాలని యూత్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు చిట్టెం పురుషోత్తం రెడ్డి పిలుపునిచ్చారు. గద్వాల నియోజకవర్గంలోని గట్టు మండలం మాచర్ల గ్రామంలో మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు మాచర్ల మహబూబ్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన, యూత్ కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ అడ్డకుల ప్రవీణ్ పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా పురుషోత్తం రెడ్డి మాట్లాడుతూ గ్రామస్థాయిలోని పట్టభద్రులను గుర్తించి, అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకునేలా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు చొరవ చూపాలని సూచించారు. ఓటరు నమోదుపై అవగాహన కల్పించడంలో నిర్లక్ష్యం చేయవద్దని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు మహబూబ్‌నగర్-హైదరాబాద్-రంగారెడ్డి పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ సామ రామ్మోహన్‌రెడ్డికి మద్దతుగా పార్టీ శ్రేణులు క్షేత్రస్థాయిలో సమన్వయంతో పనిచేయా లని కోరారు. నవంబర్ 6లోగా నమోదు పూర్తి చేయాలి పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదుకు అర్హులైన వారు నవంబర్ 6వ తేదీలోగా అవసరమైన ధ్రువపత్రాలతో సంబంధిత మండల తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తులు సమర్పిం చాలని విజ్ఞప్తి చేశారు. ఒక్క అర్హుడూ ఓటు హక్కుకు దూరం కాకుండా చూడాలని పార్టీ శ్రేణులకు సూచించారు. ఈ కార్యక్రమంలో యువ నాయకులు రామకృష్ణ నాయుడు, పటేల్ మధుసూదన్‌రెడ్డి, ఉమర్‌గుల్, తిమ్మప్ప, వడ్ల నర్సింహులు, ఆనంద్, రామకృష్ణ, వినోద్‌కుమార్, శెట్టి మోహన్, శివ, ఆంజనేయులు, బి. రామకృష్ణ, దర్వేష్ అలీ తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌ఎంపీ కరుణాకర్‌పై కఠిన చర్యలు తీసుకోవాలి

- లింగారెడ్డిపల్లి ప్రధాన రహదారిపై గ్రామస్థుల ధర్నా, రాస్తారోకో
- ఆర్‌ఎంపీ వైద్య వృత్తికి సంబంధించిన అనుమతులు రద్దు చేయాలని డిమాండ్

వుదయం, సిద్దిపేట ప్రతినిధి
సిద్దిపేట మున్సిపల్ పరిధిలోని ఒకటో వార్డు లింగారెడ్డిపల్లిలో ఆర్‌ఎంపీ వైద్యుడు కరుణాకర్ మహిళలను లైంగికంగా వేధిస్తూ, బ్లాక్‌మెయిల్‌కు పాల్పడుతున్నాడని ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలో అతడిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ శనివారం గ్రామస్థులు సిద్దిపేట-లింగారెడ్డిపల్లి ప్రధాన రహదారిపై ధర్నా, రాస్తారోకో నిర్వహించారు.కొంతకాలంగా ఆర్‌ఎంపీ కరుణాకర్ వేధింపులతో విసిగిపోయిన ఓ బాధితురాలి భర్త ఆగ్రహంతో కరుణాకర్ ఇంటిపై దాడి చేసి, అక్కడ పార్క్ చేసిన కారుకు నిప్పంటించినట్లు సమాచారం. ఈ ఘటనతో గ్రామంలో ఉద్రిక్తత నెలకొంది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. ఈ ఘటనకు సంబంధించి కరుణాకర్‌పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు వెల్లడించారు. గతంలోనూ అతడిపై లైంగిక వేధింపులకు సంబంధించి కేసులు నమోదయ్యాయని గ్రామస్థులు ఆరోపించారు.ఈ నేపథ్యంలో ఆందోళనకు దిగిన గ్రామస్థులు ఆర్‌ఎంపీ వైద్య వృత్తికి సంబంధించిన అనుమతులు, లైసెన్స్‌ను రద్దు చేయాలని, మహిళలపై వేధింపులకు పాల్పడిన వ్యక్తిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.విషయం తెలుసుకున్న సీఐ మహేందర్ రెడ్డి పోలీసు సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకుని గ్రామస్థులతో మాట్లాడారు. అనంతరం ఆందోళనకారులకు నచ్చజెప్పి ధర్నాను విరమింపజేశారు.

మాక్ పార్లమెంట్‌లో మెదక్ జిల్లా విద్యార్థినికి ప్రథమ స్థానం

- **బెస్ట్ పార్లమెంటేరియన్‌గా ఆర్తి చంద్రకు రాష్ట్రస్థాయి అవార్డు**

మెదక్,నవంబర్,31(వుదయం చిలిపిచెడ్ మండల్ తినిధి):
రాష్ట్రస్థాయిలో నిర్వహించిన మాక్ పార్లమెంట్ కార్యక్రమంలో మెదక్ జిల్లాకు చెందిన శంకరంపేట మోడల్ స్కూల్ విద్యార్థిని బి. ఆర్తి చంద్ర ప్రతిభ చాటుకుని ప్రథమ స్థానంలో నిలిచారు. TGMS శంకరంపేటఆర్ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న ఆర్తి చంద్ర, ఈ పోటీల్లో డిప్యూటీ స్పీకర్‌గా వ్యవహరించి బెస్ట్ పార్లమెంటేరియన్ అవార్డును కైవసం చేసుకున్నారు.రాష్ట్ర వ్యాప్తంగా 33 జిల్లాల నుంచి మొత్తం 66 మంది విద్యార్థులు పాల్గొన్న ఈ కార్యక్రమంలో ఆర్తి చంద్ర తన ప్రతిభ, వాక్చాతుర్యంతో ఆకట్టుకుని రాష్ట్రస్థాయి ప్రథమ బహుమతిని సాధించారు. రాష్ట్రస్థాయిలో నిర్వహించిన అవార్డుల ప్రదానోత్సవంలో తెలంగాణ సమగ్ర శిక్ష జాయింట్ డైరెక్టర్ మదన్‌మోహన్ చేతుల మీదుగా ఆమె అవార్డును అందుకున్నారు.ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖ అధికారి రాజు ఆర్తి చంద్రను ప్రత్యేకంగా అభినందించారు. ఆమెకు మార్గదర్శకత్వం వహించిన గైడ్ టీచర్, పీజీటీ లింగమయ్య, పాఠశాల ప్రిన్సిపాల్‌తో పాటు సహకరించిన సోషల్ ఫోరం బాధ్యులు నర్సింలు, రవి బాబులను ప్రశంసించారు. విద్యార్థిని సాధించిన విజయం మెదక్ జిల్లాకు గర్వకారణమని పేర్కొంటూ పలువురు అభినందనలు తెలిపారు.

నీరు విద్యుత్ వృధాను నివారించండి

- మాజీ ఆర్గనైజింగ్ సెక్రటరీ రాఘవరావు చౌదరి

నారాయణపేట టౌన్ అక్టోబర్31(వుదయం ప్రతినిధి)
ప్రస్తుతం ఎల్ ని నో ప్రభావంతో తీవ్ర నష్టం వాటిల్లే పరిస్థితులు నెలకొంటున్నాయని దీనితో నీటిని విద్యుత్తును వృధా చేయకుండా అధికారులు నివారించాలని తెలుగుదేశం పార్టీ పాలమూరు పార్లమెంటరీ మాజీ ఆర్గనైజింగ్ సెక్రటరీ రాఘవరావు చౌదరి ఒక ప్రకటనలో నారాయణపేట జిల్లా కలెక్టర్ మున్సిపల్ కమిషనర్ నీ కోరారు.
దీనిపై ప్రజలకు అవగాహన కల్పించవలసిందిగా ఆయన సందర్భంగా కోరారు. ప్రజలు అర్థం చేసుకోని కారుని బట్టతో లేదా తడి బట్టతో తుడుచుకోవడం అలానే ఇంట్లో

వరండాలో ఉండే బండల్ని కట్టెతోటి తుడుచుకుంటే కొంత వరకు పొదుపు చేసినవారు అవుతారని ఆయన ప్రజలను సైతం కోరారు. ఎవరైనా నీటిని వృధా చేస్తున్నా లేదా ఇష్టం వచ్చినట్టు వాడుతున్నట్లు తెలిస్తే వెంటనే చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్,మునిసిపల్ కమిషనర్ కి విజ్ఞప్తి చేశారు.

నూతన తహసీల్దార్ గా మల్లెల స్వప్న

అచ్చంపేట, అక్టోబర్ 31 (వుదయం ప్రతినిధి) :
ఉప్పునుంతల మండల నూతన తహసీల్దార్ గా మల్లెల స్వప్న శనివారం బాధ్యతలు స్వీకరించారు.
ఇంతకు ముందు నాగర్ కర్నూల్ డివిజన్ కార్యాలయంలో ఏవోగా విధులు నిర్వహించిన ఆమె, తహసీల్దార్ అద్దంకి సునీత సస్పెన్షన్ అనంతరం ఉప్పునుంతల ఇంచార్జి తహసీల్దార్ గా నియమితులయ్యారు.బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా డిప్యూటీ తహసీల్దార్ వి. రమేష్ నాయక్, మండల అధికారులు, సిబ్బంది ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదుపై బీఆర్ఎస్ నేతల దృష్టి

అర్హులైన పట్టభద్రులందరూ ఓటర్లుగా నమోదు కావాలి..
రాయపర్తి, అక్టోబర్ 31 (వుదయం ప్రతినిధి):

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు నమోదు ప్రక్రియను వేగవంతం చేయడంపై బీఆర్ఎస్ నాయకులు ప్రత్యేక దృష్టి సారించారు. రాష్ట్ర మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ఆదేశాల మేరకు రాయపర్తి మండలంలోని గట్టికల్, ఊకల్, బాలాజీతండా గ్రామాల్లో పార్టీ ముఖ్య నాయకులతో సమీక్ష సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు ప్రాధాన్యత, ఓటరు నమోదుకు అవసరమైన అర్హతలు, నమోదు ప్రక్రియపై నాయకులు చర్చించారు. అర్హత కలిగిన ప్రతి పట్టభద్రుడు ఓటరుగా నమోదు చేసుకునేలా గ్రామస్థాయిలో విస్తృత అవగాహన కల్పిస్తున్నారు. ఎవరూ ఓటు హక్కును కోల్పోకుండా నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ సమావేశాల్లో రాయపర్తి మండల పార్టీ మాజీ అధ్యక్షుడు మునవత్ నర్సింహ నాయక్, మాజీ జడ్పీటీసీ రంగు కుమార్ గౌడ్, మాజీ ప్రధాన కార్యదర్శి పూస మధు, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి ఎలమంచ శ్రీనివాస్ రెడ్డి, గాదె రవీందర్ రెడ్డి, ఆశ్రఫ్ పాషా, సంకినేని ఎల్లస్వామి, బొద్దరంగయ్య, అఖిల్ గౌడ్ తదితరులతో పాటు ఆయా గ్రామాల పార్టీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

సర్దార్ వల్లభాయ్ పటేల్ విగ్రహానికి ఘన నివాళులు.

బాటసారులకు పండ్ల పంపిణీ చేసిన ఆర్యవైశ్య చైతన్య పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు గుండా ప్రభాకర్ గుప్త.
వరంగల్ జిల్లా వుదయం ప్రతినిధి అక్టోబర్ 31.

భారతదేశ ప్రథమ హోంమంత్రి, ఉక్కుమనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ 151వ జయంతిని పురస్కరించుకుని వరంగల్ నగరంలోని నర్సంపేట రోడ్డు కూడలి (వెంకటరామ జంక్షన్) వద్ద ఉన్న ఆయన విగ్రహానికి ఆర్యవైశ్య చైతన్య పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు గుండా ప్రభాకర్ గుప్త ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సర్దార్ వల్లభాయ్ పటేల్ విగ్రహానికి అభిషేకం నిర్వహించి, పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఆ మార్గంలో ప్రయాణిస్తున్న బాటసారులకు పండ్లు పంపిణీ చేశారు. దేశ సమగ్రత, ఐక్యత కోసం సర్దార్ వల్లభాయ్ పటేల్ చేసిన సేవలను ఈ సందర్భంగా స్మరించుకున్నారు.

ఇంకుడు గుంత నిర్మాణానికి శంకుస్థాపన

పర్వతగిరి, అక్టోబర్ 31 (వుదయం ప్రతినిధి):

పర్వతగిరి మండలం, జమాల్ పురం గ్రామంలో పారిశుద్ధ్యంలో భాగంగా ఎంపీడీఓ మాలోత్ శంకర్ నాయక్ తో కలిసి ఇంకుడు గుంత నిర్మాణానికి సర్పంచ్ జున్ను కనుకయ్య యాదవ్ శంకుస్థాపన చేశారు. ఎంపీడీఓ శంకర్ నాయక్ మాట్లాడుతూ...గ్రామంలో ప్రతి ఇంటి ముందు వచ్చే మురుగు నీటిని రోడ్ల పైకి మరియు వృధాగా పోనివకుండా ఇంకుడు గుంతల ద్వారా భూమిలోకి ఇంకించడం వల్ల గ్రామం పరిశుభ్రంగా ఉంటుందని, అదే సమయంలో భూగర్భ జలాలు పెరుగుతాయని తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి ఇంటికి ఇంకుడు గుంత తప్పనిసరిగా నిర్మించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ తో పాటు, ఎంపీడీఓ, పంచాయతీ కార్యదర్శి, ఫీల్డ్ అసిస్టెంట్, లబ్ధిదారుల కుటుంబం తదితరులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి ఫోక్ డాన్స్ విభాగంలో ప్రథమ స్థానం సాధించిన నైన్ పాక విద్యార్థులు

చిట్యాల :అక్టోబర్ 31 (వుదయం ప్రతినిధి)

పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి ఫోక్ డాన్స్ విభాగంలో అద్భుతమైన ప్రతిభ కనబరిచి ప్రథమ స్థానం సాధించినట్లు నైన్ పాక ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సుధాకర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని 12 మండలాల నుండి వచ్చిన విద్యార్థులతో పోటీపడి, గ్రామీణ వాతావరణాన్ని ప్రతిబింబించే పల్లె జానపదాలను గుర్తుచేస్తూ చిట్యాల మండలం నైన్ పాక ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని విద్యార్థులు అద్భుతమైన ఫోక్ డాన్స్ ప్రదర్శించి ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకున్నారు.వీరిని జిల్లా విద్యాశాఖ అధికారి లలిత ప్రత్యేకంగా అభినందించారు.రాష్ట్రస్థాయిలో కూడా ఇదే ప్రతిభను కనబరిచి రాష్ట్రస్థాయిలో జయశంకర్ జిల్లా పేరు నిలబెట్టాలని దీవిస్తూ ఆకాంక్షించారు.పాఠశాల విద్యార్థులకు జయశంకర్ జిల్లా మెంటర్ గా తెలుగు భాష బోధకులు రఘు వ్యవహరించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు ప్రణీత, పల్లవి, ప్రవీణ్ కుమార్, ప్రసాద్, నాగరాజు, రఘునాథ్, శ్రీనివాస్, కోటేశ్వరరావు, ఓదెలు, సీఆర్పీ తిరుపతి మరియు గ్రామస్తులు తదితరులు పాల్గొని విద్యార్థులను అభినందించారు అని ప్రకటనలో పేర్కొన్నారు.

ఘనంగా ఇందిరాగాంధీ వర్ధంతి వేడుకలు

చిట్యాల, అక్టోబర్ 31 (వుదయం ప్రతినిధి):

భారత మాజీ ప్రధాని, ఉక్కు మహిళ దివంగత నేత ఇందిరాగాంధీ 42వ వర్ధంతి సందర్భంగా చిట్యాల మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆమె చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు దబ్బెట అనిల్ మాట్లాడుతూ భారత మాజీ ప్రధాని ఇందిరాగాంధీ దేశ సమగ్రత, అభివృద్ధి కోసం చేసిన కృషి చిరస్థాయిగా నిలిచిపోతుందన్నారు. పేదల సంక్షేమం కోసం బ్యాంకుల జాతీయీకరణ, హరిత విప్లవం, బంగ్లాదేశ్ విమోచనం వంటి సాహసోపేత నిర్ణయాలతో దేశాన్ని ప్రపంచ పటంలో నిలబెట్టారని కొనియాడారు. ఆమె ఆశయాలను కొనసాగించడమే మనందరి బాధ్యత అని పిలుపునిచ్చారు.ఇందిరాగాంధీ చూపిన ధైర్యం, నాయకత్వ లక్షణాలు నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ ఆమె బాటలోనే పయనిస్తుందని, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి దొడ్డి కిష్టయ్య, జిల్లా నాయకులు చిలుకల రాయకొమురు, బుర్ర శ్రీనివాస్ గౌడ్, బుర్ర లక్ష్మణ్ గౌడ్, మాజీ ఎంపీటీసీ గుర్రపు సునీతతిరుపతి, కట్కూరి పద్మనరేందర్, ఉప సర్పంచ్ ల ఫోరం మండల అధ్యక్షులు ముద్దం నాగరాజు, వార్డు సభ్యులు కనిగరపు మొగిలి, తీగల నాగరాజు, కాంగ్రెస్ పార్టీ నాయకులు బొంపెల్లి కిషన్, కొరి మైసయ్య, పింగిలి సతీష్ రెడ్డి, చిలుముల రాజమొగిలి, బుర్ర మల్లేష్, యూత్ కాంగ్రెస్ నాయకులు మోత్కూరి సాయి కృష్ణ, సర్పాక శరత్ కుమార్, పన్నాల శశి పాల్గొన్నారు.

చలో ఢిల్లీ పేరుతో కాంగ్రెస్ రాజకీయ డ్రామా

దేశాన్ని అస్థిరపరిచే ప్రయత్నాలను ప్రజలు తిప్పికొట్టాలి. బీజేపీ జిల్లా ప్రచార కార్యదర్శి బాల్నే జగన్.
వరంగల్ జిల్లా వుదయం ప్రతినిధి అక్టోబర్ 31.

కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ నవంబర్ 1న ఇచ్చిన 'చలో ఢిల్లీ' పిలుపు రాజకీయ ప్రయోజనాల కోసమేనని, దేశాన్ని అస్థిరపరిచే ప్రయత్నంలో భాగమని బీజేపీ జిల్లా ప్రచార కార్యదర్శి బాల్నే జగన్ విమర్శించారు. ఓటు చోరీ జరిగిందంటూ ఆరోపణలు చేస్తున్న కాంగ్రెస్ నాయకులు, ప్రజలను ఢిల్లీ ర్యాలీలకు తరలించడం వెనుక ఉన్న ఉద్దేశం ఏమిటని ఆయన ప్రశ్నించారు. ఈ సందర్భంగా బాల్నే జగన్ మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం దేశాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపిస్తోందన్నారు. ఒకప్పుడు విద్యుత్ కోతలు, సరైన రహదారులు లేని పరిస్థితుల నుంచి నేడు ఆధునిక మౌలిక సదుపాయాలతో భారత్ వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థగా ఎదిగిందని పేర్కొన్నారు. దేశ రక్షణ రంగంలో ఆత్మనిర్భర్ భారత్ ద్వారా స్వదేశీ పరిజ్ఞానంతో ఆయుధాలు, రక్షణ పరికరాల తయారీలో గణనీయమైన పురోగతి సాధించిందన్నారు. భారతీయ పరిశ్రమలు, వ్యాపారవేత్తలు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందుతుండటం దేశానికి గర్వకారణమని తెలిపారు. ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పును గౌరవించకుండా ఈవీఎంలు, ప్రజాస్వామ్య వ్యవస్థలపై కాంగ్రెస్‌తో పాటు ప్రతిపక్షాలు ఆరోపణలు చేయడం సరికాదన్నారు. సరిహద్దు భద్రతను బలోపేతం చేస్తూ అక్రమ వలసలను నియంత్రించే చర్యలు చేపడుతుంటే, ప్రతిపక్షాలు ఓటు బ్యాంకు రాజకీయాలకు ప్రాధాన్యత ఇస్తున్నాయని ఆరోపించారు. ప్రజల మద్దతు కోల్పోయిన కాంగ్రెస్, దాని మిత్రపక్షాలు అభివృద్ధిని అడ్డుకునే రాజకీయాలు చేస్తున్నాయని బాల్నే జగన్ విమర్శించారు.

దేశ అభివృద్ధికి విఘాతం కలిగించే రాజకీయ ప్రయత్నాలను ప్రజలు గమనిస్తున్నారని, అలాంటి చర్యలను ప్రజాస్వామ్య పద్ధతిలో తిప్పి కొడతారని ఆయన అన్నారు.

కాకతీయ యూనివర్సిటీ క్రీడా పోటీల్లో
ప్రభుత్వ డిగ్రీ విద్యార్థుల విజయకేతనం

హ్యాండ్‌బాల్, క్రాస్ కంట్రీ, బెస్ట్ ఫిజిక్ విభాగాల్లో ప్రథమ స్థానాలు.
నర్సంపేట వుదయం ప్రతినిధి అక్టోబర్ 31.

కాకతీయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో వరంగల్‌లోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రాంగణంలో అక్టోబర్ 26 నుంచి 29 వరకు నిర్వహించిన అంతర్ కళాశాలల క్రీడా పోటీల్లో నర్సంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు సత్తా చాటారు. హ్యాండ్‌బాల్, క్రాస్ కంట్రీ, బెస్ట్ ఫిజిక్ విభాగాల్లో ప్రథమ స్థానాలు సాధించి కళాశాలకు కీర్తిప్రతిష్ఠలు తీసుకొచ్చారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ మల్లం నవీన్, ఫిజికల్ డైరెక్టర్ బి. రమేష్ విజేత విద్యార్థులను అభినందించారు. గ్రామీణ ప్రాంతానికి చెందిన ప్రభుత్వ కళాశాల విద్యార్థులు విశ్వవిద్యాలయ స్థాయి పోటీల్లో మూడు విభాగాల్లో ప్రథమ స్థానాలు సాధించడం గర్వకారణమని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించడంఅభినందనీయమని, క్రీడలు క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలు, సమష్టి కృషిని పెంపొందిస్తాయని తెలిపారు. ఈ విజయాలు ఇతర విద్యార్థులకు స్ఫూర్తిగా నిలుస్తాయని అన్నారు. కళాశాలలో విద్యతోపాటు క్రీడలకు కూడా ప్రాధాన్యత ఇస్తున్నామని, గ్రామీణ విద్యార్థుల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను గుర్తించి ప్రోత్సహించేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని వెల్లడించారు. విద్యార్థులకు శిక్షణ, మార్గదర్శకత్వం అందించి ఈ విజయాల్లో కీలకపాత్ర పోషించిన ఫిజికల్ డైరెక్టర్ బి. రమేష్‌ను ప్రిన్సిపాల్‌తో పాటు అధ్యాపకులు ప్రత్యేకంగా అభినందించారు. విజేత విద్యార్థులు భవిష్యత్తులో రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడా పోటీల్లోనూ రాణించి కళాశాలకు, నర్సంపేట ప్రాంతానికి మరింత పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

భారత చరిత్రలో చెరగని అధ్యాయం ఇందిరమ్మ

దేశ సమగ్రత, ఐక్యత కోసం ఆమె చేసిన త్యాగం చిరస్మరణీయం.
పీసీసీ సభ్యులు పెండెం రామానంద్.
నర్సంపేట వుదయం ప్రతినిధి అక్టోబర్ 31.

భారత మాజీ ప్రధాని, ఉక్కు మహిళ శ్రీమతి ఇందిరా గాంధీ 42వ వర్ధంతి వేడుకలను శనివారం నర్సంపేట పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు పంబి వంశీకృష్ణ ఆధ్వర్యంలో స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఇందిరా గాంధీ చిత్రపటానికి తెలంగాణ రాష్ట్ర పీసీసీ సభ్యులు పెండెం రామానంద్ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం పెండెం రామానంద్ మాట్లాడుతూ దేశ సమగ్రత, ఐక్యత కోసం తన జీవితాన్ని అంకితం చేసిన మహోన్నత నాయకురాలు ఇందిరా గాంధీ అని కొనియాడారు. భారత చరిత్రలో ఆమెది చెరగని అధ్యాయమని, దేశ ఐక్యత, సమైక్యత కోసం ఆమె చేసిన త్యాగం యావత్ దేశానికి ఎల్లప్పుడూ స్ఫూర్తిదాయకమని అన్నారు. గరీబీ హటావో' నినాదంతో పేదరిక నిర్మూలనకు ఆమె చేసిన కృషి, బ్యాంకుల జాతీయాకరణ, భూసంస్కరణలు వంటి విప్లవాత్మక నిర్ణయాలు దేశ సామాజిక, ఆర్థిక రంగాలపై విశేష ప్రభావం చూపాయని గుర్తుచేశారు. దేశ రక్షణ, సమగ్రత కోసం ప్రాణత్యాగం చేసిన ఇందిరమ్మ సేవలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు ముత్తినేని వెంకన్న, మాదాసి రవి, ములుకల వినోద సాంబయ్య, కాంపెల్లి వీణ విజేందర్ రెడ్డి, వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి ఎర్ర యాకూబ్ రెడ్డి, నర్సంపేట నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు తుమ్మలపెల్లి సందీప్, మాజీ ప్రజా ప్రతినిధులు కాట ప్రభాకర్, పేరం బాబురావు, రామగౌని సుధాకర్ గౌడ్, పట్టణ కాంగ్రెస్ కార్యదర్శి పిన్నింటి కిరణ్ కుమార్ రెడ్డి,

9వ వార్డు అధ్యక్షుడు మేరుగు కిరణ్ యాదవ్, 25వ వార్డు అధ్యక్షుడు మహాదేవుని రాజ్ వీర్, 25వ వార్డు యూత్ అధ్యక్షుడు కాట అఖిల్, వేముల నవీన్ గౌడ్, గుడికందుల సదానందం, కీసరి రాజీవ్, ముదరబోయిన రాజు, పొలబోయిన ప్రణయ్, నల్గొండ వంశీ, కొలువుల స్వామి, దేశి సాయి పటేల్, కొలువుల పవన్, చీకటి శివమణి, అందే రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

కరువుపై శాస్త్రీయంగా అంచనా వేయని ప్రభుత్వం

వరంగల్ జిల్లాను అత్యంత కరువు జిల్లాగా ప్రకటించాలి.
నవంబర్ 4న కలెక్టరేట్ ఎదుట ఎంసీపీఐ(యు) ధర్నా.
వరంగల్ జిల్లా వుదయం ప్రతినిధి అక్టోబర్ 31.

కరువు పరిస్థితులపై ప్రభుత్వం శాస్త్రీయంగా అంచనా వేయకుండా అశాస్త్రీయంగా కరువు మండలాలను ప్రకటిస్తూ, కరువు తీవ్రతతో ఇబ్బందులు పడుతున్న జిల్లా ప్రజలకు అన్యాయం చేస్తోందని ఎంసీపీఐ(యు) జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్ విమర్శించారు. వరంగల్ జిల్లాను అత్యంత కరువు ప్రాంతంగా ప్రకటించి, తక్షణమే కరువు సహాయక చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. శనివారం వరంగల్ అండర్ బ్రిడ్జి ప్రాంతంలోని ఓంకార్ భవన్‌లో ఎంసీపీఐ(యు) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా 365 కరువు మండలాలను ప్రకటించగా, వాటిలో కేవలం 111 మండలాలను మాత్రమే అత్యంత కరువు మండలాలుగా గుర్తించడం దారుణమన్నారు. వరంగల్ జిల్లాలోని 13 మండలాల్లో కరువు తీవ్రత పెరుగుతున్నట్లు అధికారుల గణాంకాలే స్పష్టం చేస్తున్నప్పటికీ, కేవలం ఎనిమిది మండలాలను మాత్రమే స్వల్ప తీవ్రత కరువు మండలాలుగా ప్రకటించడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. జిల్లాలో సుమారు మూడు లక్షల ఎకరాల్లో రైతులు పంటలు సాగు చేసినప్పటికీ, వర్షాభావ పరిస్థితులతో పంటలు ఎండిపోయి దిగుబడులు తగ్గాయని, పెట్టుబడులు సైతం తిరిగి వచ్చే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మరోవైపు వ్యవసాయ కూలీలు, కార్మికులకు పనులు లేక ఇబ్బందులు పడుతుండగా, నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగి సామాన్య ప్రజలపై ఆర్థిక భారం పడుతోందన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా కరువు పరిస్థితులను శాస్త్రీయంగా అంచనా వేసి వరంగల్ జిల్లాను అత్యంత కరువు జిల్లాగా ప్రకటించాలని, రైతులు, వ్యవసాయ కూలీలను ఆదుకునేందుకు ప్రత్యేక బడ్జెట్ కేటాయించి తక్షణ సహాయక చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ డిమాండ్ల సాధన కోసం నవంబర్ 4న వరంగల్ కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించనున్నట్లు ప్రకటించారు. ఈ సమావేశంలో ఎంసీపీఐ(యు) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు గోనె కుమారస్వామి, కన్నం వెంకన్న, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మాలోతు సాగర్, నర్ర ప్రతాప్, కుసుంబా బాబురావు, భాషపాక రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి కోసం కేటాయించిన ఎస్సీ, ఎస్టీ కులాలకు కేటాయించిన నిధులు

దళితులు, గిరిజనుల సంక్షేమం పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యం ప్రదర్శిస్తోంది.
--బీఆర్ఎస్ పార్టీ పక్షాన ప్రభుత్వాన్ని డిమాండ్ ...పట్టపురం ఏకాంత గౌడ్
- తెలంగాణ రాష్ట్ర గౌడ సంఘం ఉపాధ్యక్షులు, మాజీ ఏఎంసీ డైరెక్టర్
పర్వతగిరి, నవంబర్ 31 (వుదయం ప్రతినిధి):

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి నేటి వరకు ఎస్సీ, ఎస్టీ కులాల అభివృద్ధికి అసెంబ్లీలో కేటాయించిన బడ్జెట్‌కు సంబంధించి ప్రభుత్వం వెంటనే శ్వేతపత్రాన్ని విడుదల చేయాలని తెలంగాణ రాష్ట్ర గౌడ సంఘం ఉపాధ్యక్షులు, మాజీ ఏఎంసీ డైరెక్టర్ పట్టపురం ఏకాంత గౌడ్ డిమాండ్ చేశారు. శనివారం బీఆర్ఎస్ పార్టీ పక్షాన ఆయన పర్వతగిరిలో మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వ తీరుపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఏకాంత గౌడ్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ పాలన ప్రారంభమైనప్పటి నుండి దళితులు, గిరిజనుల సంక్షేమం పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందని ఆరోపించారు. అసెంబ్లీ వేదికగా ఎస్సీ, ఎస్టీ కులాల ప్రత్యేక అభివృద్ధి కోసం కేటాయించిన నిధులు ఏ శాఖలకు మళ్లించారో, ఎక్కడ ఖర్చు చేశారో ప్రభుత్వం ప్రజలకు స్పష్టం చేయాలన్నారు.బడ్జెట్‌లో కేటాయించిన నిధులపై పారదర్శకత ఉండాలని, ప్రభుత్వం తన వద్ద ఉన్న లెక్కలను బయట పెట్టేందుకు ఎందుకు జంకుతోందని ఆయన ప్రశ్నించారు. తక్షణమే ఎస్సీ, ఎస్టీ బడ్జెట్‌పై సమగ్ర వివరాలతో కూడిన శ్వేతపత్రాన్ని విడుదల చేయాలని, లేనియెడల బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో బడుగు, బలహీన వర్గాలను

సమీకరించి రాష్ట్రవ్యాప్త ఆందోళనలు చేపడతామని ఏకాంత గౌడ్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

పట్టభద్రుల ఓటరు నమోదు వివరాలపై సమీక్ష

***అర్హులైన ప్రతి పట్టభద్రుడిని ఓటరుగా నమోదు చేయించాలి**
*** మాజీ ఏఎంసీ డైరెక్టర్ పట్టపురం ఏకాంతం గౌడ్**
పర్వతగిరి , అక్టోబర్ 31 (వుదయం ప్రతినిధి):

వరంగల్ జిల్లా వర్ధన్నపేట నియోజకవర్గంలోని పర్వతగిరి మండలం చింత నెక్కొండ గ్రామంలో మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేష్ సూచనల మేరకు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు వివరాలపై మాజీ ఏఎంసీ డైరెక్టర్ పట్టపురం ఏకాంతం గౌడ్ గూడ నరేందర్ లు సమీక్ష సమావేశం నిర్వహించారు. గ్రామానికి చెందిన మండల మాజీ ఎంపీటీసీ ముద్రబోయిన వాసు అధ్యక్షన ఆయన నివాసంలో జరిగినది. ఈ సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు పాల్గొని గ్రామంలో పట్టభద్రుల ఓటరు నమోదు పరిస్థితిని సమీక్షించారు. మాజీ ఏఎంసీ డైరెక్టర్ పట్టాపురం ఏకాంతం గౌడ్ మాట్లాడుతూ.. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు అత్యంత కీలకమని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి పట్టభద్రుడు ఓటరుగా నమోదు చేసుకునేలా పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు.చింత నెక్కొండ గ్రామంలోని పట్టభద్రుల వివరాలను పరిశీలించి, ఇప్పటివరకు ఓటరుగా నమోదు కాని అర్హులను గుర్తించాలని సూచించారు. అర్హులైన ప్రతి పట్టభద్రుడికి ఓటరు నమోదు ప్రక్రియపై అవగాహన కల్పించాలని అన్నారు. ఈ సమావేశంలో కాట్రోజు రాజు, మాజీ ఉపసర్పంచ్ దర్నోజు దేవేంద్ర చారి , దుగ్యాల కోటేశ్వర్ రావు , జీడీ గట్టయ్య జీడీ ప్రసాద్ , డబ్బేటా నరేష్, భూక్యా వీరన్న , కాసాని మల్లికార్జున్ , గొర్ల వెంకటేశ్వర్లు , ఏరాబాక మహేందర్ , ఐరబోయిన ఐలయ్య ఎర్పుల రాజు , తూర్పటి కృష్ణ ,గాడిదుల అనిల్ ,డాన్ శ్రీనివాస్ , సుమన్,పార్టీ కార్యకర్తలు, పట్టభద్రులు తదితరులు పాల్గొన్నారు.

ఇందిరాగాంధీ వర్ధంతి సందర్భంగా మొక్కలు నాటిన వనప్రేమికుడు సమ్మయ్య.

పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి. మాజీ సర్పంచ్ సుగుణమ్మ.
వరంగల్ జిల్లా నెక్కొండ వుదయం ప్రతినిధి అక్టోబర్ 31.

భారత మాజీ ప్రధాని స్వర్గీయ ఇందిరాగాంధీ వర్ధంతిని పురస్కరించుకుని వరంగల్ జిల్లా నెక్కొండ మండలం గుండ్రపల్లి గ్రామంలో అంతర్జాతీయ హరిత మిత్ర అవార్డు గ్రహీత, వనప్రేమికుడు నల్లగొండ సమ్మయ్య ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. గ్రామ తొలి మహిళా సర్పంచ్ పరకాల సుగుణమ్మ సారయ్య కుటుంబ సభ్యుల సమక్షంలో వారి ఇంటి ఆవరణలో పలు పూలు, పండ్ల మొక్కలను నాటారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ పరకాల సుగుణమ్మ మాట్లాడుతూ ఎల్‌నినో వంటి వాతావరణ పరిస్థితుల ప్రభావాన్ని తగ్గించడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. సమ్మయ్యను స్ఫూర్తిగా తీసుకుని ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని సూచించారు. గుండ్రపల్లి గ్రామంలో సమ్మయ్య స్వయంకృషితో నాటించి సంరక్షించిన మొక్కలు నేడు మహావృక్షాలుగా ఎదిగి గ్రామానికి ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించడం సంతోషంగా ఉందన్నారు. సమ్మయ్య పర్యావరణ సేవలు దేశానికే ఆదర్శమని కొనియాడారు. అనంతరం వనప్రేమికుడు నల్లగొండ సమ్మయ్య మాట్లాడుతూ నాటిన మొక్కలను సంరక్షించి, పోషించే బాధ్యత తనదేనని తెలిపారు. ప్రకృతికి పచ్చదనం అందించి, భావితరాలకు మంచి వాతావరణాన్ని అందించాలనే సంకల్పంతో మొక్కలు నాటుతున్నట్లు పేర్కొన్నారు. ఈసందర్భంగా ఇందిరాగాంధీకి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో భద్రమ్మ, రాము, సులోచన, జీవన, మనోజ్ఞ, కావ్యశ్రీ, రుస్మిత ప్రియా, జాహ్నవి తదితరులు పాల్గొన్నారు.

కాళేశ్వరంపై మాట్లాడే ముందు మీ మూడేళ్ల పాలనలో ఏం చేశారో చెప్పాలి

- కాంగ్రెస్ నాయకులకు బీఆర్ఎస్ పార్టీ సూటి ప్రశ్న
-- రాజకీయ కక్షతోనే రాష్ట్రంలో కరువు తెచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం: బీఆర్ఎస్ నాయకులు బోట్ల మధు
పర్వతగిరి , అక్టోబర్ 31 (వుదయం ప్రతినిధి):

కాళేశ్వరం ప్రాజెక్టును అడ్డుపెట్టి రాజకీయ విమర్శలు చేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులకు బీఆర్ఎస్ పార్టీ గట్టిగా బదులిచ్చింది. కాళేశ్వరంపై మాట్లాడే ముందు మీ మూడేళ్ల పాలనలో తెలంగాణ రాష్ట్రానికి ఏం చేశారో శ్వేతపత్రం విడుదల చేయాలని బీఆర్ఎస్ నాయకులు బోట్ల మధు డిమాండ్ చేశారు. ఈ మేరకు బీఆర్ఎస్ పార్టీ పక్షాన ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా బోట్ల మధు మాట్లాడుతూ.. బీఆర్ఎస్ హయాంలో కాళేశ్వరం, మిషన్ కాకతీయ, రైతుబంధు వంటి పథకాలతో పాటు, ఏ కారణం చేతనైన రైతు మరణిస్తే దినం ఎల్లకముందే 5 లక్షల రైతుబీమా అందించిన ఘనత తమ ప్రభుత్వానిదని గుర్తుచేశారు. కేసీఆర్ ప్రభుత్వంలో దూరదృష్టితో ప్రాజెక్టులను నిర్మించడం వల్లే నేడు సాగునీరు, తాగునీరు, ఆహార నిల్వలు అందుబాటులో ఉండి కాంగ్రెస్ ప్రభుత్వం మూడేళ్ల పరిపాలన కొనసాగుతోందని స్పష్టం చేశారు. ప్రాజెక్టుల్లో తప్పులుంటే నిరూపించాలనితీసుకోవాలని సవాలు విసిరారు. కానీ రాజకీయ కక్షతో తెలంగాణ రైతాంగానికి నీరు అందించకుండా కరువు తీసుకొచ్చింది ముమ్మాటికీ కాంగ్రెస్ ప్రభుత్వమేనని మండిపడ్డారు. ఢిల్లీ పర్యటనల మీద ఉన్న ధ్యాస పాలన మీద లేదని, ప్రకృతి వైపరీత్యాన్ని అడ్డుపెట్టుకొని మాట్లాడుతున్న మాటలు కాంగ్రెస్ ప్రభుత్వ చేతకానితనానికి నిదర్శనమని ఎద్దేవా చేశారు. తెలంగాణ ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తే చూస్తూ ఊరుకోబోమని, దేశంలో కాంగ్రెస్ పార్టీని పాతాళానికి నెట్టివేస్తున్నది ప్రజల కంటికి కనిపించడం లేదా అని బోట్ల మధు నిలదీశారు.

ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు స్కూల్ బ్యాగుల పంపిణీ

విద్యార్థుల భవిష్యత్తుకు దాతల సహకారం అభినందనీయం: మున్సిపల్ చైర్మన్.
వీకే ఫౌండేషన్ కి కృతజ్ఞతలు తెలిపిన ప్రధానోపాధ్యాయుడు పోడెం కాంతారావు.
వరంగల్ జిల్లా నర్సంపేట వుదయం ప్రతినిధి అక్టోబర్ 31.

ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద విద్యార్థులను ప్రోత్సహించాలనే లక్ష్యంతో వసుదైక కుటుంబం (వీకే) ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్కూల్ బ్యాగుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. నర్సంపేట పట్టణంలోని పీఎం శ్రీ ప్రభుత్వ జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో శనివారం ప్రధానోపాధ్యాయులు పోడెం కాంతారావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్‌పర్సన్ పెండెం శ్రీలక్ష్మి రామానంద్, 29వ వార్డు కౌన్సిలర్ వేముల సంధ్య సాంబయ్య గౌడ్, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ సంగెపు స్వరూప ముఖ్య అతిథులుగా హాజరై విద్యార్థులకు స్కూల్ బ్యాగులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు పోడెం కాంతారావు మాట్లాడుతూ.. రాజస్థాన్‌కు చెందిన కోగ్టా ఫైనాన్షియల్ ఇండియా లిమిటెడ్ సంస్థ సహకారంతో వసుదైక కుటుంబం (వీకే) ఫౌండేషన్ దేశంలోని తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నాణ్యమైన స్కూల్ బ్యాగులు, ఇతర విద్యా సామగ్రిని అందజేస్తోందని తెలిపారు. ఇందులో భాగంగా తమ పాఠశాలకు 280 స్కూల్ బ్యాగులను అందించడం సంతోషకరమన్నారు. దాతల సహకారంతో పాటు ఉపాధ్యాయుల మార్గదర్శకత్వంలో విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, తల్లిదండ్రులతో పాటు పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ పెండెం శ్రీలక్ష్మి రామానంద్, కౌన్సిలర్ వేముల సంధ్య సాంబయ్య గౌడ్ మాట్లాడుతూ విద్యార్థుల విద్యాభివృద్ధి కోసం ముందుకొచ్చి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న దాతలను అభినందించారు. ఇలాంటి సహకారాన్ని సద్వినియోగం చేసుకొని విద్యార్థులు విద్యలో రాణించాలని సూచించారు. అందించిన స్కూల్ బ్యాగులను జాగ్రత్తగా వినియోగించుకోవడంతో పాటు భవిష్యత్తులో మరిన్ని అవకాశాలు పొందేలా క్రమశిక్షణతో చదువుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు అరుణకుమారి, బి. రాజేష్, బి. సురేష్ కుమార్, ఎన్. రవీందర్ రెడ్డి, ఏ. రవి, ఎస్. మల్లయ్య, ఎం. రమేష్, ఏ. సుజాత,

ఎమ్మెల్సీ ఓటరు నమోదులో జోరు పెంచిన బీఆర్ఎస్

- ప్రతి పట్టభద్రుడిని ఓటరుగా చేర్పించడమే లక్ష్యంగా అన్నారం షరీఫ్‌లో బీఆర్ఎస్ భారీ సమీక్షా సమావేశం
మాజీ పిఎసిఎస్ చైర్మన్ ఎం. మనోజ్ గౌడ్
- ఎర్రబెల్లి దయాకర్ రావు, ఆరూరి రమేష్‌ల ఆదేశాల మేరకు ముమ్మరంగా ఓటరు నమోదు డ్రైవ్
-పర్వతగిరి,అక్టోబర్ 31 (వుదయం ప్రతినిధి):

రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికలను లక్ష్యంగా చేసుకుని బీఆర్ఎస్ పార్టీ క్షేత్రస్థాయిలో గులాబీ శ్రేణులను సమాయత్తం చేస్తోంది. వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం అన్నారం షరీఫ్ గ్రామంలో పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియపై నిర్వహించిన ప్రత్యేక సమీక్షా సమావేశం స్థానికంగా ప్రాధాన్య సంతరించుకుంది. బీఆర్ఎస్ పార్టీ మాజీ మంత్రివర్యులు ఎర్రబెల్లి దయాకర్ రావు, మాజీ శాసనసభ్యులు ఆరూరి రమేష్‌ల ప్రత్యేక ఆదేశాల మేరకు... అన్నారం గ్రామానికి చెందిన మాజీ పిఎసిఎస్ చైర్మన్ ఎం. మనోజ్ గౌడ్ నివాసంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో ఈ కీలక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ పిఎసిఎస్ చైర్మన్ ఎం. మనోజ్ గౌడ్ పార్టీ శ్రేణులను ఉద్దేశించి మాట్లాడుతూ... ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టభద్రులు తమ ఓటు హక్కును వదులుకోకుండా, అర్హులైన ప్రతి ఒక్కరినీ ఓటరుగా నమోదు చేయించాలని పిలుపునిచ్చారు. అన్నారం. పట్టభద్రుల గొంతును బలంగా వినిపించేందుకు ఈ ఓటరు నమోదును ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని కోరారు. ఈ సమీక్షా సమావేశంలో మాజీ కోఆప్షన్ మెంబర్ షబ్బీర్ అలీ, కర్ణాటక నర్సింగం, ఎం.డి. పాషా, ముంజంపెల్లి యాకాంభ్రం, సముద్రాల వెంకన్న, గడ్డం యాకాంభ్రం, సోమరాపు రాజు, పస్తం సుధాకర్ తదితర నాయకులు, పాల్గొన్నారు.

చక్కని ఆరోగ్యం

హెపటైటిస్ బి వ్యాధిగ్రస్తులకు కొత్త ఔషధం..

దీర్ఘకాలిక హెపటైటిస్ బి వ్యాధితో బాధపడుతున్న కొందరు రోగులు యాంటీవైరల్ మందులను నిలిపివేసిన తర్వాత కూడా వైరస్‌ను నియంత్రణలో ఉంచుకునే అవకాశం కల్పించే కొత్త చికిత్సకు అమెరికా ఆహార, ఔషధ నియంత్రణ సంస్థ (ఎఫ్‌డీఏ) ఆమోదం తెలిపింది. జీఎస్‌కే సంస్థ అభివృద్ధి చేసిన హిబ్‌సాగో (బెపిరోవిర్సెన్) అనే ఇంజెక్షన్ మందును ఈ వ్యాధితో బాధపడుతున్న నిర్దిష్ట వయోజనులకు వినియోగించేందుకు అనుమతించింది. హెపటైటిస్ బి చికిత్సలో ఈ తరహా జన్యు సమాచారాన్ని లక్ష్యంగా చేసుకునే విధానానికి ఎఫ్‌డీఏ నుంచి ఆమోదం లభించడం ఇదే తొలిసారి. వైరస్ వృద్ధి చెందడానికి, వైరల్ ప్రోటీన్లు ఉత్పత్తి కావడానికి అవసరమైన జన్యు సూచనలకు అంతరాయం కలిగించడం ద్వారా ఈ మందు పనిచేస్తుంది. కాలేయంలో సిరోసిస్ లేని, కనీసం ఆరు నెలలుగా యాంటీవైరల్ చికిత్స పొందుతూ రక్తంలో హెపటైటిస్ బి

బి చికిత్స మొత్తాన్ని నిలిపివేసిన 24 వారాల తర్వాత కూడా కొత్త మందు పొందిన వారిలో 19 శాతం మందికి వైరస్ నియంత్రణలో ఉన్నట్లు గుర్తించారు. వారి రక్తంలో హెపటైటిస్ బి ఉపరితల యాంటిజెన్‌ను కూడా గుర్తించలేదు. అయితే, ఈ ఫలితం అందరికీ వర్తించదని, ఎక్కువ మంది రోగులు చికిత్స నిలిపివేసిన తర్వాత ఇదే స్థాయి నియంత్రణను సాధించలేదని అధికారులు స్పష్టం చేశారు. ఈ మందుతో తీవ్రమైన కాలేయ సమస్యలు, రక్తంలో ప్లేట్‌లెట్ల సంఖ్య తగ్గడం వంటి ప్రమాదాలు ఉన్నాయని ఎఫ్‌డీఏ హెచ్చరించింది. ప్లేట్‌లెట్లు తగ్గడం వల్ల ప్రాణాపాయం కలిగించే రక్తస్రావం జరిగే అవకాశం ఉంటుంది. మూత్రపిండాల పనితీరు క్షీణించడం, రక్తనాళాల్లో వాపు వంటి తీవ్రమైన ప్రతిచర్యలు కూడా సంభవించే అవకాశాలు ఉంటాయి.

ఈ చికిత్స తీసుకునే రోగులకు మందు వాడకానికి



వైరస్ స్థాయిలు నియంత్రణలో ఉన్న వయోజనులకు మాత్రమే ఈ చికిత్స వర్తిస్తుంది. అలాగే రక్తంలో హెపటైటిస్ బి ఉపరితల యాంటిజెన్ స్థాయి ఒక మిల్లీలీటర్‌కు 3,000 అంతర్జాతీయ యూనిట్లు లేదా అంతకంటే తక్కువగా ఉండాలి. ఈ అర్హతను నిర్ధారించేందుకు అనుమతి పొందిన ప్రత్యేక పరీక్షను ఉపయోగిస్తారు. రెండు వైద్య ప్రయోగాల్లో ఈ మందును పరిశీలించారు. రోగులకు 24 వారాల వరకు చర్మం కింద ఇంజెక్షన్లు ఇవ్వడంతోపాటు, వారు అప్పటికే వాడుతున్న యాంటీవైరల్ మందులను కొనసాగించారు. చివరి ఇంజెక్షన్ తర్వాత కూడా కనీసం మరో 24 వారాల పాటు సాధారణ చికిత్స కొనసాగించాల్సి వచ్చింది. నిర్దిష్ట వైద్య, ప్రయోగశాల ప్రమాణాలను చేరుకున్న కొందరు రోగులకు ఆ తర్వాత యాంటీవైరల్ మందులను నిలిపివేసేందుకు అనుమతించారు. రెండు ప్రయోగాలను కలిపి పరిశీలించినప్పుడు, కొత్త మందు తీసుకున్న వారిలో 24 శాతం మంది తమ పాత యాంటీవైరల్ చికిత్సను నిలిపివేయడానికి అవసరమైన ప్రమాణాలను చేరుకున్నారు. పోలిక కోసం మందు బదులుగా ప్లాసీబో తీసుకున్నవారిలో ఒక్కరూ ఈ ప్రమాణాలను చేరుకోలేదు. హెపటైటిస్

ముందు, చికిత్స సమయంలో క్రమం తప్పకుండా రక్త పరీక్షలు, వైద్య పర్యవేక్షణ అవసరం. ఇంజెక్షన్ ఇచ్చిన చోట ప్రతిచర్యలు, జ్వరం, అలసట, తలనొప్పి వంటి దుష్ప్రభావాలు ఎక్కువగా నమోదయ్యాయి. అర్హులైన రోగులను గుర్తించేందుకు, చికిత్సను పర్యవేక్షించేందుకు రోష్ సంస్థ అభివృద్ధి చేసిన అనుబంధ నిర్ధారణ పరీక్షకూ ఎఫ్‌డీఏ అనుమతిచ్చింది. ఈ మందుకు వేగవంతమైన సమీక్ష, ప్రాధాన్య సమీక్షతోపాటు ప్రత్యేక చికిత్సా గుర్తింపులు కూడా లభించాయి. అయితే, అమెరికా వెలుపల, ముఖ్యంగా భారత్‌లో ఈ మందు ఎప్పటి నుంచి అందుబాటులోకి వస్తుందనే విషయాన్ని అధికారులు వెల్లడించలేదు. హెపటైటిస్ బి అనేది కాలేయాన్ని ప్రభావితం చేసే దీర్ఘకాలిక వైరల్ సంక్రమణ. దీన్ని నియంత్రించకపోతే కాలేయ సిరోసిస్, కాలేయ క్యాన్సర్ వంటి సమస్యల ప్రమాదం పెరుగుతుంది. అందువల్ల టీకాలు వేయించుకోవడం, వ్యాధిని ముందుగానే గుర్తించేందుకు పరీక్షలు చేయించుకోవడం, అవసరమైన చికిత్స పొందడం వ్యాధి నియంత్రణలో కీలకమని వైద్య రంగ నిపుణులు సూచిస్తున్నారు.

చేపలు తినని వారికి గుడ్‌న్యూస్..

గుండె పనితీరుని మెరుగ్గా ఉంచడం, నాడీ కణాలకు రక్షణ పొరను నిర్మించడం, రక్తనాళాల్లో పేరుకుపోయిన చెడు కొలెస్ట్రాల్, ప్లేట్‌లెట్స్, క్యాల్షియం లాంటి వాటిని తీసేయడానికి ఒమేగా 3 ఫ్యాటీ యాసిడ్స్ ఉపయోగపడతాయి. ఒమేగా 3 ఫ్యాటీ యాసిడ్స్ లోపం లేకుండా ఉండాలంటే చేపలు బాగా తినాలని చాలామంది సలహాలిస్తారు. చేపల్లో ఒమేగా 3 ఫ్యాటీ యాసిడ్స్ ఉండేది నిజమే. కానీ, వాటిల్లోనే ఉంటుందని, అధికంగా ఉంటుందనేవి భ్రమలే. వంద గ్రాముల చేపలో 2.5 నుంచి 3 గ్రాములే ఒమేగా 3 ఫ్యాటీ యాసిడ్స్ ఉంటాయి. మార్కెట్లో తక్కువ ధరలో ఉండే మెంతి కూర, మునగాకు, అవిసె గింజల్లో అంతకంటే ఎక్కువ మోతాదులో ఒమేగా 3 ఫ్యాటీ యాసిడ్స్ ఉంటాయి. వంద గ్రాముల అవిసె గింజల్లో 22 గ్రాములు, చియా గింజల్లో 17 గ్రాములు, వాల్‌నట్స్‌లో 9 గ్రాముల వరకు ఒమేగా 3 ఫ్యాటీ యాసిడ్స్ ఉంటాయి. కాబట్టి చురుకైన మెదడు, గుండె ఆరోగ్యం కోసం చేపలు తింటే మంచిది. తినకపోతే ప్రమాదం అనేది అవాస్తవం. ఏది తిన్నా ఒమేగా 3 ఫ్యాటీ యాసిడ్స్ ఉండే ఆహారం వారానికి రెండు రోజులు తీసుకుంటే మంచిది. చేపలు తింటే గుండె ఆరోగ్యానికి మేలు అన్నది నిజమే. కానీ, చేపలు తినని వాళ్లకు నష్టమన్నదాంట్లో నిజం లేదు.

పచ్చికొబ్బరి తింటే ఆరోగ్యానికి ఎంతో మేలు..

తరచూ పచ్చి కొబ్బరి (Raw Coconut) తింటే ఆరోగ్యానికి ఎంతో మేలు జరుగుతుందని నిపుణులు చెబుతున్నారు. కొంతమంది పచ్చికొబ్బరిని చాలా ఇష్టంగా తింటారు. అల్పాహారాల్లో చట్నీగా, తీపి వంటకాల్లో పచ్చి కొబ్బరిని వినియోగిస్తుంటారు. చక్కెరగానీ, బెల్లంగానీ కలుపుకుని కూడా తింటుంటారు. అయితే కొంతమంది మాత్రం దగ్గు వస్తుందని, బరువు పెరుగుతామని ఈ పచ్చి కొబ్బరిని దూరం పెడుతారు. కానీ నిపుణులైతే పచ్చి కొబ్బరితో లాభాలే తప్ప నష్టాలు లేవని చెబుతున్నారు. పచ్చి కొబ్బరిని తరచూ తగిన మోతాదులో తీసుకుంటే చాలా అనారోగ్య సమస్యలు దూరమవుతాయంటున్నారు. పచ్చికొబ్బరి యాంటీ బయోటిక్‌గా పని చేస్తుందని, శరీరంలో రోగనిరోధక శక్తిని పెంచుతుందని అంటున్నారు. పచ్చి కొబ్బరితో ఉండే ఆ లాభాలేమిటో ఇప్పుడు తెలుసుకుందాం..పచ్చికొబ్బరిని వీలైనప్పుడల్లా తింటూ ఉంటే మనలో రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. దాంతో శరీరం వైరస్, బ్యాక్టీరియాలతో సమర్థంగా పోరాడుతుంది. ఇన్‌ఫెక్షన్‌ల బారినపడే ప్రమాదం తప్పుతుంది.

పచ్చి కొబ్బరిని తరచూ తీసుకోవడంవల్ల శరీరంలో మంచి కొలెస్ట్రాల్ స్థాయిలు పెరుగుతాయి. దాంతో రక్తంలో ఎలాంటి మలినాలు ఏర్పడవు. గుండె కూడా ఆరోగ్యంగా ఉంటుంది.

పచ్చికొబ్బరిలో పీచు పదార్థం (ఫైబర్) ఎక్కువగా ఉంటుంది. కాబట్టి తిన్న ఆహారం త్వరగా జీర్ణమవుతుంది. దాంతో జీర్ణ సమస్యలు కూడా త్వరగా రావు. అలాగే మలబద్ధకం సమస్య కూడా తగ్గుతుంది.

చాలామంది థైరాయిడ్ సమస్యతో బాధపడుతూంటారు. ఇలాంటి వారికి పచ్చికొబ్బరి బాగా సాయపడుతుంది. పచ్చికొబ్బరిలో ఉండే పోషకాలు థైరాయిడ్‌ను తగ్గిస్తాయి. తరచూ పచ్చికొబ్బరి తినడంవల్ల మెదడు ఆరోగ్యంగా పని చేస్తుంది. అల్జీమర్స్ లాంటి సమస్యలు రాకుండా ఉంటాయి. ఎదిగే పిల్లలకు పచ్చికొబ్బరి చాలామేలు చేస్తుంది. పచ్చికొబ్బరిలో వారికి కావాల్సిన పోషకాలు అందుతాయి. దాంతో పిల్లల్లో ఎదుగుదల చక్కగా ఉంటుంది. రక్తహీనత సమస్య తగ్గుతుంది. అలాగే చిన్న వయసులోనే ఎముకలు, కండరాలు గట్టిపడతాయి. కావాల్సిన శక్తి లభిస్తుంది. చర్మం, కేశాల ఆరోగ్యం పచ్చికొబ్బరి తరచూ తినడంవల్ల చర్మం, కేశాలు ఆరోగ్యంగా ఉంటాయి. చర్మం కాంతివంతమవుతుంది. వృద్ధాప్య ఛాయలు దరి చేరకుండా ఉంటాయి. జుట్టు రాలడం ఆగిపోతుంది.

మహిళలకే కాదు.. పురుషులకూ గర్భనిరోధక మాత్ర?..

త్వరలో పురుషులకు కూడా గర్భనిరోధక మాత్ర అందుబాటులోకి రానుంది. ఈ దిశగా అమెరికా శాస్త్రవేత్తలు పరిశోధనలు సాగిస్తున్నారు. లైంగిక చర్యకి సుమారు 30 నిమిషాల ముందు ఈ మాత్ర తీసుకుంటే, ఆరు నుంచి ఎనిమిది గంటల పాటు వీర్య

కణాలను తాత్కాలికంగా అడ్డుకునేలా చేస్తుంది. అమెరికాలోని వెయిల్ కార్నెల్ మెడిసిన్ పరిశోధకులు ఈ ప్రాజెక్టుపై పనిచేస్తున్నారు.వీర్య కణాల కదలికకు అవసరమైన సాల్యూబుల్ అడెనైలిల్ సైక్లేజ్ (ఎస్‌ఏసీ) అనే ఎంజైమ్ పనితీరును ఈ ఔషధం తాత్కాలికంగా అడ్డుకుంటుంది. దీంతో వీర్య కణాలు అండాన్ని చేరి, ఫలదీకరణం జరిపే అవకాశాన్ని తగ్గించవచ్చని భావిస్తున్నారు. ఎలుకలపై నిర్వహించిన ప్రాథమిక పరిశోధనల్లో ఈ విధానం గర్భధారణను తాత్కాలికంగా నిరోధించినట్లు గుర్తించారు. ఔషధ ప్రభావం తగ్గిన తర్వాత సంతానోత్పత్తి సామర్థ్యం సాధారణ స్థితికి వచ్చినట్లు పరిశోధకులు తెలిపారు.

జుంబాతో... జోష్!

పెళ్లీ, పిల్లలు తర్వాత మహిళల శరీరంలో అనేక మార్పులు మొదలవుతాయి. కానీ ఫిట్‌నెస్ కోసం జిమ్‌కి వెళ్లడం, ఎక్సర్‌సైజ్ చేయడానికి తమకంటూ సమయమే దొరకదు. అలాంటివారి కోసం పాట, డ్యాన్స్‌తో మీలోని చెమటతోపాటు ఒత్తిడినీ బయటికి పంపేయొచ్చు... 'జుంబా డ్యాన్స్' ద్వారా! జుంబాలో బరువులు ఎత్తక్కర్లేదు, కష్టమైన ఎక్సర్‌సైజ్‌లు చేయక్కర్లేదు. డ్యాన్స్ రావాల్సిన అవసరమూ లేదు. శరీర భాగాలు అన్నింటిలో కదలికలు ఉండేలా పాటలు పెట్టుకుని సరదాగా డ్యాన్స్ చేయడమే. ఒంటరిగా కాకుండా గ్రూప్‌గా చేసినప్పుడు మరింత ఉత్సాహం వస్తుంది. సాధారణంగా మహిళల్లో బిడియం ఎక్కువగా ఉంటుంది, ఇలా అందరితో కలిసి డ్యాన్స్ చేయడంతో అది పోతుంది,.పైగా కొత్త స్నేహితులూ పరిచయం అవుతారు.

దీనికోసం ఎక్కువ సమయం కేటాయించాల్సిన పనీ లేదు. రోజుకు గంట చొప్పున, వారానికి 3 రోజులు చేసినా సరిపోతుంది. దీనివల్ల శరీరంలో గంటకు సుమారు 400 కెలోరీలు ఖర్చవుతాయి కానీ, అలసటే తెలియదు. పాటలు, స్టెప్పులతో సరదాగా సాగిపోతుంది.

జుంబా అంటే వ్యాయామం మాత్రమే కాదు. ఇంట్లో పని, ఆఫీస్ ఒత్తిడితో అలసిపోయిన మహిళలకు ఇది మంచి రిలీఫ్. దీనివల్ల హ్యాపీ హార్మోన్లు విడుదలవుతాయి, అందువల్ల ఒత్తిడీ తగ్గుతుంది. ఇది చేయడానికి వయసుతో సంబంధం లేదు. 50 ఏళ్లు ఉన్నవారు కూడా దీన్ని స్లోగా చేయవచ్చు. దీన్నే 'జుంబా గోల్డ్' అంటారు. దీనివల్ల శరీర బరువుతో పాటు కండరాల నొప్పులు తగ్గుతాయి. రక్త ప్రసరణ మెరుగుపడుతుంది. మనసుకి

ప్రశాంతంగా అనిపిస్తుంది. రోజంతా ఉత్సాహంగా ఉంటారు. మంచి నిద్ర కూడా పడుతుంది. పీసీఓడీ, పీసీఓఎస్ ఉన్న మహిళల్లో హార్మోన్ల సమతుల్యతకు తోడ్పడుతుంది. జుంబాలో పొట్టను, నడుమును ఎక్కువగా కదిలిస్తారు. దీంతో కోర్ కండరాలు బలపడతాయి. ఇది డెలివరీ తర్వాత వచ్చే బెల్లీని తగ్గించడానికి బాగా ఉపయోగపడుతుంది.

యువతను అధికంగా వేధిస్తున్న నడుము నొప్పి సమస్య..

ఈ మధ్యకాలంలో యువతను కూడా నడుము నొప్పి వేధిస్తోంది. మొదట్లో అప్పుడప్పుడు వచ్చే అసౌకర్యంగా కనిపించే ఈ సమస్య, క్రమంగా రోజువారీ పనులకు ఆటంకం కలిగిస్తోంది. వంగడం, శరీరాన్ని సాగదీయడం, ఎక్కువసేపు నిలబడడం వంటి పనులు చేసినప్పుడు నొప్పి తీవ్రమవుతోంది. ఎక్కువసేపు ప్రయాణించడం, కార్యాలయానికి వెళ్లేటప్పుడు సంచులు మోయడం వల్ల కాళ్లలో నొప్పి, తిమ్మిరి వంటి సమస్యలు కూడా ఎదురవుతున్నాయి.

బరువైన వస్తువులను ఎత్తినప్పుడు నొప్పి మరింత పెరుగుతోంది. నొప్పిని నిర్లక్ష్యం చేస్తూ పనులు కొనసాగిస్తే, చివరకు సాధారణ పనులు చేయడం కూడా కష్టమవుతుంది. యోగా, తేలికపాటి వ్యాయామాలు కొంత ఉపశమనం కలిగిస్తాయి. అందువల్ల వెన్నెముక ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టడం అవసరం. సాధారణంగా నడుము నొప్పి వయసు పెరిగినవారిలో ఎక్కువగా కనిపిస్తుందని భావిస్తారు. అయితే

ప్రస్తుతం నలభై ఏళ్లలోపు యువత కూడా వెన్నెముక సమస్యలతో వైద్య పరీక్షలు చేయించుకుంటున్నారు. మహాజన్ ఇమేజింగ్ అండ్ ల్యాబ్స్ గణాంకాల ప్రకారం, 2025 సెప్టెంబర్ నుంచి 2026 సెప్టెంబర్ వరకు నమోదైన 29,532 వెన్నెముక పరీక్షల్లో 6,925 పరీక్షలు, అంటే సుమారు 23.5 శాతం, నలభై ఏళ్లలోపు వారికే జరిగాయి. అరవై ఏళ్లు పైబడినవారిలో 39 శాతం, నలభై నుంచి అరవై ఏళ్ల మధ్య వయసువారిలో సుమారు 37 శాతం పరీక్షలు నమోదయ్యాయి. ఎక్కువసేపు కూర్చోవడం, సుదీర్ఘ ప్రయాణాలు, శారీరక శ్రమ లేకపోవడం, కార్యాలయాల్లో సరైన కూర్చునే సౌకర్యాలు లేకపోవడం నడుము నొప్పికి కారణమవుతాయి. కండరాలపై ఒత్తిడి, వెన్నెముకలోని డిస్కులకు సంబంధించిన సమస్యలు కూడా నొప్పిని కలిగిస్తాయి. నడుము నొప్పి వచ్చిన ప్రతిసారీ ఎక్స్‌రే లేదా ఎంఆర్ఐ పరీక్షలు చేయించుకోవాల్సిన అవసరం లేదని నిపుణులు చెబుతున్నారు. రోగి లక్షణాలు, వైద్య చరిత్ర, వైద్య పరీక్షల ఆధారంగా ఈ పరీక్షలు అవసరమా లేదా అనేది నిర్ణయించాలి. ఎక్కువసేపు ఒకే భంగిమలో కూర్చోకుండా మధ్యమధ్యలో లేచి నడవడం, పని చేసే ప్రదేశంలో కూర్చునే విధానాన్ని సరిచేసుకోవడం, క్రమం తప్పకుండా శారీరక శ్రమ చేయడం, కండరాలను బలోపేతం చేసే వ్యాయామాలు చేయడం ద్వారా వెన్నెముక ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు. నొప్పి నిరంతరంగా ఉండడం లేదా తరచూ తిరిగి రావడం వంటి పరిస్థితుల్లో నొప్పి నివారణ మందులపైనే ఆధారపడకుండా వైద్యులను సంప్రదించాలి. క్రమంగా పెరుగుతున్న బలహీనత, తీవ్రమైన తిమ్మిరి, మూత్ర లేదా మల విసర్జన నియంత్రణలో మార్పులు కనిపిస్తే వెంటనే వైద్య సహాయం పొందాలి. ప్రపంచ ఆరోగ్య సంస్థ అంచనాల ప్రకారం, 2020లో ప్రపంచవ్యాప్తంగా సుమారు 61.9 కోట్ల మంది నడుము కింది భాగంలో నొప్పితో బాధపడ్డారు. అంటే ప్రపంచవ్యాప్తంగా ప్రతి 13 మందిలో ఒకరు ఈ సమస్యను ఎదుర్కొన్నారు. 2050 నాటికి బాధితుల సంఖ్య 84.3 కోట్లకు చేరవచ్చని అంచనా. ప్రపంచవ్యాప్తంగా వైకల్యానికి ప్రధాన కారణంగా నడుము కింది భాగంలో వచ్చే నొప్పి గుర్తించబడింది. ఈ సమస్య వల్ల కదలికలు తగ్గడంతోపాటు రోజువారీ పనులు, ఉద్యోగ నిర్వహణ కూడా ప్రభావితమవుతాయి. 2012లో ఆర్థరైటిస్ అండ్ రుమాటిజం జర్నల్‌లో ప్రచురితమైన సమీక్షలో 54 దేశాలకు చెందిన 165 అధ్యయనాలను పరిశీలించారు. ఏ సమయంలోనైనా 11.9 శాతం మందికి నడుము కింది భాగంలో నొప్పి ఉంటుందని, ఒక నెల వ్యవధిలో 23.2 శాతం మంది ఈ సమస్యను అనుభవిస్తారని ఆ సమీక్ష అంచనా వేసింది. యువతలోనూ ఈ సమస్యను నిర్లక్ష్యం చేయకుండా, నొప్పికి కారణాన్ని గుర్తించి తగిన వైద్య సలహా తీసుకోవడం ముఖ్యమని నిపుణులు తెలియజేస్తున్నారు.

గుండె ఆరోగ్యంగా ఉండాలంటే చికెన్‌లో ఆ పార్టును అస్సలు తినొద్దు తెలుసా..?

చికెన్ లో ప్రొటీన్‌లు పుష్కలంగా ఉంటాయి. నాన్ వెజ్ ప్రియులు అత్యంత ఇష్టంగా చికెన్ తింటారు. డైట్ చేసేవాళ్లు తమ డైట్‌లో చికెన్‌ను భాగం చేసుకుంటారు. అయితే వాళ్లు ఫ్రైడ్ చికెన్ కాకుండా గ్రిల్డ్ చికెన్ తింటారు. ఈ చికెన్‌లో ఫారమ్ చికెన్ కంటే నాటు కోడి చికెన్ మంచిది. అయితే నాటు కోళ్ల లభ్యత తక్కువగా ఉండటం, ధర అధికంగా ఉండటం లాంటి కారణాలవల్ల ఎక్కువ మంది ఫారమ్ చికెన్‌కే మొగ్గు చూపుతారు. ఈ ఫారమ్ చికెన్‌లో కొన్ని భాగాలు తినకూడదని, అవి ఆరోగ్యానికి మంచిది కాదని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. మరి చికెన్‌లో ఆరోగ్యానికి మంచివి కాని భాగాలేవో ఇప్పుడు తెలుసుకుందాం.. చికెన్‌లో ఆరోగ్యానికి అత్యంత కీడు చేసేది చర్మం. కోడి చర్మం తినడం ఆరోగ్యానికి అస్సలు మంచిది కాదు. దానిలో కొవ్వు శాతం

ఎక్కువగా ఉంటుంది. అది గుండెకు ప్రమాదకరం. అంతేగాక చికెన్ తాజాగా ఉండేందుకు రసాయనాలు కలిపే అవకాశం ఉంది. కాబట్టి చర్మాన్ని తినడంవల్ల ఆ రసాయనాలు కూడా మన బాడీలో చేరుతాయి. ఇది రకరకాల అనారోగ్యాలకు దారితీసే ప్రమాదం ఉంది. అందుకే కార్డియాలజిస్టులు చికెన్ తక్కువగా తినాలని, తిన్నా స్కిన్ అస్సలు తినకూడదని సలహా ఇస్తారు. చికెన్ స్కిన్‌లో అసంతృప్త కొవ్వులు, కేలరీలు ఎక్కువగా ఉంటాయని, అధిక రక్తపోటు ఉన్నవారికి ఇది ప్రమాదకరమని చెబుతుంటారు. కోడి చర్మం ఆరోగ్యానికి ప్రమాదకరమే అయినా అత్యంత అరుదుగా తీసుకుంటే మేలు చేస్తుందని నిపుణులు చెబుతున్నారు. కోడి చర్మంలో ఒమేగా 3, ఒమేగా 6 కొవ్వులు ఉంటాయని, ఇవి ఆరోగ్యానికి మేలు చేస్తాయని అంటున్నారు. కాబట్టి గుండె జబ్బులు లేనివాళ్లు అరుదుగా నెలకు ఒకటి రెండు సార్లు స్కిన్‌తో కూడిన చికెన్ తింటే ఆరోగ్యానికి మంచిదేనట. కానీ అంతకు మించితే మాత్రం శరీరంలో బ్యాడ్ కొలెస్ట్రాల్ పేరుకుపోయే ప్రమాదం ఉందట. చికెన్ బ్రెస్ట్ భాగంలో కొవ్వు తక్కువగా, ప్రొటీన్లు ఎక్కువగా ఉంటాయి. కాబట్టి కోడి ఛాతి మాంసం ఆరోగ్యానికి మంచిది. ఇది బరువును నియంత్రించడంలో కూడా తోడ్పడుతుంది. కండరాల పుష్టికి కూడా చికెన్ బ్రెస్ట్ మంచిది. చికెన్ తొడ మాంసం కూడా మంచిదే అయినా బ్రెస్ట్ మాంసం కంటే శ్రేష్ఠం కాదు. ఎందుకంటే బ్రెస్ట్ మాంసం కంటే తొడ మాంసంలో కొవ్వు ఎక్కువగా ఉంటుంది. అదేవిధంగా చికెన్ వింగ్స్‌లో కూడా కొవ్వు ఎక్కువగా ఉంటుంది. కేలరీలు కూడా ఎక్కువ ఉంటాయి. కాబట్టి వీటిని ఫ్రైస్ లాగా కాకుండా గ్రిల్ చేసుకుని తినడం మంచిది.

శారీరకంగా అలసిపోయినా కొందరికి నిద్ర పట్టదు..

శారీరకంగా చాలా అలసిపోయినప్పటికీ కొంతమందికి రాత్రిపూట నిద్ర పట్టదు. దీనికి కారణం శరీరం అలసిపోవడం ఒక్కటే నిద్ర రావడానికి సరిపోకపోవడమే. మెదడు నిద్రకు సిద్ధంగా ఉందా లేదా అనేది కూడా ముఖ్యమే. శరీరం అలసిపోయినా మన అంతర్గత జీవ గడియారం నిద్రపోయే సమయం వచ్చిందనే సంకేతాన్ని ఇవ్వదు. ఈ గడియారాన్ని జీవ లయ అంటారు. ఇది దాదాపు 24 గంటల వ్యవధిలో నిద్ర, మెళకువతోపాటు శరీరంలోని అనేక ప్రక్రియలను నియంత్రిస్తుంది. వెలుతురు, ఉష్ణోగ్రత వంటి పరిసర పరిస్థితులు దీనిపై ప్రభావం చూపుతాయి. మెదడులోని హైపోథాలమస్ ప్రాంతం జీవ లయను నియంత్రించడంలో ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది. పగటిపూట సహజమైన సూర్యకాంతి శరీరానికి మెళకువగా ఉండాల్సిన సమయమని సంకేతాలు ఇస్తుంది. చీకటి పడినప్పుడు నిద్రను ప్రోత్సహించే మెలటోనిన్ అనే హార్మోన్ ఉత్పత్తి పెరుగుతుంది. ఈ జీవ లయ నిద్రలోని వివిధ దశలను, ముఖ్యంగా గాఢ నిద్రను, స్వప్నాలతో సంబంధం ఉన్న ఆర్‌ఈఎం నిద్రను ప్రభావితం చేస్తుంది. అందువల్ల నిద్ర ఎంత నాణ్యంగా ఉందో, ఉదయం లేచినప్పుడు ఎంత ఉత్సాహంగా అనిపిస్తుందో కూడా దీనిపై ఆధారపడి ఉంటుంది. రాత్రిపూట ఫోన్, కంప్యూటర్ తెరలను ఎక్కువసేపు చూడడం వల్ల మెలటోనిన్ ఉత్పత్తికి ఆటంకం కలుగుతంది. పని, సామాజిక మాధ్యమాలు, వార్తలు, ఒత్తిడి మెదడును ఇంకా చురుగ్గా ఉంచుతాయి. నిద్రను మెరుగుపరచుకోవడానికి ఉదయం కొంతసేపు సహజమైన వెలుతురులో గడపాలి. ఇది శరీర జీవ గడియారాన్ని క్రమబద్ధం చేయడానికి సహాయపడుతుంది. రాత్రిపూట ప్రకాశవంతమైన దీపాలు, ఫోన్ తెరల వినియోగాన్ని తగ్గించాలి. అవసరమైతే తెరలపై నీలి వెలుతురును తగ్గించే సదుపాయాలను ఉపయోగించుకోవాలి. ప్రతిరోజూ ఒకే సమయానికి నిద్రించడం, ఉదయం ఒకే సమయానికి నిద్రలేవడం అలవాటు చేసుకోవాలి. వారాంతాల్లో కూడా ఈ క్రమాన్ని పాటించడం మంచిది. మధ్యాహ్నం తర్వాత, ముఖ్యంగా సాయంత్రం వేళల్లో కాఫీ వంటి ఉత్తేజక పదార్థాలను తగ్గించాలి. ఇది నిద్ర పట్టడాన్ని ఆలస్యం చేస్తుంది. నిద్రించే ముందు పుస్తకం చదవడం లేదా గోరువెచ్చని నీటితో స్నానం చేయడం వంటి ప్రశాంతమైన పనులు చేయడం వల్ల శరీరం విశ్రాంతికి సిద్ధమవుతుంది. పగటిపూట నిద్రపోవాల్సి వస్తే 20 నుంచి 30 నిమిషాలకు పరిమితం చేయాలి. ముఖ్యంగా సాయంత్రం ఆలస్యంగా నిద్రపోవడం రాత్రి నిద్రకు ఆటంకం కలిగిస్తుంది.

ఐఓసీకి రికార్డు లాభాలు

ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐఓసీ) ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జులై– సెప్టెంబరులో స్టాండలోన్ ప్రాతిపదికన రూ.21,630 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. ఒక త్రైమాసికంలో కంపెనీకి ఇదే అత్యధిక లాభం. రిఫైనింగ్ మార్జిన్‌లు గణనీయంగా పెరగడం ఇందుకు కలిసొచ్చింది. పెట్రోల్, డీజిల్ రిటెయిల్ విక్రయాలపై నష్టాలొచ్చినా, వంటగ్యాస్ సబ్సిడీ భారాన్ని ప్రభుత్వం ఇంకా అందించకున్నా.. ఇంతటి లాభాన్ని పొందడం గమనార్హం. ప్రతి షేరుపై లాభం రూ.15.71గా నమోదైంది. 2025–26 ఇదే త్రైమాసికంలో ఐఓసీ నికర లాభం రూ.7,610.45 కోట్లు (షేరుపై రూ.5.53) మాత్రమే. 2023–24 ఆర్థిక సంవత్సరం మొత్తంమీద ఐఓసీ ఆర్జించిన రూ.39,619 కోట్ల నికర లాభంలో సగానికి కంటే ఎక్కువ, సమీక్షా త్రైమాసికంలోనే సాధించడం విశేషం.

బిజినెస్

కేజీ బేసిన్ వివాదంలో మధ్యవర్తిగా సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి

కృష్ణా–గోదావరి(కేజీ) బేసిన్ గ్యాస్ విషయమై కేంద్రప్రభుత్వంతో రిలయన్స్ ఇండస్ట్రీస్, మరికొన్ని సంస్థలకు ఉన్న వివాదంలో మధ్యవర్తిగా సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తి, జస్టిస్ రంజన ప్రకాశ్ దేశాయ్‌ని అత్యున్నత న్యాయ స్థానం నియమించింది. ఈ వివాదంలో దేశాయ్ ఏకైక మధ్యవర్తిగా ఉంటారని పేర్కొంటూ, భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చీ, జస్టిస్ విపుల్ ఎం పంచోలీతో కూడిన ధర్మాసనం ఆదేశాలు జారీ చేసింది. మధ్యవర్తికి సహాయంగా ఆయా వర్గాలు సూచించే ఇద్దరు నిపుణులు ఉంటారనీ తెలిపింది.
కేంద్రంతో కేజీ బేసిన్ గ్యాస్ వివాదం విషయంలో ఒక పరిష్కారం కోసం మధ్యవర్తిత్వం/సయోధ్య కోరుతున్నామని, అంతవరకు విచారణను హోల్డ్‌లో పెట్టాలని రిలయన్స్ ఇండస్ట్రీస్‌తో పాటు, బీపీ ఎక్స్‌ప్లొరేషన్ (ఆల్ఫా), నికో(నెకో) వేసిన పిటిషన్‌ను మే 20న సుప్రీంకోర్టు తిరస్కరించింది.
కేంద్రంతో ఈ కంపెనీలకు ఏర్పడ్డ గ్యాస్ వివాదంలో తమకు సానుకూలంగా ఏకసభ్య న్యాయమూర్తి ఇచ్చిన మధ్యవర్తిత్వ తీర్పును పక్కనపెడుతూ, దిల్లీ హైకోర్టు డివిజన్ బెంచ్ జారీ చేసిన ఆదేశాలను సవాలు చేస్తూ.. ఆయా కంపెనీలు దాఖలు చేసిన అప్పీళ్లపై సుప్రీం కోర్టు విచారణ చేపట్టింది. తాజాగా మధ్యవర్తిని నియమించింది. బంగాళాఖాతంలోని కేజీ–డీ6 క్షేత్రం చెంతనే ఉన్న ఓఎన్‌జీసీ క్షేత్రాల నుంచి ఏడేళ్ల వ్యవధిలో 338.332 మిలియన్ బ్రిటిష్ థర్మల్ యూనిట్ల గ్యాస్‌ను రిలయన్స్–బీపీ–నికో సంస్థలు అక్రమంగా ఉత్పత్తి చేశాయని ఆరోపిస్తూ, 2016 నవంబరు 4న చమురు మంత్రిత్వశాఖ 1.47 బిలియన్ డాలర్ల (ప్రస్తుత డాలర్ విలువ ప్రకారం సుమారు రూ.14,000 కోట్ల) డిమాండ్ నోటీస్ పంపింది. దీనిపై కంపెనీలు న్యాయస్థానాలను ఆశ్రయించాయి. కేజీ–డీ6 క్షేత్రంలో రిలయన్స్‌కు 60%, బీపీకి 30%, నికోకు 10% వాటాలున్నాయి.

గోల్డ్ బాండ్స్‌పై అదిరిపోయే రిటర్న్స్

పసిడి బాండ్లలో పెట్టుబడులు పెట్టిన వారికి కాసుల వర్షం కురుస్తోంది. 2021లో పసిడి బాండ్లు కొన్నవారికి అధిక లాభాలు అందిస్తున్నాయి. తాజాగా ఈ బాండ్లకు సంబంధించిన ముందస్తు ఉపసంహరణ తేదీని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రకటించింది. ఈ క్రమంలో మదుపర్లు ఈ బాండ్లలో ఒక్కో గ్రాముపై దాదాపు 200 శాతం పైగా లాభపడ్డారు. 2021–22 సిరీస్ VII సావరీన్ గోల్డ్ బాండ్ల ప్రీమెచ్యూర్ తేదీని నవంబర్ 2గా ఆర్‌బీఐ పేర్కొంది. ఒక్కో యూనిట్ ధర రూ.14,167గా నిర్ణయించింది. అప్పట్లో ఈ బాండ్లను ఆఫ్‌లైన్‌లో కొనుగోలు చేస్తే.. ఒక్కో గ్రాము బంగారం ధర రూ.4,765, అదే ఆన్‌లైన్‌లో కొనుగోలు చేస్తే రూ.50 డిస్కౌంట్ అందించి గ్రాము బంగారం ధర రూ.4,715గా ఆర్‌బీఐ ప్రకటించింది. ఈ లెక్కన చూస్తే ప్రస్తుతం మదుపర్లకు గ్రాముపై సుమారు రూ.9,452 లాభం వచ్చినట్లే. అంటే దాదాపు 200 శాతం పైగా మదుపర్లు లాభాలు ఆర్జించారు. అప్పట్లో ఈ బాండ్లలో రూ.లక్ష పెట్టుబడి పెడితే.. ఇప్పుడు దాదాపు రూ.3.09 లక్షల లాభం వచ్చేది. పన్ను మినహాయింపుతో పాటు ఈ బాండ్ల ప్రారంభ పెట్టుబడిపై వార్షికంగా 2.5% వడ్డీ రేటు కూడా ఉంటుంది. సావరిన్ గోల్డ్ బాండ్ల కాలపరిమితి 8 ఏళ్లు.
అయితే మదుపర్లు ఐదో సంవత్సరం తర్వాత నుంచి ముందస్తు ఉపసంహరణ చేసుకునే వెసులుబాటు ఉంటుంది. గడువు ముగియకముందే నగదు కావాలనుకునే పెట్టుబడిదారుల కోసం ప్రీమెచ్యూర్ తేదీని ఎప్పటికప్పుడు ఆర్‌బీఐ ప్రకటిస్తుంది. గ్రాము ధరను నిర్ణయించేందుకు రిడెంప్షన్ ముందు వారం చివరి మూడు రోజుల ఇండియా బులియన్ అండ్ జ్యువెలర్స్ అసోసియేషన్ (IBJA) నిర్ణయించిన సగటు ధరను పరిగణనలోకి తీసుకుంటుంది. ఈ క్రమంలో అక్టోబర్ 28, 29, 30 తేదీల ఆధారంగా ప్రీమెచ్యూర్ ధర నిర్ణయించారు.

డీజిల్ ఎగుమతులపై విండ్‌ఫాల్ ట్యాక్స్ పెంపు

డీజిల్, ఏటీఎఫ్ ఎగుమతులపై కేంద్రం విండ్‌ఫాల్ గెయిన్స్ ట్యాక్స్‌ను పెంచింది. అయితే, పెట్రోల్‌పై సుంకాన్ని మాత్రం సున్నాకు తగ్గించడం గమనార్హం. అక్టోబర్ 31 నుంచి రెండు వారాల పాటు ఈ నిర్ణయాలు అమల్లో ఉంటాయని ఆర్థిక మంత్రిత్వ శాఖ నోటిఫికేషన్ జారీ చేసింది.
తాజా నిర్ణయంతో డీజిల్ ఎగుమతులపై ప్రత్యేక అదనపు ఎక్సైజ్ సుంకం (SAED) రేటు గతంలో లీటరుకు రూ.8.5 ఉండగా.. ఇప్పుడు రూ.11.5కు పెంచింది. విమాన ఇంధనం (ATF) ఎగుమతులపై లీటర్‌కు ఈ పన్నును రూ.10.5 నుంచి రూ.11కు పెంచింది. ఇక, పెట్రోల్ ఎగుమతులపై ట్యాక్స్ లీటరుకు రూ.2.5 ఉండగా.. దీన్ని సున్నాకు తగ్గించింది. దేశీయంగా వినియోగిస్తున్న డీజిల్, పెట్రోల్‌పై ప్రస్తుతం ఉన్న సుంకాల రేట్లలో ఎలాంటి మార్పు చేయలేదు. పశ్చిమాసియాలో ఉద్రిక్తతల నేపథ్యంలో దేశీయంగా ఇంధన లభ్యతను పెంచడానికి ప్రభుత్వం ఇటీవల విండ్‌ఫాల్ పన్ను విధించింది. ఇందులో భాగంగా మార్చి 27న డీజిల్, ఏటీఎఫ్‌లపై.. మే 16 నుంచి పెట్రోల్ ఎగుమతులపై ఎగుమతి సుంకాన్ని పెంచింది.

రిలయన్స్ లాభం రూ.29,550 కోట్లు

జియో ప్లాట్‌ఫామ్స్ రికార్డు స్థాయి లిస్టింగ్‌తో రిలయన్స్ ఇండస్ట్రీస్ (ఆర్‌ఐఎల్)కు మంచి విలువ జత చేరింది. కమొడిటీ అధిక ధరలు, అంతర్జాతీయ అనిశ్చితుల మధ్య కూడా మా ఓ2సీ వ్యాపారం రాణించింది. రిటెయిల్ వ్యాపారంలో ఆఫ్‌లైన్, ఆన్‌లైన్‌లో వినియోగదార్లు పెరిగారు. రిలయన్స్ ఇండస్ట్రీస్ (ఆర్‌ఐఎల్) సెప్టెంబరు త్రైమాసికంలో రూ.29,550 కోట్ల రికార్డు నికర లాభాన్ని నమోదు చేసింది. 2025–26 ఇదే కాల లాభం రూ.22,092 కోట్ల కంటే ఇది 33.8% అధికం. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జూన్ త్రైమాసిక లాభం రూ.23,196 కోట్లతో పోల్చినా ఇది ఎక్కువే. సమీక్షా త్రైమాసికంలో కంపెనీ యజమానులకు దక్కే నికర లాభం 40% పెరిగి రూ.25,548 కోట్లకు చేరుకుంది. రిటెయిల్ విభాగం మోస్తరుగానే రాణించినా.. చమురు వ్యాపారంలో బలమైన రిఫైనింగ్ మార్జిన్లు, డిజిటల్ వ్యాపారంలో వృద్ధి కలిసి సంస్థకు లాభాలు పెంచాయి. దీంతో ఒక్కో షేరుకు ఆర్జన రూ.13.32 నుంచి రూ.18.88కి పెరిగింది. అన్ని విభాగాల ఆదాయాలు రాణించడంతో ఆర్‌ఐఎల్ ఏకీకృత ఆదాయం 27.8% పెరిగి రికార్డు స్థాయిలో రూ.3.62 లక్షల కోట్లకు చేరుకుంది. చమురు నుంచి రసాయనాల (ఓ2సీ) వ్యాపారంలో పెట్రోరసాయనాల మార్జిన్లు, డిజిటల్ సేవల్లో సగటు వినియోగదారు ఆదాయం పెరగడం లాభదాయకతకు ఉపకరించింది. పశ్చిమాసియా అనిశ్చితుల మధ్యా ఓ2సీ ఎబిటా 67.9% వృద్ధితో రూ.25,203 కోట్లకు, ఆదాయం 44.2% పెరిగి రూ.2.31 లక్షల కోట్లకు చేరుకుంది. ఓ2సీ వ్యాపారం అత్యుత్తమ త్రైమాసిక పనితీరు కనబరచిందని ఆర్‌ఐఎల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అనంత్ అంబానీ పేర్కొన్నారు.
స్టాక్ ఎక్స్ఛేంజీల్లో తాజాగా నమోదైన జియో ప్లాట్‌ఫామ్స్, సెప్టెంబరు త్రైమాసికంలో 13.7% వృద్ధితో రూ.8,387 కోట్ల ఏకీకృత నికర లాభాన్ని నమోదు చేసింది. ఎబిటా 16.6% పెరిగి రూ.21,879 కోట్లుగా ఉంది. ఏకీకృత ఆదాయాలు 11.3% పెరిగి రూ.47,485 కోట్లకు చేరాయి. జియో వినియోగదార్ల సంఖ్య 54.24 కోట్లకు చేరుకుంది. ఇందులో 30 కోట్ల మంది 5జీలో ఉన్నారు. ఫిక్స్‌డ్ బ్రాడ్‌బ్యాండ్‌లో 3 కోట్లు, ఎయిర్‌ఫైబర్‌లో 1.5 కోట్ల కనెక్షన్లున్నాయి. సగటు వినియోగదారు ఆదాయం(ఆర్పు) రూ.211.4 నుంచి రూ.218.8కి చేరుకుంది.
రిలయన్స్ రిటెయిల్ స్థూల ఆదాయం రూ.86,169 కోట్ల నుంచి 6.43% పెరిగి రూ.91,716 కోట్లకు చేరినా, నికర లాభం 24.3% తగ్గి రూ.2,611 కోట్లకు పరిమితమైంది. కార్యకలాపాల ఆదాయం 5.78% వృద్ధితో రూ.80,220 కోట్లుగా నమోదైంది. సమీక్షా త్రైమాసికంలో 303 కొత్త స్టోర్లు జత కావడంతో, మొత్తం స్టోర్లు 19,947కు చేరాయి. కొన్ని స్టోర్లను మూసివేయడంతో, జూన్‌తో పోలిస్తే నికరంగా 222 స్టోర్లు తగ్గాయి. 'డిజిటల్ కామర్స్, బీ2బీ వంటి వేగవంతమైన వృద్ధి విభాగాలున్న కొత్త మోడల్‌కు ఆఫ్‌లైన్ వ్యాపార లాభాలతో నిధులు సమకూరుస్తామ'ని రిలయన్స్ రిటెయిల్ ఈడీ ఈశా అంబానీ పేర్కొన్నారు. జియో లిస్టింగ్ నేపథ్యంలో తొలిసారిగా ఆర్‌ఐఎల్ త్రైమాసిక ఇన్వెస్టర్ కాల్‌లో జియో ఎండీ ఆకాశ్ అంబానీ కూడా పాల్గొన్నారు. 'శాటిలైట్ కమ్యూనికేషన్స్, 6జీ మేధోసంపత్తి, ఏఐ ఆధారిత వాయిస్, డేటా సేవలపై మా సామర్థ్యాలను కొనసాగిస్తూ, వాటాదార్లకు మెరుగైన ప్రయోజనాలందిస్తామ'ని ఆకాశ్ పేర్కొన్నారు.

క్రీడలు

కుల్‌దీప్ యాదవ్‌ను ఎందుకు ఆడించలేదు: అంబటి రాయుడు

ఆక్లాండ్‌లో న్యూజిలాండ్‌తో జరిగిన నాలుగో టీ20లో స్పిన్నర్ కుల్‌దీప్ యాదవ్‌ను ఆడించకపోవడాన్ని మాజీ బ్యాటర్ అంబటి రాయుడు తప్పుబట్టాడు. ఆక్లాండ్ మైదానంలో బౌండరీలు చిన్నగా ఉండటంతో భారత బౌలర్లు భిన్నమైన వ్యూహాన్ని అనుసరించాల్సి వచ్చిందని.. ఇలాంటి పరిస్థితుల్లో కుల్‌దీప్ యాదవ్ ఒక మంచి ఆప్షన్‌గా ఉండేవాడని రాయుడు పేర్కొన్నాడు.
''అక్షర్ పటేల్, నమన్ ధీర్ వేగంగా బౌలింగ్ చేస్తారు. కానీ, స్ట్రెయిట్ బౌండరీ చిన్నగా ఉండటం వల్ల బ్యాటర్లు స్క్వేర్ బౌండరీల వైపు కొట్టాలని కోరుకున్నప్పుడు బౌలింగ్ వేగాన్ని తగ్గించాలి. ఈ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని భారత జట్టు యాజమాన్యం ఈ మ్యాచ్‌లో కుల్‌దీప్ యాదవ్ ను ఉపయోగించుకుని ఉండాల్సింది. అతను బౌలింగ్ వేగాన్ని తగ్గించి బ్యాటర్లను స్క్వేర్ బౌండరీల వైపు కొట్టేలా ఒత్తిడి పెంచుతాడు. భారత బౌలర్లు ఫుల్ లెంగ్త్ బంతులపై ఆధారపడతారు.

ఎదురుదాడికి తలొంచారు

ఒక మ్యాచ్‌లో 225 పరుగులు చేసినా సరిపోలా.. మరో మ్యాచ్‌లో 199 లక్ష్యాన్ని 14వ ఓవర్‌కే ఛేదించేశారు.. మామూలుగా ఆడితే లాభం లేదని న్యూజిలాండ్ విధ్వంసాన్ని పతాక స్థాయికి తీసుకెళ్లింది. అర్ధశతకాలతో పనవ్వడం లేదని గ్లెన్ ఫిలిప్స్ ఈసారి సెంచరీనే కొట్టేశాడు. బ్రాస్‌వెల్ కూడా కసితీరా బాదేశాడు. తమ టీ20 చరిత్రలోనే అత్యధిక స్కోరు సాధించిన కివీస్.. తర్వాత బంతితోనూ రాణించి టీమ్‌ఇండియాకు పర్యటనలో తొలి ఓటమిని రుచి చూపింది.
న్యూజిలాండ్ పర్యటనలో టీమ్‌ఇండియా జోరుకు బ్రేక్ పడింది. హ్యాట్రిక్ విజయాలతో టీ20 సిరీస్‌ను ముందే సొంతం చేసుకుని, క్లీన్‌స్వీప్‌పై గురి పెట్టిన శ్రేయస్ సేనకు.. కివీస్ షాకిచ్చింది. నాలుగో టీ20లో ఏకంగా 87 పరుగుల తేడాతో భారీ విజయాన్నందుకుంది. సిరీస్‌లో వరుసగా నాలుగో మ్యాచ్‌లోనూ టాస్ గెలిచిన భారత్ ఫీల్డింగ్ ఎంచుకోగా, కివీస్ 7 వికెట్లకు 259 పరుగుల భారీ స్కోరు సాధించింది. సూపర్ ఫామ్‌లో ఉన్న గ్లెన్ ఫిలిప్స్ (107; 49 బంతుల్లో 6×4, 10×6) మెరుపు శతకం సాధించగా.. మైకేల్ బ్రాస్‌వెల్ (65; 25 బంతుల్లో 4×4, 6×6) కూడా విధ్వంసక ఇన్నింగ్స్ ఆడాడు. భారత బౌలర్లలో మయాంక్ యాదవ్ 3 వికెట్లు తీశాడు. అనంతరం ఏ దశలోనూ లక్ష్యం దిశగా సాగని టీమ్‌ఇండియా 9 వికెట్లకు 172 పరుగులే చేసింది. తిలక్ వర్మ (35; 35 బంతుల్లో 1×4, 3×6) టాప్‌స్కోరర్. జాకబ్ డఫీ (4/23), మిచెల్ శాంట్నర్ (2/24) భారత్‌ను దెబ్బ తీశారు. సిరీస్‌లో చివరిదైన అయిదో టీ20 ఆదివారం జరుగుతుంది.
ప్రత్యర్థి ఎవరైనా, ఆడుతున్నది ఎక్కడైనా 260 లక్ష్యాన్ని ఛేదించడమంటే మాటలు కాదు. అది జరగాలంటే అదిరే ఆరంభం దక్కాలి. కానీ భారత ఛేదన పేలవంగా మొదలవడంతో విజయం అసాధ్యమని తేలిపోయింది. సిరీస్‌లో తేలిపోతున్న కివీస్ పేసర్ జాకబ్ డఫీ.. ఈసారి ఎంతో ప్రభావవంతంగా బౌలింగ్ చేశాడు. అతడి బౌలింగ్‌లో తొలి బంతికి ఫోర్ కొట్టిన సంజు శాంసన్.. రెండో బంతికి వికెట్ ఇచ్చేశాడు. తెలివిగా బౌన్సర్ సంధించి అతణ్ని బుట్టలో వేసిన డఫీ.. గాయం నుంచి కోలుకుని, వైభవ్ స్థానంలో తిరిగి జట్టులోకి వచ్చిన ఇషాన్‌ను అయిదో బంతికి రిటర్న్ క్యాచ్‌తో పెవిలియన్ చేర్చి భారత్‌ను గట్టి దెబ్బ తీశాడు.
తొలి ఓవర్లోనే 2 వికెట్లు పడిపోవడంతో అభిషేక్ (27) కూడా సహజ శైలిలో చెలరేగలేకపోయాడు. స్పిన్నర్ ఫిషర్ వేసిన అయిదో ఓవర్లో అతను 4, 6 బాది ఊపందుకునే ప్రయత్నం చేశాడు కానీ.. అంతలోనే ఔటైపోయాడు. ఆ వెంటనే శ్రేయస్ (22)ను మిల్నే బౌల్డ్ చేయడంతో పవర్ ప్లేలో 61/4తో భారత్ భారీ ఓటమి దిశగా సాగింది. సిరీస్‌లో గొప్పగా బౌలింగ్ చేస్తున్న శాంట్నర్ కూడా.. ఒకే ఓవర్లో 2 వికెట్లు తీశాడు. రెండు సిక్స్‌లు బాదిన నితీశ్ (21)తో పాటు అక్షర్ పటేల్‌ను అతను ఔట్ చేశాడు. తర్వాత తిలక్, నమన్ ధీర్ (28)ల పోరాటం ఓటమి అంతరాన్ని తగ్గించడానికి ఉపయోగపడింది. డఫీ మరోసారి ఒకే ఓవర్లో రెండు వికెట్లు తీయడంతో 12 ఓవర్లకే భారత్ 123/8కు చేరుకుంది. కానీ తిలక్‌కు ప్రిన్స్ (18 నాటౌట్) సహకరించడంతో భారత్ ఆలౌట్ కాకుండా మ్యాచ్‌ను ముగించింది.
దంచేశారు: మొదట కివీస్‌కు శుభారంభం దక్కకపోయినా.. ఫిలిప్స్, బ్రాస్‌వెల్ అసాధారణ బ్యాటింగ్‌తో ఊహించని స్కోరు సాధించింది. భువి స్థానంలో జట్టులోకి వచ్చిన యువ పేసర్ మయాంక్ యాదవ్.. సీఫర్ట్ (3)ను ఎక్కువసేపు నిలవనీయలేదు. కొన్ని షాట్లు ఆడిన మిచెల్ (24; 11 బంతుల్లో 2×4, 2×6) త్వరగా ఔటైపోయాడు.

భారత క్రికెట్‌కు వైభవ్ 'మంచి పెట్టుబడి'.. కానీ: సనత్ జయసూర్య

భారత యువ ఆటగాడు వైభవ్ సూర్యవంశీపై శ్రీలంక మాజీ కెప్టెన్ సనత్ జయసూర్య ప్రశంసల వర్షం కురిపించాడు. భారత్ క్రికెట్‌కు అతడు మంచి పెట్టుబడిగా మారాడని వ్యాఖ్యానించాడు. ఇక అభిషేక్ శర్మ మైదానం నలువైపులా షాట్లు కొట్టగల సమర్థుడని జయసూర్య మెచ్చుకున్నాడు. పరిమిత ఓవర్ల క్రికెట్‌లో బ్యాటర్ల ఆధిపత్యంపైనా ఈ శ్రీలంక మాజీ దిగ్గజం కీలక వ్యాఖ్యలు చేశాడు. ఇండియన్ సాఫ్ట్‌బాల్ క్రికెట్ లీగ్ జట్లు ముంబయి రాయల్స్, మహారాష్ట్ర సూపర్ స్ట్రైకర్స్ జెర్సీ లాంచ్ ఈవెంట్‌లో జయసూర్య మాట్లాడాడు. ''భారత జట్టులో అద్భుతమైన టాలెంట్ కలిగిన కుర్రాళ్లు ఉన్నారు. మరీ ముఖ్యంగా సంచలన ఆటతో అదరగొట్టేస్తోన్న వైభవ్ సూర్యవంశీ టీమ్‌ఇండియాకు మంచి పెట్టుబడి. సహజమైన ఆట ఆడేలా అతడిని ప్రోత్సహిస్తే చాలు. అనవసరమైన ఒత్తిడికి గురి చేయొద్దు. అభిషేక్ శర్మ దూకుడు బాగుంది. అతడు ఆల్‌రౌండ్ ప్లేయర్. అభిషేక్.. బ్యాటింగ్‌లో ఎక్కడ స్ట్రాంగ్ అనేది చెప్పడం కష్టమే. మైదానమంతా షాట్లు కొడుతున్నాడు. వీరే కాకుండా మిగిలిన యువ ఆటగాళ్లూ కష్టపడుతున్నారు'' అని జయసూర్య తెలిపాడు. ''ప్రస్తుతం మా జట్టు ముక్కోణపు సిరీస్‌లో పాక్‌తో ఫైనల్ ఆడేందుకు సిద్ధమవుతోంది. భారత్‌తో సిరీస్‌కు ముందు ఇది మాకు మంచి అవకాశం. ఇక్కడ గెలిచి ఆత్మవిశ్వాసంతో అక్కడ అడుగు పెడతాం. టీమ్‌ఇండియా సిరీస్‌లోనూ నాణ్యమైన క్రికెట్ ఆడతారని ఆశిస్తున్నా. ఇటీవల పరిమిత ఓవర్ల క్రికెట్ ఆధిపత్యం కొనసాగడం మంచి పరిణామం. ఆటగాళ్లూ అంతే ఆత్మవిశ్వాసంతో ఆడుతున్నారు. ఏ జట్టు లేదా ప్లేయర్‌కైనా అదే ముఖ్యం. భారీగా పరుగులు ఇచ్చినా.. ఆ టార్గెట్‌ను ఛేదించేందుకూ టీమ్‌లు ఏమాత్రం వెనుకాడటం లేదు. అయితే, దీనివల్ల బౌలర్లు ఒత్తిడికి గురవుతోన్న మాట వాస్తవం'' అని జయసూర్య వ్యాఖ్యానించాడు.

సెమీస్‌లో సింధు

హైలో ఓపెన్ సూపర్ 500 బ్యాడ్మింటన్ టోర్నీలో స్టార్ షట్లర్ పి.వి.సింధు సెమీఫైనల్‌కు దూసుకెళ్లింది. శుక్రవారం ఏకపక్షంగా సాగిన మహిళల సింగిల్స్ క్వార్టర్స్‌లో సింధు 21–12, 21–10తో అమేలీ షజ్ (జర్మనీ)ను చిత్తుగా ఓడించింది. సింధు మ్యాచ్‌ను 27 నిమిషాల్లోనే ముగించింది. హోరాహోరీగా సాగిన మరో క్వార్టర్స్‌లో అన్మోల్ ఖర్బ్ 21–17, 18–21, 21–16తో ఉన్నతి హుడాపై విజయాన్నందుకుంది. టైటిల్ పోరులో చోటు కోసం సింధు, అన్మోల్ తలపడతారు. పురుషుల సింగిల్స్‌లో లక్ష్య సేన్ కూడా ముందంజ వేశాడు. అతడు 14–21, 21–17, 21–13తో కాల్ కొజోనెన్ (ఫిన్లాండ్)పై నెగ్గాడు. తొలి రౌండ్ కోల్పోయిన తర్వాత లక్ష్య అద్భుతంగా పుంజుకున్నాడు. ప్రత్యర్థి గట్టిపోటీ ఇచ్చినప్పటికీ చివరికి అతడే పైచేయి సాధించాడు.

పాక్ విజయానికి వారం సెలవు ఇవ్వాల్సిందే.. ప్రధాని షరీఫ్‌పై ట్రోల్స్ వర్షం

పాకిస్థాన్ ప్రధాని షహబాజ్ షరీఫ్‌పై నెట్టింట్లో ట్రోల్స్ వర్షం కురుస్తోంది. ఒక చిన్న టోర్నీలో భారత్‌పై పాకిస్థాన్ సాధించిన విజయానికి ఆయన స్పందించడమే అందుకు కారణం. ఆయన అత్యుత్సాహం నెటిజన్లను షాక్‌కు గురిచేసింది.
ఇంతకీ ఏం జరిగిందంటే.. హాంకాంగ్ సిక్సెస్ టోర్నమెంట్‌లో శుక్రవారం భారత్–పాక్ తలపడ్డాయి. ఈ మ్యాచ్‌లో పాకిస్థాన్ 4 వికెట్ల తేడాతో విజయం సాధించింది. ఈ చిన్న టోర్నమెంట్‌లో గ్రూప్ మ్యాచ్‌లో తన దేశ జట్టు సాధించిన విజయానికి ప్రధాని షరీఫ్ పొంగిపోయారు. ఎంతో ఉత్సాహంతో జట్టు సభ్యులను పొగుడుతూ పోస్టు పెట్టారు. ''భారత్‌పై అద్భుతమైన విజయం సాధించిన కుర్రాళ్లకు అభినందనలు. అదొక మంచి మ్యాచ్. మన ఆటగాళ్లకు మద్దతు ఇవ్వడంలో అంకితభావంతో కృషి చేసిన పీసీబీ ఛైర్మన్ మోసిన్ నఖ్వీ, ఆయన బృందానికి నా అభినందనలు'' అంటూ పొగడ్తల వర్షం కురిపించారు. ఈ పోస్టు నెట్టింట్లో తీవ్ర చర్చనీయాంశమైంది.

సుకుమార్ దృష్టిలో పడిన తెలుగమ్మాయి..

వుదయం సినిమా: గ్లోబల్ స్టార్ రామ్ చరణ్, వర్సటైల్ డైరెక్టర్ సుకుమార్ కాంబినేషన్‌లో రాబోతున్న అత్యంత ఆసక్తికరమైన పాన్ ఇండియా ప్రాజెక్ట్ ‘RC 17’. ‘రంగస్థలం’ వంటి ఇండ స్ట్రీ హిట్ తర్వాత వీరిద్దరి కాంబోలో తెరకెక్కబోతున్న చిత్రం కావడంతో దీనిపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. అయితే ఈ సినిమాకు సంబంధించిన పూజా కార్యక్రమాలు నవంబర్ 1న ప్రారంభం కాబోతున్నట్లు సమాచారం. ఇక గత కొద్ది కాలంగా ఇందులో హీరోయిన్ ఎవరనే దానిపై నెట్టింట రకరకాలు పేర్లు చక్కర్లు కొడుతున్నాయి. సారా అర్జున్, అనీత్ పడ్డా వంటి పలువురి పేర్లు వినిపించినప్పటికీ, తాజాగా తెలుగమ్మాయి సాత్విక వీరవల్లిని మేకర్స్ ఫైనల్ చేయడం టాలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారింది. అమెరికాలో ఇంజనీరింగ్ పూర్తి చేసి శా స్త్రీయ నృత్యంలో ప్రతిభ ఉన్న సాత్విక, తన మొదటి సినిమా ‘ఆకాశంలో ఒక తార’తో ఇండ స్ట్రీకి పరిచయం కాబోతుంది. ఇందులో దుల్కర్ సల్మాన్ సరసన హీరోయిన్‌గా కనిపించనుంది. అయితే ఇంకా ఈ సినిమా విడుదల కాకుండానే సాత్విక ఇండ స్ట్రీ దృష్టిని ఆకర్షించారు. నటనపై పట్టు ఉన్న నటి కోసం వెతుకుతున్న తరుణంలో, సాత్విక స్క్రీన్ ప్రెజెన్స్ సుకుమార్‌ను విశేషంగా ఆకట్టుకుందట. అందుకే ఆమెను తీసుకోవాలని భావిస్తున్నట్లు నెట్టింట వార్తలు వస్తున్నాయి. ఇంకా మొదటి సినిమా థియేటర్లలోకి రాకుండానే రామ్ చరణ్ పక్కన ఛాన్స్ దక్కించుకోవడంతో సాత్విక పేరు సోషల్ మీడియాలో మార్మోగిపోతోంది.

వుదయం సినిమా

MOVIE TIME!

అనిరుధ్, జీవీ ప్రకాష్‌లకు నో ఛాన్స్, బాలయ్య సినిమా అప్‌డేట్ ఇదే!

వుదయం సినిమా: నందమూరి నటసింహం బాలకృష్ణ, దర్శకుడు కొరటాల శివ కాంబినేషన్‌లో తెరకెక్కనున్న భారీ చిత్రం NBK 112పై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. బాలయ్య మాస్ ఇమేజ్‌కు కొరటాల శివ మార్క్ కథనం తోడైతే థియేటర్లలో అభిమానులకు పండగే అన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో పూజా కార్యక్రమాలతో ఈ సినిమాను ఘనంగా ప్రారంభించారు. ఎసఎల్‌వీ సినిమాస్ పతాకంపై సుధాకర్ చెరుకూరి ఈ చిత్రాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. అయితే ప్రస్తుతం ఈ సినిమాకు సంబంధించిన సంగీత దర్శకుడి ఎంపికపై ఆసక్తికర చర్చ నడుస్తోంది. NBK 112కు సంగీతం అందించబోయే దర్శకుడు ఎవరనే విషయంపై గత కొన్ని రోజులుగా సోషల్ మీడియాలో రకరకాల వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. తొలుత తమిళ స్టార్ సంగీత దర్శకుడు అనిరుధ్ రవిచందర్ ఈ ప్రాజెక్ట్‌కు పనిచేయబోతున్నారని ప్రచారం జరిగింది. అయితే ఆయన వరుస సినిమాలతో బిజీగా ఉండటంతో ఈ ప్రాజెక్ట్ నుంచి తప్పుకున్నట్లు కథనాలు వెలువడ్డాయి. ఆ తర్వాత అనిరుధ్ స్థానంలో మరో ప్రముఖ సంగీత దర్శకుడు జీవీ ప్రకాష్ కుమార్‌ను తీసుకున్నారంటూ వార్తలు వచ్చాయి. దీంతో బాలయ్య సినిమాకు జీవీ ప్రకాష్ సంగీతం అందించబోతున్నారని అభిమానులు భావించారు. ఈ వార్తలు సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారం కావడంతో మ్యూజిక్ డైరెక్టర్ ఎంపికపై ఆసక్తి మరింత పెరిగింది.

‘జయంత్ అండ్ ది జింగో పెన్’ ట్రైలర్ లాంచ్ ఈవెంట్

వుదయం సినిమా: నమో జయం ప్రొడక్షన్స్ బ్యానర్ లో దివ్య ప్రవీణ్ బొలిశెట్టి నిర్మాణంలో జాతీయ అవార్డు గ్రహీత నవీన్ దేశబోయిన తెరకెక్కించిన చిత్రం ‘జయంత్ అండ్ ది జింగో పెన్’. ఈ సినిమాలో మాస్టర్ జయంత్ బొలిశెట్టి, మన శంకర వర ప్రసాద్ ఫేమ్ ఊహా రెడ్డి, సత్యం

రాజేష్, ఆశిష్ గాంధీ, మానస రాధాకృష్ణన్, తనికెళ్ల భరణి, కాశీ విశ్వనాథ్, మానిక్ రెడ్డి, అశోక్ కుమార్, శ్రీకాంత్ రెడ్డి, తదితరులు ముఖ్య పాత్రలను పోషించారు. ‘జయంత్ అండ్ ది జింగో పెన్’ చిత్రం నవంబర్ 12న చిల్డ్రన్స్ డే స్పెషల్‌గా థియేటర్లలో విడుదల కానుంది.చిన్నారులకు ఆలోచింపజేసే, మంచి సందేశాన్ని అందించేలా రూపొందిన ఈ చిత్రం పిల్లలకు తల్లిదండ్రులకు టీచర్స్కు ఒక మంచి సినీ అనుభూతిని అందించనుంది.చిన్నారులతో పాటు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులందరూ కలిసి ఈ చిత్రాన్ని చూడాలని చిత్ర బృందం కోరుతోంది. ఈ చిల్డ్రన్స్ డే సందర్భంగా పిల్లలతో కలిసి ఆనందించదగిన చిత్రంగా ‘జయంత్ అండ్ ది జింగో పెన్’ నిలవనుంది.ఈ క్రమంలో ఈ మూవీ ట్రైలర్‌ను లిటిల్ ఫ్లవర్ స్కూల్‌లో శుక్రవారం నాడు విడుదల చేశారు. ఈ మేరకు నిర్వహించిన ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో..ఎమ్మెల్సీ శ్రీపాల్ రెడ్డి మాట్లాడుతూ .. ‘‘జయంత్ అండ్ ది జింగో పెన్’ కథ చాలాబాగుంది. దివ్యప్రవీణ్ నాకు ఈ సినిమా గురించి ముందే చెప్పారు. నేను కూడా ఓ టీచర్‌గా పని చేశాను.

‘ది ప్రైడ్ ఆఫ్ భారత్ – ఛత్రపతి శివాజీ మహారాజ్’ చిత్రం కోసం టి-సిరీస్ సంస్థ చేతులు కలిపింది..

వుదయం సినిమా: భారతదేశపు అత్యంత గౌరవనీయ చారిత్రక మహనీయులలో ఒకరైన ఛత్రపతి శివాజీ మహారాజ్ యొక్క అసాధారణ జీవితం, వారసత్వం మరియు దార్శనికతను కీర్తించే ప్రతిష్టాత్మక రెండు భాగాల చారిత్రక గాథ అయిన ‘ది ప్రైడ్ ఆఫ్ భారత్ – ఛత్రపతి శివాజీ మహారాజ్’ చిత్రం కోసం టి-సిరీస్ సంస్థ చేతులు కలిపింది. ఈ చిత్రం ఛత్రపతి శివాజీ మహారాజ్ మరియు ఆయన స్వరాజ్య దార్శనికతను ఒక బృహత్తర చలనచిత్ర రూపంలో ఆవిష్కరించడానికి భూషణ్ కుమార్, సందీప్ సింగ్ మరియు రిషబ్ శెట్టిలను ఒకచోట చేర్చింది. ఈ సహకారానికి గుర్తుగా, ఈ చారిత్రాత్మక చలనచిత్ర ప్రయత్నాన్ని తమ బృందం ఎంతటి ప్రగాఢమైన గౌరవంతో, బాధ్యతతో చేపడుతోందో ప్రతిబింబిస్తూ, భూషణ్ కుమార్ శతాబ్దం నాటి ఛత్రపతి శివాజీ మహారాజ్ చిత్రపటాన్ని రిషబ్ శెట్టికి బహూకరించి గౌరవించారు.విశాల దృక్పథంతో రూపొందించిన ఈ రెండు భాగాల గాథ, ఛత్రపతి శివాజీ మహారాజ్ యొక్క అద్భుతమైన

ప్రస్థానంలోని కీలకమైన యుద్ధాలు, అసాధారణ త్యాగాలు, చారిత్రాత్మక విజయాలు మరియు అంతగా తెలియని ఘట్టాలను అన్వేషిస్తుంది. తరతరాలకు స్ఫూర్తినిస్తూనే ఉన్న ఆయన సైనిక మేధస్సు, వ్యూహాత్మక దూరదృష్టి, నిర్భయ నాయకత్వం మరియు స్వరాజ్యం పట్ల ఆయన చూపిన పరివర్తనాత్మక దృక్పథాన్ని ఈ కథనం ఆవిష్కరించాలని లక్ష్యంగా పెట్టుకుంది. భారతదేశం మరియు విదేశాల నుండి ప్రతిభను ఒకచోట చేర్చిన సృజనాత్మక బృందంతో, విస్తృతమైన తారాగణంతో రూపొందిన ఈ ప్రాజెక్ట్, భారత చరిత్రలోని ఈ కీలక ఘట్టాన్ని అన్ని తరాల ప్రేక్షకులకు అందించే ఒక లీనమయ్యే చలనచిత్ర అనుభవాన్ని అందించాలని ఆకాంక్షిస్తోంది.

"మైనా" మూవీ ఘనంగా ప్రారంభం

వుదయం సినిమా: టాలీవుడ్ టాప్ ప్రొడక్షన్ హౌస్ మైత్రీ మూవీ మేకర్స్, ప్రొడ్యూసర్ సాయి రాజేష్ కొత్త నిర్మాణ సంస్థ మిట్టి అండ్ మూన్ ఫిలింస్ సంయుక్తంగా నిర్మిస్తున్న సినిమా "మైనా". ఈ సినిమాకు సాయి రాజేష్ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. ఈ చిత్రంలో శివమణి పట్నంశెట్టి, గీత మహావడి, చంటి బాబు, దివ్య జయరాజ్ హీరో హీరోయిన్స్ గా నటిస్తున్నారు. మహి ఇప్పలపెల్లి కథ, స్క్రీన్ ప్లే అందిస్తుండగా, చంటి బాబు దర్శకత్వం వహిస్తున్నారు. మెలొడీ బ్రహ్మ మణిశర్మ ఈ చిత్రానికి సంగీతాన్ని అందిస్తున్నారు."మైనా" సినిమా ఈ రోజు హైదరాబాద్ ఫిలింనగర్ దైవసన్నిధానంలో పూజా కార్యక్రమాలతో ఘనంగా ప్రారంభమైంది. ఈ సినిమా అనౌన్స్ మెంట్ సందర్భంగా ఫస్ట్ లుక్ పోస్టర్ రిలీజ్ చేశారు. తమ ప్రేమకు ఎదురైన ఆటంకాలను దాటుకుంటూ రెండు ప్రేమ జంటలు ముందుకు వెళ్తుండటం ఈ ఫస్ట్ లుక్ పోస్టర్ లో చూపించడం ఆసక్తి కలిగిస్తోంది. లవ్ స్టోరీస్ రాయడంలో, ప్రొడ్యూస్ చేయడంలో తన ప్రత్యేకత చూపించే సాయి రాజేష్ నిర్మాణంలో మరో క్రేజీ లవ్ స్టోరీగా "మైనా" సినిమా తెరకెక్కనుంది. త్వరలోనే ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ కు వెళ్లనుంది.

‘ఓ నా సిద్ధయ్య’ సాంగ్ లాంచ్

వుదయం సినిమా: సినిమా థియేటర్‌లో చూసే అనుభూతిని అవుట్‌డోర్ లోనూ ప్రేక్షకులకు అందించాలనే వినూత్న ఆలోచనతో ‘ఓ నా సిద్ధయ్య’ టీమ్ సరికొత్త సంచలనానికి తెరలేపింది. భారతదేశంలోనే తొలిసారిగా అవుట్‌డోర్ వేదికపై 70ఎంఎం భారీ స్క్రీన్‌తో పాటు డాల్బీ అట్మాస్ సౌండ్ సిస్టమ్‌ను ఏర్పాటు చేసి ఈ ప్రైవేట్ ఆల్బమ్ సాంగ్‌ను అత్యంత వైభవంగా విడుదల చేసింది. అక్టోబర్ 30న శుక్రవారం సాయంత్రం హైదరాబాద్‌లోని శంషాబాద్ ప్రభుత్వ కళాశాల, పాఠశాల మైదానంలో జరిగిన ఈ వేడుకకు 5 వేల మందికి పైగా ప్రేక్షకులు హాజరయ్యారు.

భారీ వర్షం కురుస్తున్నప్పటికీ ప్రేక్షకుల ఉత్సాహం ఏమాత్రం తగ్గలేదు. వర్షాన్ని సైతం లెక్క చేయకుండా అభిమానులు, ప్రేక్షకులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో ఈ కార్యక్రమం అంగరంగ వైభవంగా జరిగింది.ఈ గ్రాండ్ ఈవెంట్‌కు ప్రముఖ నటుడు సోనూసూద్ ముఖ్య అతిథిగా హాజరై ‘ఓ నా సిద్ధయ్య’ పాటను లాంచ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఓపెన్ ప్లేస్‌లో 70ఎంఎం భారీ స్క్రీన్‌పై పాటను విడుదల చేయడం ఎంతో సంతోషంగా ఉందని అన్నారు. ఇలాంటి వినూత్న ప్రయత్నం చేసిన సిద్ధయ్య టీమ్‌ను అభినందిస్తూ, పాట మంచి విజయం సాధించాలని ఆకాంక్షించారు.మరో ముఖ్య అతిథిగా హాజరైన రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి. ప్రకాష్ గౌడ్ మాట్లాడుతూ.. ఈ కార్యక్రమంలో పాల్గొనడం ఎంతో సంతోషంగా ఉందని తెలిపారు. ‘ఓ నా సిద్ధయ్య’ పాట ప్రేక్షకుల ఆదరణ పొందడంతో పాటు పెద్ద విజయం సాధించాలని ఆకాంక్షించారు.ఈ వేడుకకు హీరో ఇంద్రరామ్, సింగర్ నల్గొండ గద్దర్ నరసన్న, ప్రముఖ గాయకుడు, మ్యూజిక్ డైరెక్టర్ బోలే షావలి, నటుడు ఉత్తేజ్‌తో పాటు పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు హాజరయ్యారు. వీరంతా ‘ఓ నా సిద్ధయ్య’ టీమ్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు.

"సమ్మర్ హాలిడేస్" ప్రతి పాత్రకు ఎమోషనల్ గా కనెక్ట్ అవుతారు

ప్రొడ్యూసర్ ధీరజ్ మొగిలినేని

వుదయం సినిమా: కథా బలమున్న చిత్రాలను ప్రేక్షకులకు అందిస్తూ సక్సెస్ ఫుల్ ప్రొడ్యూసర్ గా, డిస్ట్రిబ్యూటర్ గా పేరు తెచ్చుకున్నారు ధీరజ్ మొగిలినేని. ఆయన తన ధీరజ్ మొగిలినేని ఎంటర్ టైన్ మెంట్స్ బ్యానర్ పై "సమ్మర్ హాలిడేస్" అనే చిల్డ్రన్ మూవీని నిర్మిస్తున్నారు. "సమ్మర్ హాలిడేస్" సినిమాను మన చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసే ఒక అందమైన కథతో దర్శకుడు శ్రీకర్ రూపొందిస్తున్నారు. ఈ చిత్రంలో మాస్టర్ రోహన్, మాస్టర్ అరుణ్, బేబి ఖుషి కీలక పాత్రల్లో నటిస్తున్నారు. నవంబర్ 6న "సమ్మర్ హాలిడేస్" సినిమా గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు వస్తోంది. ఈ రోజు జరిగిన ఇంటర్వ్యూలో మూవీ హైలైట్స్ తెలిపారు ప్రొడ్యూసర్ ధీరజ్ మొగిలినేని – ఈ కథ విన్నప్పుడు మనసును హత్తుకుంది. నా రియల్ లైఫ్, నా చైల్డ్ హుడ్ మెమొరీస్ గుర్తుకువచ్చాయి. ఈ సినిమాలో అమ్మమ్మ పాత్రలో జయసుధ చెప్పే డైలాగ్స్ మా అమ్మమ్మ చెప్పినట్లు, వాసుకి గారు చెప్పే మాటలు మా అమ్మ చెప్పినట్లు అనిపించాయి. మా అమ్మ అలాగే నాతో మాట్లాడేది. నాతో పాటు ప్రేక్షకులకు కూడా అదే ఫీల్ కలుగుతుందని నమ్మాను. ఈ కథలో చిన్నపిల్లల పాత్రలను టీనేజ్ లోకి మార్చి ఒక లవ్ స్టోరీ పెట్టి కమర్షియల్ గా మార్చవచ్చు. కానీ బాల్యంలో ఉండే ఆ ఇన్నోసెన్స్ పోతుంది. పాత్రల్లోని ఆ సున్నితత్వమే ఈ కథలో కీలకమైంది. – మనకు ట్రెండ్ బ్రేక్ చేసే సినిమాలో ఎన్నో వస్తుంటాయి. పెళ్లిచూపులు వంటి సినిమాల తర్వాత మన దగ్గర రొమాంటిక్ కామెడీ మూవీస్ ట్రెండ్ పోయింది అన్నారు. ఆ తర్వాత ప్రేమలు సినిమా తెలుగులో డబ్ అయి ఆదరణ పొందింది. ఆ తర్వాత లిటిల్ హార్ట్స్ వచ్చింది. "సమ్మర్ హాలిడేస్" కథను చెబితే మళ్లీ పిల్లల సినిమాలు ఇండస్ట్రీలో నిర్మిస్తారని, ఆ చిత్రాలకు మా సినిమా స్ఫూర్తిగా నిలుస్తుందని నమ్మాం. అమ్మమ్మగా నటించిన జయసుధ గారు మొన్న ట్రైలర్ లాంచ్ కు రావాల్సిఉంది. ఆమె నెక్ట్స్ ఈవెంట్ కు వస్తున్నారు.– నేను నమ్మిన కథను బలంగా ప్రేక్షకుల దగ్గరకు తీసుకెళ్లాలని ప్రయత్నిస్తున్నా. సమ్మర్ సీజన్ లో మా సినిమా రిలీజ్ చేయాలని అనుకున్నా కుదరలేదు. ఇప్పుడు రిలీజ్ కుదిరింది కాబట్టి దీపావళి పండక్కి కరెక్టేమో అనిపించింది. ఈ నెల 30న వచ్చే సినిమాలు నవంబర్ 6కు వాయిదా పడతాయని భయపడ్డాం కానీ అవేమీ రావడం లేదు. లక్కీగా మా సినిమాకు దాదాపు సోలో రిలీజ్ దొరికిందని అనుకోవచ్చు. ఒక స్పెషల్ అటెంప్ట్ చేసే చిత్రాలకు, కొత్త నిర్మాతలు తీసే చిన్న చిత్రాలకు, స్థానికంగా రూపొందించే సినిమాలకు ప్రభుత్వం నుంచి ఏదైనా రాయితీ ఇస్తే బాగుంటుంది. ఎందుకంటే థియేటర్స్ నుంచి రెవెన్యూ తగ్గిపోయింది. ఓటీటీలు పెద్ద సినిమాలే తీసుకుంటున్నాయి. ఈ పరిస్థితుల్లో చిన్న సినిమాకు ప్రభుత్వం సపోర్ట్ ఇస్తే బాగుంటుంది. – మా సినిమాకు నవంబర్ 6న మంచి థియేటర్స్ దొరుకుతున్నాయి. పాజిటివ్ టాక్ మొదలయ్యాక ఇంకా పెరుగుతాయి. మా సినిమాలో మెసేజ్ ఏమీ ఉండదు.

‘మైలురాయి’ టైటిల్ లాంచ్

వుదయం సినిమా: హన్సి ప్రొడక్షన్స్ బ్యానర్‌పై ప్రొడక్షన్ నెం. 1గా శ్రీ హన్సిక పెద్దిరెడ్డి నిర్మిస్తున్న చిత్రం ‘మైలురాయి’. తవిటిరాజు తలచింతల సహ నిర్మాతగా వ్యవహరిస్తున్న ఈ చిత్రానికి టాలెంటెడ్ డైరెక్టర్ రఘువర్ధన్ కోట్ల దర్శకత్వం వహిస్తున్నారు. యువ నటీనటులు జగన్ యోగిరాజు, నవ్య చిట్యాల హీరో హీరోయిన్లుగా నటిస్తున్నారు. వీరితో పాటు సీనియర్ నటుడు దేవీ ప్రసాద్ కీలక పాత్రలో కనిపించనున్నారు. లక్ష్మణ్ మీసాల, పవన్ రమేష్, సునందిని, అంజు వాల్గుమన్ ఇతర ముఖ్య పాత్రల్లో నటిస్తున్నారు.తాజాగా ఈ చిత్ర టైటిల్ లాంచ్ పోస్టర్‌ను సీనియర్ నటుడు, నిర్మాత, ఏపీ శాసనమండలి సభ్యుడు, ఏపీ గ్రీన్ ఛైర్మన్ శ్రీ నాగబాబు విడుదల చేశారు. ఈ సందర్భంగా నాగబాబు మాట్లాడుతూ.. ‘‘ఈ సినిమా టైటిల్ ‘మైలురాయి’ చాలా ఆసక్తికరంగా ఉంది. నిర్మాత హన్సిక మంచి సినిమాతో తన కెరీర్‌ను ప్రారంభించారు. ఔత్సాహిక దర్శకుడు, యువ హీరోతో ఈ చిత్రాన్ని రూపొందించడం అభినందనీయం. ఫిల్మ్ మేకింగ్‌లో మహిళలకు ఉండే బాధ్యత, క్రమశిక్షణ ఎంతో గొప్పవి. ఇప్పటికే అశ్వనీదత్ గారి కుమార్తెలు స్వప్న దత్, ప్రియాంక దత్, నా కుమార్తె నిహారిక, సుప్రియ యార్లగడ్డ వంటి వారు చిత్ర పరిశ్రమలో మంచి గుర్తింపు తెచ్చుకుంటున్నారు. హన్సిక కూడా వారి బాటలోనే పయనిస్తూ మరిన్ని విజయాలు సాధించాలని కోరుకుంటున్నాను. ఈ చిత్ర బృందంలోని ప్రతి ఒక్కరికీ నా శుభాకాంక్షలు’’ అని అన్నారు. నిర్మాత శ్రీ హన్సిక పెద్దిరెడ్డి మాట్లాడుతూ.. ‘‘మా హన్సి ప్రొడక్షన్స్ బ్యానర్‌పై ప్రొడక్షన్ నెం. 1గా రూపొందుతున్న ‘మైలురాయి’ టైటిల్ లాంచ్ పోస్టర్‌ను నాగబాబు గారి చేతుల మీదుగా విడుదల చేయడం చాలా సంతోషంగా ఉంది. సినిమా షూటింగ్ పూర్తయింది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు జరుగుతున్నాయి. త్వరలోనే టీజర్, పాటలను విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నాం’’ అని తెలిపారు. సహ నిర్మాత తవిటిరాజు తలచింతల మాట్లాడుతూ.. ‘మైలురాయి’ చిత్రాన్ని లవ్ అండ్ ఫ్యామిలీ డ్రామాగా తెరకెక్కిస్తున్నామని తెలిపారు.

Printed, Published & Owned by Sirikonda Maria, Ashish Publications H.No. 1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020 and Published from H. No. 4-1-47, Kothur Janda, Hanmakonda, Warangal Urban - 506001, Telangana.
Editor : Sirikonda Maria, RNI No. TELTEL/2015/65064, E-mail : voodayam2007@gmail.com, Cell : 9247698676.